



ESTD: 1999
www.voodayam.com

# వుదయం






కరీంనగర్ | 31-05-2026 ఆదివారం | సంపుటి : 14 | సంచిక :167 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on

## తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవం

**హైదరాబాద్, మే 30(వుదయం) :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఛైర్మన్ డా. కె. కేశవరావు అధ్యక్షతన సమావేశం అయ్యింది. కమిటీ సభ్యులు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి లు సంబంధిత ఉన్నతాధికారులతో జరిపిన ఈ సమావేశంలో విధి విధానాలు, ఉద్యమకారుల సమాచార సేకరణ తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన G.O.Rt.No.679 జారీ చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కమిటీ సచివాలయంలో మొదటి సారి నేడు సమావేశమైంది. జూన్ 4వ తేదీన అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనాడు ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారందరిని గుర్తించి ప్రభుత్వం సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని కమిటీ ఛైర్మన్ డా. కె. కేశవరావు తెలిపారు. అమరవీరుల కుటుంబాలు, తెలంగాణ ఉద్యమం తొలి, మలి దశ లలో క్షేత్రస్థాయిలో ఉద్యమంలో పాల్గొన్న వారి వివరాలు సేకరించి పారదర్శకంగా అర్హుల జాబితా తయారీకి తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను కమిటీ ఆదేశించింది. ఉద్యమకారుల గుర్తింపు ప్రమాణాలు, జైలు శిక్షలు అనుభవించిన వారు, పలు పోలీస్



కేసుల నమోదు, ఉద్యమంలో పాల్గొన్న మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, అడ్వకేట్ లు, విద్యార్థులు, ఆర్.టి.సి కార్మికులు, సింగరేణి కార్మికులు, వారందరిని గుర్తించి, సముచితంగా గౌరవించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించడం, అలాగే వారి సేవలు, త్యాగాలకు తగిన గౌరవం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ కమిటీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గౌరవం, గుర్తింపు అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ప్రజా ప్రభుత్వం పనిచేస్తున్నదని, సమాచార సేకరణలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా ఉద్యమంలో పాల్గొన్న వారందరిని గుర్తించి సముచితంగా గౌరవించాలని ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్నాయక్, హోం శాఖ ముఖ్యకార్యదర్శి శిఖా గోయల్, జి.ఎ.డి కార్యదర్శి రఘునందన్ రావు, జి.ఎ.డి ప్రోటోకాల్ డైరెక్టర్ హరీష్, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహా రెడ్డి, న్యాయ శాఖ కార్యదర్శి పాపి రెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఐఎస్ఐ-దావూద్‌లతో సంబంధాలు గల 9 మంది అరెస్టు

**ఢిల్లీ, ముంబైలను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాద కుట్ర పన్నుతున్నారన్న ఆరోపణ**



**న్యూఢిల్లీ, మే 30 (వుదయం):** పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ)తో, పరారీలో ఉన్న డాన్ దావూద్ ఇబ్రహీంతోనూ సంబంధాలున్న తొమ్మిది మంది అనుమానిత ఉగ్రవాదులను ఢిల్లీ స్పెషల్ సెల్ పట్టుకుందని మే 30, శనివారం నాడు అధికారులు తెలిపారు. అధికారుల ప్రకారం, అనుమానితులు ఢిల్లీ, ముంబై, పంజాబ్‌లకు చెందిన నివాసితులు కాగా, వారిలో కొందరు విదేశీయులు కూడా ఉన్నారు. దర్యాప్తుతో పాటు, వారి వద్ద నుంచి అత్యాధునిక పిస్టళ్లు, గ్రెనేడ్లు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఉపయోగించే ఇతర వస్తువులతో సహా భారీ పరిమాణంలో మందుగుండు సామగ్రిని, ఆయుధాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. పాకిస్థాన్‌లోని తమ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు అనుమానిత ఉగ్రవాదులు పనిచేస్తున్నారని అధికారులు ధృవీకరించారు. భారతదేశంలో భయాందోళనలు సృష్టించి, భద్రతకు విఘాతం కలిగించేందుకు పలు దాడులు చేయాలని వారికి బాధ్యత అప్పగించారు. ఈ బృందాన్ని అరెస్టు చేయడానికి ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్‌కు నిఘా సమాచారం అందింది. ఢిల్లీ, మహారాష్ట్ర, పంజాబ్‌లలో అరెస్టులు పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, అరెస్టు అయిన వారు ఢిల్లీ, మహారాష్ట్ర, పంజాబ్ వంటి వివిధ రాష్ట్రాల నివాసితులు. అరెస్టు అయిన వారిలో విదేశీయులు కూడా ఉన్నారని, వారి జాతీయతలను ఇంకా స్పష్టం చేయలేదని నివేదికలు పేర్కొంటున్నాయి. నిందితులకు, ముంబైలోని అండర్‌వరల్డ్ గ్యాంగ్‌స్టర్లకు మధ్య సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నెట్‌వర్క్ లాజిస్టిక్స్, ఫైనాన్సింగ్, వ్యక్తుల తరలింపు కోసం చట్టవిరుద్ధ మార్గాలను ఉపయోగించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. స్పెషల్ సెల్ ఈ మాడ్యూల్ చుట్టూ పనిచేస్తున్న ఆర్థిక లావాదేవీలు, కమ్యూనికేషన్లు, మొత్తం నెట్‌వర్క్‌ను పరిశీలిస్తోంది. అంతేకాకుండా, నిందితులు రెక్కీ నిర్వహిస్తున్నప్పుడు, ఇలాంటి మరి కొంతమంది ఆపరేటివ్‌లు ఇతర ప్రాంతాలలో కూడా ఇదే పనిచేస్తూ ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. పెరిగిన భద్రతా ఆందోళనలు, కట్టుదిట్టమైన భద్రతా నిఘా నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఉగ్రవాద కుట్రలను నివారించడంలో ఈ భద్రతా చర్యను ఒక ముఖ్యమైన మైలురాయిగా పరిగణిస్తున్నారు. బలహీనమైన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. నిఘా సంస్థలు ఈ నెట్‌వర్క్‌ను, దానికి ఉన్నట్లు అనుమానిస్తున్న సరిహద్దు సంబంధాలను ఇంకా విశ్లేషిస్తున్నాయి. నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న సామాగ్రి ద్వారా అదనపు సమాచారాన్ని రాబట్టడానికి తదుపరి దర్యాప్తు జరుగుతోంది.

## పట్టణ పేదలకు పెద్దన్నరేవంత్ రెడ్డి కానుకగా ఇందిరమ్మ ఇళ్లు

**హైదరాబాద్, మే 30(వుదయం)** పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగిలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. శనివారం నాడు బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 3040 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు. రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా



కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ , సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి ధీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ సునీల్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## కాక్రోచ్ జనతా పార్టీకి చోటు కల్పించేందుకు ఆర్ఎస్ఎస్ మద్దతు

### చర్చ, అసమ్మతి ప్రజాస్వామ్యాన్ని బలపరుస్తాయని వ్యాఖ్య

**వుదయం డెస్క్, మే 30:** భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, కొత్తగా వస్తున్న గొంతులు, భిన్నమైన అభిప్రాయాలు, నూతన రాజకీయ వ్యక్తీకరణలకు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) అని పిలుస్తున్న పార్టీతో సహా, అనేక సంస్థలకు చోటు కల్పించేంత పటిష్టంగా ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పేర్కొంది. విలేకరులతో జరిగిన ఒక అనధికారిక సంభాషణలో ఆర్ఎస్ఎస్ అఖిల్ భారతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య భాగస్వామ్యం, బహిరంగ చర్చ భారతదేశ రాజకీయ సంస్కృతికి అత్యవసరమైన లక్షణాలని నొక్కి చెప్పారు. సిజెపి ఆవిర్భావం, ప్రజా చర్చలలో పెరుగుతున్నయువ పౌరుల భాగస్వామ్యం గురించిన ప్రశ్నలకు సమాధానంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**చర్చల ద్వారా ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది**

స్థాపిత రాజ్యాంగ యంత్రాంగాల ద్వారా పౌరులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి భారతదేశ ప్రజాస్వామ్య సంస్థలు విస్తృతమైన అవకాశాన్ని కల్పిస్తున్నాయని అంబేకర్ అన్నారు. క్రమం తప్పని ఎన్నికలు, చురుకైన మీడియా రంగం, సోషల్ మీడియా వేదికల పెరుగుదల వంటివి భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే వ్యవస్థకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.



ఎలాంటి చర్చ జరిగినా, ప్రజలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేసినా దాన్ని ఆశ్చర్యంగా భావించకూడదు. వాటిని సాధారణ ప్రక్రియలో భాగంగా పరిగణించాలి, అని ఆయన అన్నారు. అంబేకర్ ప్రకారం, కొత్త సమూహాలు లేదా ఉద్యమాల ఆవిర్భావాన్ని ఆందోళన కలిగించే విషయంగా కాకుండా, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య సహజ ఫలితంగా చూడాలి. అటువంటి కార్యక్రమాలలో పాలుపంచుకునే వ్యక్తులు, సంస్థలు చివరికి ప్రజాస్వామ్య మార్గాల ద్వారా తమ సమస్యలను తామే పరిష్కరించుకుంటారని ఆయన సూచించారు. భారతదేశం పట్ల జెన్ జీ ఆశావాదంతో ఉందని ఆర్ఎస్ఎస్ భావిస్తోంది యువ భారతీయుల పాత్రను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దేశ భవిష్యత్తుపై జెన్జీ కి ఉన్న విశ్వాసం, జాతీయ అభివృద్ధికి సానుకూలంగా దోహదపడాలనే నిబద్ధత వారిలో ఉన్నాయని అంబేకర్ అభివర్ణించారు. మన యువతరం, కొన్నిసార్లు జెన్ జీ అని పిలుస్తున్నవారు, చాలా ఆశాభావంతో ఉన్నారు. వారికి భారతదేశంపై అపారమైన విశ్వాసం ఉంది. వారు చేసేది ఏదైనా రాజ్యాంగ ప్రక్రియ పరిధిలోనే ఉంటుంది. భారతదేశాన్ని ముందుకు తీసుకెళ్లడమే వారి కృషి, అని అంబేకర్ వివరించారు. యువత వివిధ రంగాలలో చురుకుగా పాల్గొంటూ, భారతదేశ వృద్ధి, ప్రగతికి దోహదపడే ప్రయత్నాలకు తమ శక్తిని వెచ్చిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, మీడియా, ఇతర ప్రజాస్వామ్య వ్యవస్థలు సవాళ్లను స్వతంత్రంగా ఎదుర్కోగలవని చెబుతూ, దేశ సంస్థలపై ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

**చర్చలపై వైఖరిని పునరుద్ఘాటించిన ఆర్ఎస్ఎస్**

పాకిస్తాన్‌తో సంబంధాల గురించి ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ఇటీవల చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, అవగాహనను మెరుగుపరచడానికి, విభేదాలను పరిష్కరించడానికి ఒక మార్గంగా సంఘ్ ప్రజల మధ్య చర్చలకు నిరంతరం మద్దతు ఇస్తుందని అంబేకర్ అన్నారు.

అదే సమయంలో, అధికారిక దౌత్య సంబంధాలకు సంబంధించిన నిర్ణయాలు ఎన్నికైన ప్రభుత్వాలు, విధాన రూపకర్తల బాధ్యతగానే ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. భారత విభజనపై ఆర్ఎస్ఎస్ చారిత్రక వైఖరి గురించి కూడా అంబేకర్ ప్రస్తావించారు. ఆ సంస్థ దేశ విభజనను వ్యతిరేకించిందని, ఆ కాలంలో ఆర్ఎస్ఎస్ ఉనికి మరింత బలంగా ఉండి ఉంటే సంఘటనలు వేరే విధంగా ప్రభావితం చేసి ఉండేవని ఆయన వాదించారు. రాజకీయాల్లో యువత భాగస్వామ్యం, ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దడంలో సోషల్మీడియా పాత్ర, సమకాలీన భారతదేశంలో విస్తృత శ్రేణి దృక్కోణాలను స్వీకరించే ప్రజాస్వామ్య సంస్థల సామర్థ్యం వంటి అంశాలపై కొనసాగుతున్న చర్చల మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

## గ్రీన్‌కార్డులపై అమెరికా సర్కారు యూటర్న్..

**అమెరికా :** అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డ్) నిబంధనల విషయంలో అమెరికా యూటర్న్ తీసుకుంది. గ్రీన్‌కార్డ్ దరఖాస్తు ప్రక్రియ జరుగుతోన్న సమయంలో వలసదారులు యూఎస్‌ను విడిచి వెళ్లాల్సిన అవసరం లేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ (DHS) తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. తాత్కాలిక వలసదారులు గ్రీన్‌కార్డ్ దరఖాస్తులు సమర్పించడానికి స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ(యూఎస్‌సీఐఎస్) మే 21న చేసిన ప్రకటన గందరగోళానికి దారితీసిన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా డీహెచ్ఎస్ వివరణ ఇచ్చింది.

తాజా ప్రకటనలో డీహెచ్ఎస్ స్పందిస్తూ.. ఇదేమీ విస్తృతస్థాయి విధాన మార్పేమీ కాదని పేర్కొంది. దరఖాస్తుదారుడు గ్రీన్‌కార్డు ప్రక్రియను అమెరికాలో ఉండి పూర్తిచేయాలా? స్వదేశానికి వెళ్లాలా? అన్నదానిని ఇమిగ్రేషన్ అధికారి నిర్ణయిస్తారని తెలిపింది (Green Card Rules). ఇది ఎప్పటినుంచో అమల్లో ఉన్న నిబంధనే అని పేర్కొంది.






# గ్రేటర్ హైదరాబాద్



## గొప్ప పరిపాలన దక్షుడు ఛత్రపతి శివాజీ మహారాజ్



**- పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**
**- సుల్తాన్పూర్ లో 10 లక్షల రూపాయల సొంత నిధులతో శివాజీ విగ్రహావిష్కరణ**
**అమీన్పూర్ (వుదయం):**

నేటి యువతరానికి స్ఫూర్తి ప్రదాత అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్ గొప్ప పరిపాలనదక్షుడని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామంలో 10 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం వేలాది మంది ప్రజల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...శివాజీ మహారాజ్ గొప్ప పోరాటయోధుడు గానే కాకుండా గొప్ప పరిపాలనాదక్షుడుగా పేరు పొందారని అన్నారు. చరిత్రలో గొప్ప నాయకులుగా కీర్తించబడ్డ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వారి చరిత్రను, చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను నేటి తరానికి తెలియజేయడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. పటాన్చెరు నియోజకవర్గంలో శివాజీ విగ్రహాల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. యువత పెడదారి పట్టకుండా దేశ భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ సర్పంచులు పట్నం రాజు, భాస్కర్ గౌడ్, పాండు, సీనియర్ నాయకులు మల్లేష్, శ్రీకాంత్, శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు గణేష్, గ్రామ పుర ప్రముఖులు, యువత పాల్గొన్నారు.

## సిద్దాపూర్ డంప్ యార్డ్ వ్యవహారంపై వాస్తవాలు మాట్లాడండి

**బిఆర్ఎస్ నేత, రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్**
**ఎమ్మెల్యే గారు నిక్కచ్చిగా వ్యవహరించండి**
**సిద్దాపూర్ లో ఇంటర్నేషనల్ స్టేడియం ఏర్పాటు చేయండనీ విజ్ఞప్తి**
**షాద్ నగర్**



మీడియా సమావేశంలో రాజా వరప్రసాద్ షాద్ నగర్ నియోజకవర్గానికి ముప్పుగా పరిణమించే సిద్ధాపూర్ దంపింగ్ యార్డ్ ఏర్పాటు పై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నిక్కచ్చిగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, ప్రజలను మభ్యపెట్టి ఏ మార్చే అవసరం లేదని షాద్ నగర్ బిఆర్ఎస్ నేత, రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో రాజా వరప్రసాద్ మాట్లాడుతూ.. సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ కారణంగా షాద్ నగర్ డస్ట్ బిన్ లా మారొద్దని విజ్ఞప్తి చేశారు. సిద్దాపూర్ వద్ద డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే షాద్ నగర్, మహేశ్వరం, కల్వకుర్తి మూడు నియోజకవర్గాలకు దీని ఎఫెక్ట్ ఉంటుందని అన్నారు. ఎవరైనా బుద్ధి జ్ఞానం ఉన్నోళ్లు అంతర్జాతీయ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ పక్కనే ఇది ఏర్పాటు చేస్తామని ప్రతిపాదనలు పెట్టడం మూర్ఖత్వమని అన్నారు. ఈరోజు అహ్మదాబాద్ లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఎంతో పెద్ద ఎత్తున కట్టారని అలాంటి స్టేడియం సిద్దాపూర్ వద్ద నిర్మాణం చేస్తే ఎంతో ప్రయోజనాత్మకంగా ఉంటుందని లేకపోతే ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయాలని అంతేతప్ప చెత్త డంపు ఈ ప్రాంతానికి అవసరం లేదని రాజావరప్రసాద్ స్పష్టం చేశారు. కొత్తూరు ఉమ్మడి మండల నందిగామ ప్రాంతానికి చెందినవారు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కాబట్టి ఈ ప్రాంతం డంపు యార్డ్ గా మారకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యే శంకర్ పై ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టుగా, సర్పంచ్ గా, ఎమ్మెల్యేగా అనేక బాధ్యతలు నిర్వహించిన వీర్లపల్లి శంకర్ ఇక్కడ ప్రాంత ప్రజల ఆవేదన ఆందోళన అర్థం చేసుకొని ఎట్టి పరిస్థితుల్లో డంపింగ్ యార్డ్ నిర్వహించకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో నిక్కచ్చిగా మాట్లాడాల్సిన అవసరం ఉందని మోసపూరిత చర్యలు వద్దని రాజవరప్రసాద్

## ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలి – సీపీఎం డిమాండ్



**ఆన్‌లైన్ విధానం వల్ల కూలీలకు ఇబ్బందులు..**
**పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**చేవెళ్ల, మే 30 (వుదయం)**

చేవెళ్ల మండల పరిధిలోని కౌకుంట్ల గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల సమస్యలను తెలుసుకునేందుకు వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకుడు రాజు ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించిన సీపీఎం నాయకులు కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీఎం చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అల్లి దేవేందర్ ... ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పిస్తూ రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు ఆర్థిక భరోసాగా నిలిచే ఉపాధి హామీ పథకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఉపాధి హామీ పనుల్లో తీసుకొచ్చిన కొత్త ఆన్‌లైన్ విధానం, ఫోటో నమోదు ప్రక్రియ కారణంగా సర్వర్లు సరిగా పనిచేయక కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. సాంకేతిక సమస్యల వల్ల పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య కూడా తగ్గుతోందని పేర్కొన్నారు. గతంలో అమలులో ఉన్న విధానాన్ని పునరుద్ధరించి కూలీలకు ఇబ్బందులు లేకుండా పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా, ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసి వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## డిక్షనరీలు కాదు.. ముందు చరిత్ర చదువు

**చంద్రబాబు జీతగాడు "బక్కని నర్సింహులు"**
**బిఆర్ఎస్ నేత, రాష్ట్ర మాజీ సహకార యూనియన్ చైర్మన్ రాజా వరప్రసాద్**
**పూజకు పనికిరాని పువ్వు "బక్కని" అంటూ ఘాటు వ్యాఖ్యలు**
**బిఆర్ఎస్ నేత, రాష్ట్ర మాజీ సహకార యూనియన్ చైర్మన్ రాజా వరప్రసాద్**
**ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో మీడియా సమావేశం**
**టిఆర్ఎస్ అధినేత్రి కవితకు అంత సీన్ లేదు..**
**బిజెపి, తెలుగుదేశం పార్టీలతో కలిసి రేవంత్ రెడ్డి కుట్ర**
**తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు,**
**షాద్ నగర్**



మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు పురాణాలు మాత్రమే ఎక్కువగా చదివారు చరిత్ర గురించి పెద్దగా తెలియదు కాబట్టే డిక్షనరీలో తెలంగాణ లేదు అంటూ దిగజారిన మాటలు మాట్లాడారని ఆయనకు కావలిస్తే తెలంగాణ చరిత్ర పుస్తకాలు భౌగోళిక శాస్త్ర విషయాలను ఆయనకు పంపిస్తానని వాటిని చదువుకొని మాట్లాడాలి అంటూ షాద్ నగర్ బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ సహకార యూనియన్ చైర్మన్ రాజా వరప్రసాద్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో రాజా వరప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ పదం డిక్షనరీలో లేదు, కొంతమంది స్వార్థం కోసం తెలంగాణను వాడుకున్నారని చేసిన బక్కని వ్యాఖ్యలపై రాజవరప్రసాద్ భగ్గుమన్నారు. పూజలకు మొగలి పువ్వు ఎలా పనికి రాదో అలాగే బక్కని నరసింహులు కూడా పూజకి పనికిరాని పువ్వు లాంటి వారు అని ఎగతాళిగా మాట్లాడారు.పూర్వం రాణాలు ఇచ్చేవాడని ప్రస్తుతం బక్కని నరసింహులు కూడా చంద్రబాబు దగ్గర చేస్తున్నది అదేనని అన్నారు. చంద్రబాబు జీతగాడిగా బక్కని నరసింహులు వ్యవహరిస్తున్నాడని తెలంగాణ మర్యాదను మంటగల్పుతున్నాడని అన్నారు. బక్కని నరసింహులు కన్న తను వయసులో చాలా చిన్నవాడినని ఆయన పురాణాలు ఈ ప్రాంత ప్రయోజనాల కోసం ఆనాడు హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఇక్కడి ఎమ్మెల్యేగా తన పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప చరిత్ర ఉందని, ఆ చరిత్రను నేడు బక్కని నరసింహులు మంట కలిపారని ప్రజల విలువ తీసి పారేశారని పేర్కొన్నారు. తెలంగాణపై తెలుగుదేశం పార్టీకి ఎంత అక్కసు ఉందో వేరేగా చెప్పనక్కర లేదని, చంద్రబాబు వద్ద చెంచాగిరి చేసే బదులు ప్రాంత ప్రయోజనాలకు పాటుపడాలని రాజవరప్రసాద్ సూచించారు. ముందు డిక్షనరీకి చరిత్రకు తేడా తెలుసుకోవాలని ఆ తర్వాత మాట్లాడాలని సూచించారు. తమ హక్కుల కోసం తెలంగాణ పోరాటంలో వేలాదిమంది చనిపోయారని బలిదానాలు చేశారని ఆనాడు చంద్రబాబు చేత కూడా కేసీఆర్ జై తెలంగాణ చెప్పించారని గుర్తు చేశారు. తెలంగాణ వచ్చాక కూడా ఈ ప్రాంతంపై తెలుగుదేశం కుట్రలు పన్నుతుందని చెప్పడానికి బక్కని వ్యాఖ్యలు నిదర్శనమని అన్నారు గులామి చోడో.. గులాబీ భరోభారత రాష్ట్ర సమితి సంస్థ గత నిర్మాణం పెద్ద ఎత్తున జరగబోతుందని రాజవరప్రసాద్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ బిజెపి టిఆర్ఎస్ పార్టీలు వీడి యువత తెలంగాణ ఆకాంక్ష కోసం నిర్మాణమైన భారత రాష్ట్ర సమితిలో చేరాలని గులామి చోడో.. గులాబీ భరో అంటూ నినాదాన్ని పలికారు. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో డిజిటల్ సభ్యత్వానికి ఇన్చార్జిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఉన్నారని, షాద్ నగర్ నియోజకవర్గానికి బైకాని శ్రీనివాస్ యాదవ్ వస్తున్నారని పెద్ద ఎత్తున పార్టీ సభ్యత్వం జరపాలని కోరారు. కవిత రాజకీయాల్లో నాకంటే జూనియర్.. రాజకీయాల్లో టిఆర్ఎస్ అధినేత్రి కవిత తనకంటే జూనియర్ అని రాజా వరప్రసాద్ సీఎం కేసీఆర్ కూతురు కవిత అయినప్పటికీ ఆమె జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీలో విభాగంగా పనిచేశారని దానికి కృతజ్ఞతగా కేసీఆర్ ఆమెకు నిజాంబాద్ రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులో అంతర్భాగమైన లక్ష్మీదేవి పల్లి వరకు పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ 8 శాతం పనులు తమ ప్రభుత్వమే చేసిందని గుర్తు చేశారు. అనేక రకాలుగా లక్ష్మీదేవి పనులు చేపట్టకుండా గతంలో మోకాలు అడ్డువేశారని స్పష్టం చేశారు. బాల్క సుమన్ వ్యాఖ్యలపై "నో కామెంట్" తెలంగాణపై బక్కని నరసింహులు చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డ రాజావురా ప్రసాద్ కు మీడియా పల్కా సుమన్ మాట్లాడిన వీడియోలపై మీ అభిప్రాయం ఏమిటి అని ప్రశ్నించింది. ఎన్నో ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లిన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న బాల్క సుమన్ పార్టీ అంతర్గత సమావేశంలో సహజసిద్ధంగా మాట్లాడిందవచ్చని అయినా అతనిపై కేసు నమోదు అయినది కాబట్టి అంశంపై నో కామెంట్ అంటూ మౌనం వహించారు..

## అభివృద్ధిపై బురదజల్లే వారిని పట్టించుకోవద్దు..!



**షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"**
**రైతుల నుండి ప్రతి గింజ కొంటామని హామీ**
**మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై పాలకవర్గ సమీక్షా సమావేశం**
**రైతు సంక్షేమంపై దృష్టిని సాధించాలని సూచన**
**ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు**
**షాద్ నగర్**

వ్యవసాయ మార్కెట్ యార్డుపై తప్పుడు ప్రచారం చేసే వారిని రైతు సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకునీ బురద జల్లే వారిని పట్టించుకోవాల్సిన అవసరం ఎంత మాత్రం లేదని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. షాద్ నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి అధ్యక్షతన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మార్కెట్ సెక్రటరీ, కమీషన్ ఏజెంట్లతో షాద్ నగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. మార్కెట్ యార్డులో ధాన్యం విక్రయానికి వచ్చే రైతుల వద్ద నుండి ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మార్కెట్ మద్దతు ధర కంటే ఎక్కువగా చెల్లించి కొనడం శుభసూచకమని అన్నారు. పాలకవర్గం సూచన అధికారుల కృషి కమిషన్ ఏజెంట్ల చొరవతో ఎలాంటి ఆటంకాలు లేకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తడిసిన ప్రతి గింజను కొన్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మార్కెట్ యార్డులో మౌలిక వసతులపై అభివృద్ధిపై చర్చిస్తూ రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు అనుగుణంగా పరిస్థితులు ఉన్నప్పటికీ కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై బురదజల్లే పని పెట్టుకుంటున్నారని అలాంటి వారిని పట్టించుకోవద్దని తమ పని తాము చేసుకుంటూ వెళ్లిపోవాలని ఈ సందర్భంగా సూచించారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే విషయాలను పరిగణలోకి తీసుకొని రాజకీయంగా చేసే విమర్శలను పట్టించుకోకూడదని పాలక కమిటీకి సూచించారు. యాడుకు వచ్చే ప్రతి గింజను కొనుగోలు చేసే విధంగా అధికారులు పాలకవర్గం కమిటీ కమిషన్ ఏజెంట్లు చొరవ చూపాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, డైరెక్టర్ కరుణాకర్ భరత్ లోహోటీ, రవి నాయక్, పి నర్సింలు, కక్కునూరు సందీప్ కుమార్, వెంకట నరసింహారెడ్డి, తాడిశెట్టినవీన్, కమిషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా, జగదీశ్వర్ గుప్తా , కొత్ర రాజు, సరపు మల్లేష్, సంజీవయ్య, పెంటయ్య, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం విద్యార్థుల ఎదురుచూపు

**మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థుల ఇబ్బందులు**
**తక్షణమే కళాశాల ఏర్పాటు చేయాలి – ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్**
**చేవెళ్ల, మే 30 (వుదయం)**



మొయినాబాద్ మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు.పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు జూన్ 1 నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారితీస్తోందన్నారు.ప్రభుత్వ కళాశాల అందుబాటులో లేకపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.ప్రైవేట్ కళాశాలలు అధిక ఫీజులు వసూలు చేయడంతో చాలామంది విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.అదేవిధంగా, ఇంటర్మీడియట్ విద్య కోసం విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో సమయం, రవాణా ఖర్చులు పెరిగి కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. విద్య హక్కు అందరికీ సమానంగా చేరాలంటే మొయినాబాద్ మండలంలో వెంటనే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని కళాశాల ఏర్పాటుకు ముందుకు రావాలని, లేదంటే భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ హెచ్చరించారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**వికారాబాద్, మే 30:**
**(వుదయం జిల్లా ప్రతినిధి)**

అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు. శనివారం జిల్లా వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి , రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటా చారి ల తో కలిసి తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు పూర్తి ఏర్పాట్లు చేయాలనీ, జిల్లా అధికారులు అందరు సమన్వయంతో పని చేయాలనీ సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున కాల్లెక్ట్రేట్ కార్యాలయ గ్రౌండ్ లో జాతీయ పతాకావిష్కరణలో భాగంగా పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలని, ప్రోటోకాల్ (నిర్వహణ నియమాల)ను అనుసరిస్తూ ప్రముఖులు, మీడియా, తదితర సీటింగ్ గ్యాలరీలను జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ తయారు చేయాలని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యాశాఖ అధికారులు చేపట్టాలన్నారు. అలాగే జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా జరిగే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, వివిధ శాఖల అభివృధి తెలిపే స్టాల్స్ ను ఏర్పాటు చేయాలనీ, అధికారులు ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు తగు ఏర్పాట్లను ముందస్తు జాగ్రత్తలతో నిర్వహించాలని స్పష్టం చేశారు. తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, బందోబస్తు,అమరవీరుల స్థూపం, స్టేజ్ అలంకరణ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి వాసు చంద్ర, కలెక్టరేట్ ఏవో ఫర్హీన బేగం , వివిధ శాఖల జిల్లా అధికారులు, డి ఎస్ పి వీరేశ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొయినాబాద్‌లో ఘనంగా తెలంగాణ రక్షణ సేన వేడుకలు



**.ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగరేలా కృషి చేస్తాం: కల్వకుంట్ల కవిత**
**.రంగారెడ్డి జిల్లాలో పార్టీ బలోపేతానికి కట్టుబడి ఉన్నాం:**
**నీరుడు సర్వేష్ ముదిరాజ్**
**.కార్యకర్తల భారీ హాజరుతో మొయినాబాద్‌లో రాజకీయ సందడి**
**రంగారెడ్డి, మే 30(వుదయం)**

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మొయినాబాద్ మండలంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగ కార్యక్రమం రాజకీయంగా విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్న అనంతరం పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మొయినాబాద్‌కు చేరుకుని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జెండా ఆవిష్కరణ సందర్భంగా నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహం వ్యక్తం చేయగా, మొయినాబాద్ ప్రాంతమంతా రాజకీయ సందడితో కళకళలాడింది.కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన కల్వకుంట్ల కవిత తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమం లక్ష్యాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బలహీన వర్గాల అభ్యున్నతి, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం తమ పార్టీ ముఖ్య లక్ష్యాలని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేసి ప్రతి గ్రామం, ప్రతి కాలనీ, ప్రతి ఇంటి వద్ద తెలంగాణ రక్షణ సేన జెండా ఎగరేలా కృషి చేస్తామని కల్వకుంట్ల కవిత అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తమ రాజకీయాల కేంద్ర బిందువని పేర్కొంటూ, నిరుద్యోగం, రైతు సమస్యలు, మహిళల భద్రత, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధి కోసం పార్టీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తోందని వివరించారు. తెలంగాణ రక్షణ సేనను బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు,ధులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. జెండా పండుగ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిగాయి. మొయినాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమం తెలంగాణ రక్షణ సేన పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చిందని నాయకులు పేర్కొన్నారు. భారీ జనసమీకరణతో నిర్వహించిన ఈ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## స్థానిక ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు పూర్తి చేయాలి: నారాయణ్ అమిత్

**ఆమీన్ పూర్ , మే 30 (వుదయం )**



అమీన్‌పూర్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కోన సాగుతున్న పలు అభివృద్ధి పనులను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ గారు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారులతో కలిసి ఆయన సర్కిల్‌లోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, పనుల పురో , నర్రెగూడెం, బృందావన్ టీచర్స్ కాలనీలలో కొత్తగా చేపట్టిన రోడ్డు అభివృద్ధి పనులను కమిషనర్ గారు స్వయంగా పరిశీలించారు. అనంతరం సంబి చెరువు వద్దకు వెళ్లి, అక్కడ జరుగుతున్న బండ్ అభివృద్ధి, మరియు ఫెన్సింగ్ పనుల తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువుల సంరక్షణకు, సుందరీకరణకు ప్రాధాన్యతనిస్తూ ఈ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో సృజన లక్ష్మీనగర్ ఫేజ్3 లోని స్టార్మ్ వాటర్ డ్రెయిన్ అవుట్‌లెట్ సమస్యలను, బృందావన్ టీచర్స్ కాలనీలో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను జేసీ నిశితంగా పరిశీలించారు. అమీన్‌పూర్‌లో ఎంతో కాలంగా వేధిస్తున్న యూజీడీ అవుట్‌లెట్ సమస్యపై అధికారులతో చర్చించి, వీటికి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాలలో రాజీ పడకుండా, నిర్దేశిత గడువులోగా పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనుల అమలు ప్రక్రియలో స్థానిక ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ మాట – అంగన్వాడి బాట'కు విశేష స్పందన

**సిద్దిపేట, మే 30**
**(వుదయం బ్యూరో)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమం లో భాగంగా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అమ్మ మాట - అంగన్వాడి బాట" కార్యక్రమానికి సిద్దిపేట జిల్లాలో అపూర్వ స్పందన లభించింది. అంగన్వాడి సేవల ప్రాముఖ్యత, బాలల ప్రారంభ విద్య, పోషకాహారం మరియు ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా గ్రామ స్థాయిలో విస్తృత కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన జిల్లా సంక్షేమ అధి అందజేసిన 'విద్యారంభ్' సర్టిఫికెట్లు: 2,266 మందికిశుభ్రత చేపట్టిన అంగన్వాడి కేంద్రాలు: 1,110నిర్వహించిన అవగాహన ర్యాలీలు: 851 (హాజరైన వారు: 12,782 మంది)సిబ్బంది చేసిన గృహ సందర్శనలు (Home Visits): 5,101 ఇళ్లుఇంటింటికీ వెళ్లి అవగాహన..తల్లిదండ్రులకు నేరుగా అవగాహన కల్పించేందుకు అంగన్వాడి సిబ్బంది 5,101 గృహ సందర్శనలు (హోమ్ విజిట్స్) చేసి, చిన్నారుల నమోదు, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై తల్లులకు చక్కటి మార్గదర్శనం చేశారు. ఈ వినూత్న కార్యక్రమాల ద్వారా అంగన్వాడి కేంద్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని, ఫలితంగా చిన్నారుల నమోదు గణనీయంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. బాలల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన ప్రారంభ విద్యే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలు సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని జిల్లా సంక్షేమ అధికారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధికారులు, సీడీపీవోలు, సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన.. హాజరైన కలెక్టర్

**వికారాబాద్, మే 30:**
**(వుదయం జిల్లా ప్రతినిధి)**




ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్ష చేయించుకున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.జిల్లా కల్లెక్ట్రేట్ కార్యాలయంలో శంకర కంటి ఆసుపత్రి నానక్ రామ్ గూడ , హైదరాబాద్ వారు నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, వైద్య సిబ్బందితో మాట్లాడి శిబిరం నిర్వహణ, రోగులకు అందుతున్న సౌకర్యాల గురించి వివరాలు తెలుసుకున్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా కంటి పరీక్ష చేయించుకుని, ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, విద్యార్థులు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు నిర్దిష్ట వ్యవధిలో కంటి పరీక్షలు చేయించుకోవడం అవసరమని తెలిపారు.ఉచిత కంటిలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.శిబిరంలో వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు తదుపరి చికిత్సలపై సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటాచారి , వైద్య ఆరోగ్య శాఖ అధికారి పవిత్ర, ఏ ఓ పర్హీన బేగం వైద్యులు, సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం

**వెల్దండ మే 30 (వు దయం)**




మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలో నేడు నిర్వహించే హిందూ స హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేద్దాం మ్మేళనం విజయవంతం చేయాలని నిర్వహణ అధ్యక్షులు సుంకి రెడ్డి వరప్రసాద్ రెడ్డి తెలిపారు సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులు శ్రీ కృష్ణ స్వామి (శ్రీ శ్రీ విద్యా మహా త్రిపుర సుందరి పీఠం పెద్దాపురం) విశిష్ట అతిథులు శ్రీ భమిడిపాటి రవి కృష్ణ శర్మ (ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి) ముఖ్య వక్త కట్ట రాజగోపాల్ ప్రచారక్ ఆర్ఎస్ఎస్ గార్లు పాల్గొననున్నట్లు హిందూ సంస్కృతిని కాపాడేందుకు హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు



"కొత్తగా ఏర్పడనున్న మంత్రివర్గంలో చోటు కోసం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లాబీయింగ్ ప్రారంభించారు. చాలామంది ఎమ్మెల్యేలు ఢిల్లీకి చేరుకుని అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హైకమాండ్‌తో మంత్రివర్గ కూర్పుపై సంప్రదింపులు జరుపుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో మంత్రుల జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. తమ సన్నిహిత ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కేలా సిద్ధరామయ్య, డీకే శివకుమార్ అధిష్టానం వద్ద పావులు కదుపుతున్నారు. తమ వర్గానికి అత్యధిక మంత్రి పదవులు దక్కించుకునేందుకు ఇరువురు నేతలు పోటీ పడుతున్నారు. ఈసారి మంత్రివర్గంలో కొత్తముఖాలకు ఎక్కువగా ప్రాధాన్యం దక్కుతుందని ఊహాగానాలు సాగుతున్న తరుణంలో సీనియర్ మంత్రులు, ముఖ్యంగా సిద్ధరామయ్య వర్గీయుల్లో టెన్షన్ పెరుగుతోంది. 40 మందికి పైగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మంత్రివర్గంలో చోటు కోసం ప్రయత్నిస్తున్నారు."

**- డీకే శివకుమార్, కర్ణాటక సీఎల్పీ**

## వే'మన'పద్యం

ఎన్నిచోట్ల తిరిగి యేపాటు పడినను
అంటనియ్యక శని వెంటదిరుగు
భూమి క్రొత్తదైన భోక్తలు క్రొత్తలా
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# సిద్ధరామయ్య మౌనంగా ఉంటారా?

తన సోషలిస్టు భావజాలంతో కాంగ్రెస్ పార్టీలో ఇమిడి, చక్రం తిప్పిన నేత సిద్ధరామయ్య అన్నది కాదనలేని వాస్తవం. ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠించడమే ఆయన ఉనికికి ప్రధాన కారణం. ఒకవేళ ఆయన్ను 2013లో పక్కన పెట్టి ఉంటే, అప్పుడే ఆయన పార్టీని చీల్చి, పూర్తి అరాచకాన్ని సృష్టించేవారు. అందుకే కాంగ్రెస్ పార్టీలో చిరకాల యోధుడైన మల్లికార్జున్ ఖర్గేకు కూడా ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దక్కలేదు. మధ్యంతర మార్పులు, తీవ్రమైన అధికార పోరాటాలకు కేంద్రంగా ఉండే కర్ణాటక రాష్ట్రంలో ఇది ఒక అరుదైన విషయం. తొలిసారి, సిద్ధరామయ్య ఐదేళ్లపాటు తిరుగులేని ముఖ్యమంత్రిగా, అధికార కేంద్రంగా కొనసాగారు. తన ఐదేళ్ల పదవీకాలం తర్వాత 2018లో కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలైనప్పటికీ, సిద్ధరామయ్య తన దూకుడు వైఖరిని వీడలేదు. భారతీయ జనతా పార్టీ (బిజెపి)ని అధికారానికి దూరంగా ఉంచడమే ఏకైక లక్ష్యంగా, జనతా దళ్ (సెక్యులర్) (జెడిఎస్)తో పొత్తు పెట్టుకుని, హెచ్.డి. కుమారస్వామిని ముఖ్యమంత్రిగా పీఠమెక్కించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఆయనను బుజ్జగించాల్సి వచ్చింది, ఒత్తిడి కూడా తీసుకురావాల్సి వచ్చింది. వాస్తవానికి, ఈ ఏర్పాటుకు ఆయన తీవ్ర వ్యతిరేకి. హెచ్.డి. దేవెగౌడతో ఏర్పడిన తీవ్ర విభేదాల కారణంగా 2005లోనే ఆయన జెడిఎస్ నుండి బయటకు వచ్చి కాంగ్రెస్‌లో చేరారు. 2019 పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే, ఆ పొత్తు కూలిపోవడాన్ని సిద్ధరామయ్య ప్రత్యక్షంగా చూశారు. బహుశా ఆ కూటమి పతనానికి ఆయనే పరోక్షంగా సహకరించి ఉండవచ్చు కూడా. ఆ తర్వాత కాంగ్రెస్, జెడిఎస్ ఎమ్మెల్యేలు, సిద్ధరామయ్యకు నమ్మకస్తులైన అనేకులు మూకుమ్మడిగా రాజీనామా చేసి బిజెపిలో చేరడంతో, బి.ఎస్. యడియూరప్ప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడానికి మార్గం సుగమమైంది.

ఈ క్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా డి.కె. శివకుమార్ (లేదా డికెఎస్) ప్రాభవం పెరుగుతున్నప్పటికీ, ఆయన కాంగ్రెస్ పార్టీలో తన పట్టును నిలుపుకుని, ప్రతిపక్ష నాయకుడిగా తన స్థానాన్ని కాపాడుకున్నారు. ఆ తర్వాత, 2023లో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకమైన ప్రజా తీర్పుతో తిరిగి అధికారంలోకి వచ్చినప్పుడు, ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ తీవ్ర స్థాయికి చేరిన వేళ, సిద్ధరామయ్య మరోసారి పైచేయి సాధించారు. కర్ణాటక రాజకీయాల్లో, ఒక మాజీ ముఖ్యమంత్రి ఓటమి తర్వాత మళ్ళీ ఇంత ఘనంగా పునరాగమనం సాధించడం ఒక అరుదైన ఘనత. కాగా, కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకత్వం శివకుమార్ వెనుక ఏకమైంది. వారు సిద్ధరామయ్య నుండి పదవీకాలం మధ్యలో నాయకత్వ మార్పు ఉంటుందనే అంగీకారాన్ని రాబట్టడమే కాకుండా, ఆ ఒప్పందం కచ్చితంగా అమలయ్యేలా చూశారు. 2013 నుండి 2018 మధ్యకాలంలో తనకు లభించినట్లుగా, ఈ పదవీకాలం ఆరంభం నుండే సిద్ధరామయ్యకు ఎటువంటి అప్రతిహతమైన అధికారం గానీ, సంపూర్ణ నియంత్రణ గానీ లభించదని స్పష్టమైంది. పాత అలవాట్లు అంత సులభంగా పోవు. ఆయన పదవి నుంచి వైదొలుగుతున్నప్పుడు, వయసు పైబడినప్పటికీ, నిశ్శబ్దంగా పదవీ విరమణ చేసిన ఒక పెద్ద రాజకీయవేత్త పాత్రను పోషిస్తారని కొద్దిమందే ఆశిస్తున్నారు. ఆయన ఒక దృఢమైన, క్షేత్రస్థాయి సోషలిస్టుగానే మిగిలిపోయారు. వాస్తవానికి గందరగోళానికి భయపడకుండా, దానిలోనే రాణించే ఒక అరాచకవాది. సిద్ధరామయ్య తెరమరుగున పడిపోకుండా, తన ఉనికిని చాటుకుంటారు. పదవి నుంచి వైదొలగిన సిద్ధరామయ్య ఒక అస్థిర శక్తిగా మారే అవకాశాలే ఎక్కువ. రాష్ట్రంలోని అధికార సమీకరణాలను చాలా జాగ్రత్తగా తిరిగి రూపొందించి, పునఃసమతుల్యం చేయవలసి ఉంటుంది. ఈ నాయకత్వ మార్పు కేవలం ముఖ్యమంత్రులను మార్చడం మాత్రమే కాదు, ఇది పాతుకుపోయిన సామాజిక కూటములను విచ్ఛిన్నం చేసి, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడానికి సంబంధించినది. తన అద్భుతమైన వ్యక్తిత్వానికి అతీతంగా, సిద్ధరామయ్య వెనుకబడిన తరగతులకు అగ్రగామి ప్రతినిధిగా ఉన్నారు. రెండు దశాబ్దాలుగా కర్ణాటకలో కాంగ్రెస్ ఎన్నికల సమీకరణాలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు. ఆయనను తొలగించి అధికారంలోకి రావడం అంటే, సర్దుబాటు రాజకీయాలకు పేరుగాంచిన ఈ రాష్ట్రంలో అధికార సమీకరణాలను తలకిందులు చేయడమే. 2004 నుండి బి.ఎస్. యడియూరప్పతో కలిసి సిద్ధరామయ్య కర్ణాటక రాజకీయ కథను రచించగా, కుమారస్వామి ఎప్పటిలాగే మూడవ అంకాన్ని పోషించారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఒక నిర్మాణాత్మక మార్పుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, చివరి కట్టుబడ్డ సోషలిస్ట్ రాజీనామాతో ఆ రాష్ట్రం ఒక సరికొత్త దశలోకి అడుగుపెడుతున్నట్లు కనిపిస్తోంది.

## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ట్రెండ్ సెట్టర్ ఘట్టమనేని కృష్ణ



తెలుగు జాతి గర్వించదగ్గ గొప్ప నటుడు కృష్ణ. నిజానికి తెలుగు చిత్రసీమలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. నట శేఖరునిగా, సూపర్ స్టార్ గా స్వయం కృషితో తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్న గొప్పతనం ఆయనది. ఎన్టీఆర్ లాగా పౌరాణికాల, ఏ ఎన్ ఆర్ లాగా సాంఘికాల, కాంతారావు లాగా జానపదాల, శోభన్ బాబు లాగా కుటుంబ కథా భరితమైన, ఉదాత్తమైన వ్యక్తిత్వం కలిగిన పాత్రలలో నటించకున్నా, చిరంజీవి లాగా నృత్యం చేయ లేక పోయినా, ఇవన్నీ పక్కన పెట్టి, మాస్ ఓరియంటెడ్, ఎంటర్టైనర్ కౌబాయ్ జేమ్స్ బాండ్ చిత్రాలలో నటించి, యువతను థియేటర్ బాట పట్టించి, ఎందరికో రోల్ మోడల్ గా నిలిచిన అసాధ్యుడు కృష్ణ. కృష్ణ సాధించింది మామూలు స్టార్ డమ్ కానే కాదు. ఒక సమయంలో ఊరూరా కృష్ణకు రికార్డు స్థాయిలో 2500 అభిమాన సంఘాలు ఉండేవి అంటే అది సామాన్య విషయం కాదు. సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్ పై పట్టు ఉన్న కృష్ణ తెలుగు చిత్ర పరిశ్రమలో చేయని ప్రయోగం లేదు. తెలుగు వెండి తెరకు సరికొత్త ఒరవడులు దిద్దుతూ.. ఆయన పరిచయం చేయని కొత్త ప్రయోగం అంటే అతిశయోక్తి కాదు.

కృష్ణ (ఘట్టమనేని శివరామ కృష్ణ మూర్తి) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. 1942 మే 31 న గుంటూరు జిల్లా, తెనాలి మండలం తెనాలి పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్తులైన ఘట్టమనేని వీర రాఘవయ్య చౌదరి, నాగరత్న దంపతుల పెద్ద కొడుకుగా జన్మించాడు.

1964లో ప్రముఖ దర్శక నిర్మాత ఆదుర్తి సుబ్బారావు అందరూ కొత్తవాళ్ళతో తాను తీస్తున్న తేనె మనసులు కోసం కొత్త నటులు కావాలని ఇచ్చిన పత్రికా ప్రకటనకు తన ఫోటోలు పంపించి, పలు వడపోతల తర్వాత ఆదుర్తి సుబ్బారావు ద్వారా కృష్ణన ఇద్దరు కథా నాయకుల్లో ఒకడిగా ఎంపిక కాబడినాడు.

అలా తెలుగు చిత్రసీమలో అడుగు పెట్టిన కృష్ణ నట జీవితం ఉదయం, మధ్యాహ్నం మాత్రమే కాక మూడవ షిఫ్ట్ రాత్రి పది గంటల నుంచి తెల్లవారు జామున 2 గంటల వరకు ఉండేది. చివరికి నిద్ర పోతున్న సమయంలో కాస్ట్యూమ్స్ వేసుకుని పడుకుంటే నిద్రిస్తున్న సన్నివేశాలు చిత్రీకరిం చుకున్న సందర్భాలు ఉన్నాయి.

1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు, 1969లో రికార్డు స్థాయిలో 19 సినిమాలు, 1970లో 16 సినిమాలు, 1971లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 సినిమాలు, 1974లో 13 సినిమాలు, 1975లో 8 సినిమాలు విడుదల కావడం గమనార్హం. 1972లో ఒకే ఏడాది 17 సినిమాలను విడుదల చేసి రికార్డు సృష్టించాడు. ప్రపంచం లో మరే సినీ నటుడికీ ఇలాంటి రికార్డు లేదు. తెలుగులో "తొలి జేమ్స్ బాండ్ సినిమా" (గూఢచారి 116), తొలి "కౌబాయ్ సినిమా" (మోసగాళ్ళకు మోసగాడు), తొలి "ఫుల్ స్కోప్ సినిమా" (అల్లూరి సీతారామ రాజు), "తొలి 70 ఎంఎం సినిమా" (సింహాసనం) వంటివి సూపర్ స్టార్ కృష్ణ సినిమాలే. తెలుగులో సాంతకేతికం గానూ పలు తొలి తెలుగు సినిమాలు కృష్ణవే. కొల్లేటి కాపురంతో తెలుగులో ఆర్.ఓ. సాంకేతికత పరిచయం చేశాడు. మొదటి ఓఆర్‌డబ్ల్యు కలర్ సాంకేతికతతో తీసిన సినిమా గూడుపు ఠాణి. తొలి తెలుగు ఫ్యూజీ కలర్ చిత్రం భలే దొంగలు. తెలుగులో 70 ఎంఎం సాంకేతికత ఉపయోగించిన తొలి సినిమా సింహాసనం. సింహాసనం సినిమా స్టీరియోఫోనిక్ 6 ట్రాక్ సాంకేతికతతో సౌండ్ టెక్నాలజీ వాడిన తొలి తెలుగు సినిమా. అల్లూరి సీతా రామరాజు తెలుగులో ఫుల్‌స్కోప్ సినిమాల్లో మొదటిది. బాక్సాఫీస్ రికార్డుల పరంగా చూస్తే, మద్రాస్ నగరంలో వంద రోజులు పూర్తిచేసుకున్న తొలి తెలుగు చిత్రంగా చీకటి వెలుగులు, హైదరాబాద్ నగరంలో ఏడాది పాటు ఆడిన తొలి తెలుగు సినిమాగా అల్లూరి సీతారామరాజు నిలిచిపోయాయి. 1982లో భవనం వెంకట్రామ్ ప్రభుత్వం హైదరాబాద్లో పద్మాలయా సంస్థకు స్టూడియో నిర్మించు కోవడానికి జూబ్లీ హిల్స్ లో 10 ఎకరాల స్థలాన్ని ఇవ్వగా, 1983 నవంబరు 21న నాటి ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు చేతుల మీదుగా పద్మాలయా స్టూడియోస్ ప్రారంభింప చేసుకుని కృష్ణ స్టూడియో యజమాని అయ్యాడు. స్వంత నిర్మాణ సంస్థ పద్మాలయా పిక్చర్స్ ద్వారా 1971లో తీసిన మోస గాళ్ళకు మోసగాడు మాత్రం భారీ విజయాన్ని, సాహసిగా కృష్ణకు పేరును తెచ్చి పెట్టింది. మోస గాళ్ళకు మోసగాడు సినిమా ఆంగ్లంలోకి ట్రెజర్ హంట్ పేరిట అనువాదమై 123 దేశాల్లో విడుదలైంది, మంచి విజయాన్ని సాధించింది.

కృష్ణకు 1997లో ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం, 2003లో ఎన్టీఆర్ జాతీయ పుర స్కారం, 2008లో ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, 2009లో భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారం వంటి గౌరవాలు లభించాయి. ఆస్ట్రేలియా ప్రభుత్వం కృష్ణను గౌరవిస్తూ ఓ పోస్టల్ స్టాంప్ కూడా విడుదల చేసింది. 1976లో కేంద్ర కార్మిక శాఖ మంత్రి కె.వి. రఘునాథ రెడ్డి చేతుల మీదుగా కృష్ణ "నటశేఖర" బిరుదును అందుకున్నాడు. 1972లో జైఆంధ్ర ఉద్యమం జరిగినప్పుడు కృష్ణ ఆ ఉద్యమానికి బహిరంగంగా మద్దతు నిచ్చాడు. 1984 అక్టోబరులో ఇందిరా గాంధీ దారుణహత్యకు గురైనప్పుడు కృష్ణ ఆమె అంత్యక్రియలకు ఢిల్లీ వెళ్ళి, రాజీవ్ గాంధీని కలవడం జరిగింది. అలా 1984లో కృష్ణ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. 1989లో కృష్ణ కాంగ్రెస్ తరపున ఏలూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీచేసి విజయం సాధించాడు. 2009 ఎన్నికల్లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి కోరక మేరకు కాంగ్రెస్ పార్టీకి కృష్ణ కుటుంబం నైతిక మద్దతు అందించింది. కరువు బాధితుల సహాయ నిధికి సినిమా తారల యాత్ర పేరుతో 1972 అక్టోబరు 28 నుంచి నవంబరు 2 వరకు విజయవాడ, తెనాలి, గుంటూరు, రాజమండ్రి, హైదరాబాద్ లలో తోటి నటీనటులు, సాంకేతిక నిపుణులను కూడగట్టి కార్యక్రమాలు నిర్వహించాడు. వచ్చిన డబ్బు సహాయ నిధికి అందిం చారు. ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు, పద్మాలయా స్టూడియో అధినేత, మాజీ ఎంపీ, సూపర్‌స్టార్ కృష్ణ (80) 2022 సంవత్సరం నవంబర్ 15న కార్డియాక్ అరెస్టుకు గురై, ఆసుపత్రికి తరలించబడి చికిత్స పొందుతూ తనువు చాలించి, ఆయన తుదిశ్వాస విడిచి, అశేష అభిమానులను శోక సంద్రంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లి పోయారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# భాషా మాధుర్యం – పాండిత్య సమన్వయం

# సినీ స్వర్ణయుగంలో 'సముద్రాల జూనియర్



తెలుగు చలనచిత్ర రంగానికి సాహిత్య సౌరభాలు అద్దిన మహానుభావులలో సముద్రాల రామానుజాచార్య శైలి, వైశిష్ట్యం అద్వితీయమైనవి. వెండితెరపై కేవలం వినోదాన్ని మాత్రమే కాకుండా, తెలుగు భాషా మాధుర్యాన్ని, సంస్కృత సమాస భూయిష్టమైన పాండిత్యాన్ని, జానపద సొగసులను ఏకకాలంలో పండించిన సృజనశీలి ఆయన. సినీ పరిశ్రమలో "సముద్రాల జూనియర్" గా ప్రసిద్ధి పొందిన రామానుజాచార్య, తన తండ్రి సముద్రాల రాఘవాచార్యుల (సముద్రాల సీనియర్) సాహిత్య వారసత్వాన్ని అందిపుచ్చు కోవడమే కాకుండా, తనదైన స్వంత ముద్రతో స్వతంత్ర రచయితగా ప్రత్యేక కీర్తిని ఆర్జించారు. తెలుగు చిత్రసీమలో పురాణ, జానపద, భక్తి, సాంఘిక చిత్రాలకు పదునైన సంభాషణలు, హృద్యమైన పాటలు అందించి అజరామరమైన కీర్తిని సొంతం చేసుకున్న ఈ సరస్వతీ పుత్రుని జీవితం, సాహిత్య ప్రస్థానం తెలుగు చలనచిత్ర చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం.

గుంటూరు జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన భట్టిప్రోలు మండల పరిధిలోని పెదపులివర్రు గ్రామంలో 1923 ఏప్రిల్ 15న రామానుజాచార్య జన్మించారు. ఆనాటి కోస్తాంధ్ర తీరంలో పెదపులివర్రు గ్రామం వేద పండితులకు, సంస్కృతాంధ్ర కవులకు పురిటిల్లుగా విరాజిల్లింది. అటువంటి పవిత్ర వాతావరణంలో, సంప్రదాయ పాండిత్యానికి నిలయమైన కుటుంబంలో జన్మించిన రామానుజాచార్య చిన్ననాటి నుంచే అక్షర దీక్షను అలవర్చుకున్నారు. ఆయన తండ్రి సముద్రాల రాఘవాచార్యులు తెలుగు సినీ పరిశ్రమ తొలితరంలో అగ్రశ్రేణి రచయితగా, గేయకవిగా, సంభాషణకర్తగా భీష్మ సమానులుగా వెలుగొందుతున్న తరుణమది. ఇంట్లో నిత్యం జరిగే కావ్య పఠనాలు, పురాణ కాలక్షేపాలు, తండ్రి వద్దకు వచ్చే కవి పండితుల చర్చలు బాలుడైన రామానుజాచార్య మానసిక, వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది వేశాయి.

చిన్న వయస్సు నుంచే ఆయనకు సంస్కృతం, తెలుగు సాహిత్యం, అష్టాదశ పురాణాలు, ఇతిహాసాలపై అమితమైన అనురాగం ఏర్పడింది. పద్యరచన, వ్యాకరణం, ఛందస్సు, అలంకార శాస్త్రం వంటి కఠినమైన ప్రక్రియల్లో ఆయన లీలాజాలంగా ప్రావీణ్యం సంపాదించారు. అయితే, ఆయన కేవలం సంప్రదాయ గ్రంథాలకే పరిమితం కాకుండా, నాటి సమాజంలో వస్తున్న ఆధునిక సాహిత్య ధోరణులను, భావకవిత్వాన్ని, అభ్యుదయ భావాలను కూడా లోతుగా అధ్యయనం చేశారు. ఈ సమన్వయ దృష్టి వల్లే ఆయన రచనలకు ఒక విలక్షణమైన శైలి అబ్బింది. భాషలో సరళతను కాపాడుకుంటూనే భావంలో గాంభీర్యాన్ని ఒలికించడం, పాత్రోచితంగా సంభాషణలలో సహజత్వాన్ని చొప్పించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది.

తెలుగు సినీ పరిశ్రమ మద్రాసు (చెన్నై) కేంద్రంగా విస్తరిస్తున్న ఆ స్వర్ణయుగంలో, సముద్రాల కుటుంబం చలనచిత్ర కార్యకలాపాల్లో అత్యంత కీలక పాత్ర పోషించింది. తండ్రి సముద్రాల రాఘవాచార్యుల నీడలో, ఆయన వద్ద సహాయకుడిగా పనిచేస్తూ రామానుజాచార్య చిత్రరంగానికి పరిచయమయ్యారు. అది కేవలం ఒక కొడుకుగా తండ్రి పక్కన కూర్చోవడం కాదు; కథల నిర్మాణం (స్క్రిప్ట్ రైటింగ్), సన్నివేశాల కల్పన, నాటకీయతను పండించడం, గీతాల సృష్టిలో లయబద్ధత, చిత్రకథా రూపకల్పన (స్క్రీన్ ప్లే) వంటి సర్వ రకాల విభాగాల్లో పగలు రేయి శ్రమించి ప్రత్యక్ష అనుభవం గడించారు. తండ్రి రాసే ప్రతి అక్షరాన్ని గమనిస్తూ, లఘువులను గురువులను సరిచూస్తూ ఆయన పొందిన శిక్షణ, తదనంతర కాలంలో ఆయనను ఒక స్వతంత్ర, పరిపూర్ణ రచయితగా తీర్చిదిద్దింది.

సినిమా రంగంలో ఆయన ప్రవేశించిన తక్కువ కాలంలోనే "సముద్రాల జూనియర్" అనే గౌరవప్రదమైన నామకరణం జరిగింది. సాధారణంగా అగ్రగణ్యులైన పితృస్వామ్య వారసత్వాన్ని అందుకోవడం, ఆ పేరును నిలబెట్టుకోవడం చాలా కష్టతరమైన విషయం. కానీ రామానుజాచార్య కేవలం వారసత్వపు వెలుగులోనే ఉండిపోకుండా, తన అసాధారణ రచనా నైపుణ్యంతో తండ్రి స్థాయి శైలిని, గౌరవాన్ని త్వరగానే అందుకున్నారు. అనేక పౌరాణిక, భక్తి చిత్రాలకు ఆయన కలం నుండి జాలువారిన సంభాషణలు, పాటలు తెలుగు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా సంస్కృత సమాస భూయిష్టమైన క్లిష్ట పదజాలాన్ని కూడా, సామాన్య పామర జనులకు సైతం సులభంగా అర్థమయ్యే రీతిలో 'సుగమ తెలుగు'లోకి మార్చి రాయడం ఆయన ప్రత్యేకత. ఆధ్యాత్మిక సత్యాలను, తత్వచింతనను నిగూఢంగా కాక, నిత్య జీవితానికి అన్వయించే సరళ పదాలతో వ్యక్తపరచడంలో ఆయన సిద్ధహస్తులు.

గణాంకాల పరంగా చూస్తే, 1950ల నుండి 1980ల వరకు మూడు దశాబ్దాల పాటు తెలుగు చిత్రసీమలో జానపద, భక్తి, చారిత్రక చిత్రాల హవా నడిచింది. ఆ కాలంలో నిర్మితమైన ఎన్నో క్లాసిక్ చిత్రాలకు సముద్రాల రామానుజాచార్య తన లేఖినితో ప్రాణం పోశారు. నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వరరావు వంటి మహానటుల పౌరాణిక వైభవానికి వీరి సంభాషణలు ఎంతో దోహదపడ్డాయి. 'శ్రీకృష్ణావతారం', 'శ్రీకృష్ణ సత్య', 'నర్తనశాల', 'పాండవ వనవాసం', 'దాన వీర శూర కర్ణ' వంటి పౌరాణిక చిత్రాల్లోని కొన్ని కీలక ఘట్టాలకు, అలాగే 'శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యం', 'మహాకవి క్షేత్రయ్య' వంటి భక్తిరస చిత్రాలకు, ఎన్నో జానపద అద్భుతాలకు ఆయన అందించిన కథా సహకారం, పాటలు, మాటలు చిరస్మరణీయాలు. ఆయన రచించిన గీతాల్లో కేవలం శబ్దాలంకారాలే కాకుండా, సమాజానికి అవసరమైన నైతికత, సనాతన సంస్కృతి, మానవీయ విలువలు అంతర్లీనంగా ప్రవహించేవి.

ఒక వైపు పౌరాణికాలలో గంభీరమైన రాజస భాషను పలికిస్తూనే, మరోవైపు సాంఘిక చిత్రాలలో ఆధునిక కుటుంబ విలువలను, భార్యాభర్తల అనురాగాలను, మానవ సంబంధాల లోతులను, నైతిక బాధ్యతలను ప్రతిబింబించే అత్యంత సహజమైన, హృదయానికి హత్తుకునే సంభాషణలను ఆయన అందించారు. ఒకే సమయంలో తండ్రి సముద్రాల రాఘవాచార్యులు, కుమారుడు రామానుజాచార్య ఇద్దరూ పరిశ్రమలో అగ్రశ్రేణి రచయితలుగా సమాంతరంగా సాగడం, ఇద్దరి కలాల నుండి అద్భుతాలు సృష్టించబడటం తెలుగు సినీ చరిత్రలోనే కాక, భారతీయ చలనచిత్ర రంగంలోనే ఒక అరుదైన, అపురూపమైన ఘట్టంగా చరిత్రకారులు అభివర్ణిస్తారు. ఈ సముద్రాల ద్వయం ద్వారా తెలుగు భాషా సంపద, సనాతన పురాణ విజ్ఞానం, ప్రాచీన సాహిత్య వారసత్వం వెండితెర అనే ఆధునిక మాధ్యమం ద్వారా సామాన్య ప్రజల చెంతకు చేరింది.

రామానుజాచార్య రచనల్లో కాళిదాసు, భారవి, మాఘుడు వంటి సంస్కృత మహాకవుల ప్రభావం, పోతన భాగవత భక్తి తత్వం స్పష్టంగా గోచరిస్తాయి. అయితే ఆ పాండిత్య ప్రకర్ష ఎక్కడా సామాన్య ప్రేక్షకుడికి భారం కాలేదు. భక్తి చిత్రాల్లో దేవతా మహిమలను వర్ణించేటప్పుడు భక్తుని ఆర్తిని, శరణాగతి తత్వాన్ని ఆయన పదాలు పలికించిన తీరు శ్రోతలను కన్నీళ్లు పెట్టించేది. సినిమా అనే కళారూపం ప్రజారంజకంగా ఉండాలనే ప్రాథమిక సూత్రాన్ని ఆయన ఎన్నడూ విస్మరించలేదు. అందుకే ఆయన రాసిన ప్రతి పద్యం, ప్రతి పాట థియేటర్లలో చప్పట్ల వర్షం కురిపించింది. సాంప్రదాయ పాండిత్యాన్ని, ఆధునిక చలనచిత్ర సాంకేతికతతోను, ప్రజాభిరుచితోను ఇంతటి సామరస్యంతో అనుసంధానించిన రచయితలు చాలా అరుదుగా ఉంటారు.

తెలుగు సినిమా చరిత్రను విశ్లేషించే నిపుణులు 19501980 మధ్య కాలాన్ని 'స్వర్ణయుగం'గా పేర్కొంటారు. ఆ కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉన్నప్పటికీ, కథ, బలమైన సంభాషణలు, సాహిత్య విలువలు కలిగిన పాటలే చిత్ర విజయానికి ప్రధాన వెన్నెముకగా నిలిచేవి. అటువంటి మహోన్నత కాలంలో సముద్రాల రామానుజాచార్య వంటి మహామహులు చిత్రాల నాణ్యతను, స్థాయిని శిఖరాగ్రానికి తీసుకెళ్లడంలో విశేష కృషి చేశారు. ఆయన రాసిన సంభాషణలు నటీనటుల అభినయానికి, వాగ్ధాటికి నూతన బలాన్ని చేకూర్చగా, దర్శకుల దృశ్యకల్పనకు (విజువలైజేషన్) సాహిత్యపరమైన లోతును, తాత్విక భూమికను ప్రసాదించాయి.

సముద్రాల రామానుజాచార్య వ్యక్తిగత జీవితం కూడా ఎంతో ఆదర్శవంతమైనది. అపారమైన కీర్తి ప్రతిష్టలు, ధనార్జన ఉన్నప్పటికీ, ఆయన నిరాడంబరతకే ప్రథమ తాంబూలమిచ్చారు. ఆడంబరాలకు, ఆత్మస్తుతికి, అనవసర ప్రచారాలకు ఆయన ఎల్లప్పుడూ ఆమడ దూరంలో ఉండేవారు. నిరంతరం సరస్వతీ ఉపాసనలోనే గడుపుతూ, రచననే తన జీవిత పరమావధిగా, ధ్యేయంగా భావించారు.

సినీ పరిశ్రమలో ఎందరో దిగ్గజ దర్శకులు, నిర్మాతలు, నటులతో దశాబ్దాల పాటు సన్నిహితంగా పనిచేసినప్పటికీ, తన అసాధారణ ప్రతిభను ఎల్లప్పుడూ వినయంతోనే మేళవించుకున్నారు. ఈ నిరుపమానమైన గుణమే ఆయనను పరిశ్రమలోని సహచరులందరి దృష్టిలో ఒక పూజనీయ స్థానంలో నిలబెట్టింది.

తెలుగు సినీ రచయితల సుదీర్ఘ చరిత్రను నిశితంగా పరిశీలిస్తే, సముద్రాల కుటుంబం ఒక విలక్షణమైన పీఠాన్ని అధిరోహించి కనిపిస్తుంది. సముద్రాల రాఘవాచార్యులు నిర్మించిన మహోన్నత సాహిత్య సంప్రదాయ భవనానికి, సముద్రాల రామానుజాచార్య తన అద్భుత రచనల ద్వారా శాశ్వతమైన ప్రాకారాన్ని నిర్మించి మరింత బలోపేతం చేశారు. తండ్రి పేరుకు ఎక్కడా చిన్న మచ్చ రాకుండా కాపాడటమే కాకుండా, తన స్వంత సృజనాత్మక శక్తులతో అజరామరమైన కీర్తిని సాధించారు. ఒక ఉత్తమ చలనచిత్ర నిర్మాణంలో, సమాజ చైతన్యంలో రచయిత పాత్ర ఎంతటి గురుతరమైనదో, ఎంతటి గౌరవప్రదమైనదో నిరూపించడానికి ఆయన జీవితమే ఒక నిలువెత్తు సాక్ష్యం.

సుదీర్ఘ కాలం పాటు తెలుగు సరస్వతికి అక్షర నీరాజనాలు అర్పించిన సముద్రాల రామానుజాచార్య 1985 మే 31న భౌతికంగా ఈ లోకాన్ని విడిచి పరమపదించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ, ఆయన సృష్టించిన అమర కీర్తనలు, పదునైన సంభాషణలు, పౌరాణిక ఘట్టాలు నేటికీ, ఏనాటికీ తెలుగు సినీ ఇతిహాసంలో సజీవంగానే ఉంటాయి. తెలుగు భాషా మాధుర్యాన్ని వెండితెర రూపంలో కోట్ల మంది గుండెల్లోకి చేర్చిన సృజనకారుడిగా, సంప్రదాయ పాండిత్యాన్ని సామాన్య జనావళికి నచ్చిన కళారూపంతో మేళవించిన అరుదైన సాహిత్యవేత్తగా చరిత్ర ఆయనకు అగ్రతాంబూలాన్ని ఇచ్చింది. తెలుగు చలనచిత్ర రంగం తన సాహిత్య సంపదను, వైభవాన్ని స్మరించుకున్నప్పుడల్లా సముద్రాల రామానుజాచార్య పేరు అత్యంత భక్తిశ్రద్ధలతో, గౌరవంతో ప్రస్తావించబడుతూనే ఉంటుంది. ఆయన జీవన ప్రస్థానం సాహిత్య సంప్రదాయానికి, భాషా సేవకు, సృజనాత్మక కళకు అంకితమైన ఒక స్ఫూర్తిదాయక మహాగాథగా తెలుగు జాతి స్మృతిపథంలో చిరస్థాయిగా వెలుగుతూనే ఉంటుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# తెలుగు చిత్రసీమలో దాసరిది నూతన ఒరవడి

తెలుగు సినిమా రంగంలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. చిత్ర నిర్మాణంలో ఏ విభాగంలో నైనా ఆయనది ప్రత్యేక శైలి. అయన ప్రత్యేక గుర్తింపు పొందిన సినిమా దర్శకులు, విలక్షణ నటులు, గీత, సంభాషణ రచయిత, చిత్ర నిర్మాత. అత్యధిక చిత్రాల దర్శకునిగా తెలుగు, హిందీ భాషల్లో 151 సినిమాలకు దర్శకత్వం వహించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ల్లోకి ఎక్కారు. గిన్నిస్ బుక్ లో స్థానం పొందారు. 53 సినిమాలు స్వయంగా నిర్మించారు. 250 పైగా చిత్రాలలో సంభాషణ రచయితగా లేదా గీత రచయితగా పని చేశారు. తెలుగు, తమిళం , కన్నడ భాషా చిత్రాలలో నటించి, నటనకుగాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ నటునిగా బహుమతి కూడా పొందారు. అంతేకాదు రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు. దాసరి నారాయణ రావు (మే 4, 1947 మే 30, 2017) కళాశాలలో చదివే రోజులలో బీ.ఏ డిగ్రీతో ఉత్తీర్ణులు కావడంతో పాటు దాసరి అనేక నాటక పోటీలలో కూడా పాల్గొనేవారు. అనతి కాలంలోనే ప్రతిభ గల రంగ స్థల నటుడిగా, నాటక రచయితగా చిత్ర దర్శకుడిగా గుర్తింపు పొందారు. మోహన్ బాబు, ఆర్. నారాయణమూర్తి, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, రవిరాజా పినిశెట్టి తదితర నటులు, దర్శకులు, ఎందరో సాంకేతిక నిపుణులను దాసరి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. సినీ రంగానికి పరిచయం చేసి ఎదిగేందుకు చేయూత అందించారు. ఒక సమయంలో ఆయన పేరిట తెలుగు నేలపై 18వందలకు పైగా దాసరి అభిమాన సంఘాలు ఉండేవంటే సామాన్యం కాదు. ఆదుర్తి సుబ్బారావు దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా, శిష్యరికం చేసి సినిమా దర్శకత్వంలో తనకంటూ ఓ ప్రత్యేకశైలిని అలవర్చుకున్నారు. తర్వాత భిన్నమైన చిత్రాలను రూపొందించారు. 1974లో తాతా మనవడు సినిమాతో సినీ ప్రస్థానం ప్రారంభించిన దాసరి తొలి సినిమాకే నంది అవార్డు అందుకొని సంచలనం సృష్టించారు. తాతా మనవడు, స్వర్గం నరకం, మేఘసందేశం, మామగారు అనేక అవార్డులు తెచ్చిపెట్టాయి. మేఘ సందేశం చిత్రాన్ని కేన్స్, షికాగో, మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. దాసరి తిసిన బొబ్బిలి పులి , సర్దార్ పాపారాయుడు చిత్రాలు నందమూరి తారక రామారావు రాజకీయ ప్రవేశములో ప్రధానపాత్ర వహించాయి. మామగారు, సూరిగాడు, ఒసేయ్ రాములమ్మ చిత్రాలు దాసరి నటనా కౌశలానికి మచ్చు తునకలుగా మిగిలాయి. ఆ సినిమాలలో నటనకు దాసరి అనేక విమర్శకుల ప్రశంసలు , బహుమతులు అందుకున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల**



# జాతీయం-అంతర్జాతీయం





## శివకుమార్ ముందున్న సవాళ్లు

**వుదయం డెస్క్, మే 30:**
కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్గోయల్ న్యూయార్క్ నగర పర్యటనలో భాగంగా గురువారం అక్కడ పలు ఉన్నత స్థాయివ్యాపార, పెట్టుబడి సమావేశాల్లో పాల్గొన్నారు. కార్లైల్ గ్రూప్ సీఈవో హార్వే స్క్వార్ట్జ్, మోర్గాన్ స్టాన్లీ ఛైర్మన్,సీఈవో టెడ్ పిక్, వార్బర్గ్ పింకస్ ఛైర్మన్ చార్లెస్ కే, ఆమ్నియల్ఫార్మాస్యూటికల్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో చింటు పటేల్, మాస్టర్కార్డ్సీఈవో మైఖేల్ మీబాచ్తో ఒక్కొక్కరిగా ఈ పర్యటన సందర్భంగా మంత్రిసమావేశమయ్యారు. భారత్ అమెరికా వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడం, ప్రపంచవ్యాపార సంస్థలకు భారత్లో అవకాశాలను విస్తరించడం, సరఫరా వ్యవస్థలనుపటిష్టం చేయడం, ఆర్థిక సేవలు, ఆరోగ్య రక్షణ, డిజిటల్ చెల్లింపులు, తయారీ,ఆవిష్కరణ, కృత్రిమ మేధ, వర్ధమాన సాంకేతికతల వంటి రంగాల్లో సహకారాన్నిపెంపొందించడంపై ఈ చర్చలు ప్రధానంగా దృష్టి సారించాయి. అంతర్జాతీయపెట్టుబడుల గమ్యస్థానంగా భారత్కు పెరుగుతున్న ఆదరణ కూడా ఈ చర్చల ద్వారాస్పష్టమైంది. అమెరికా ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్య ఫోరం సహకారంతో నిర్వహించిన ఒకవ్యాపార సమావేశంలో.. పెట్టుబడి, వాణిజ్య వర్గాలకు చెందిన 50 మందికి పైగాప్రముఖ వ్యాపారాధినేతలనుద్దేశించి మంత్రి ప్రసంగించారు. భారత బలమైనవృద్ధి ప్రయాణం, ప్రస్తుత ఆర్థిక సంస్కరణలు, వ్యాపార సౌలభ్యం, సహకారానికిఅవకాశమున్న రంగాలు, కీలక రంగాల్లో పెరుగుతున్న పెట్టుబడి అవకాశాలపై అభిప్రాయాలను పంచుకోవడానికి ఈ సమావేశం అవకాశాన్నిచ్చింది.
భారత ఆర్థిక ధోరణిపై పెరుగుతున్న అంతర్జాతీయ విశ్వాసాన్ని ఈ సమావేశాలు చాటాయి. భారత్, అమెరికా మధ్య బలమైన పారిశ్రామిక సహకారం ప్రాధాన్యాన్నిపునరుద్ఘాటించాయి.

కాంగ్రెస్ ఎలాంటి తిరుగుబాట్లు, విమర్శలు, ప్రకటనలు లేకుండా కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పును సజావుగా జరిపించడం పలువురిని ఆశ్చర్యపరిచింది. ఊహించినట్టుగానే, శనివారం నాడు సీఎల్పీ డికె శివకుమార్ను తమ నాయకుడిగా ఎన్నుకోవడంతో ఆ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ఎవరో ఖరారైంది. వాస్తవానికి, కర్ణాటకలో కాంగ్రెస్ అగ్రస్థాయి వైరుధ్యాల ఫలితంగా ఏర్పడిన గందరగోళ రాజకీయాల ఉదంతాలతో నిండిఉంది. అవే పార్టీ పతనానికి దారితీసి, ప్రతిపక్షాలకు ప్రయోజనం చేకూర్చాయి. 1990వ దశకంలోని సంఘటనలు ఈ విషయాన్ని సకాలంలో గుర్తు చేస్తాయి: అనుభవజ్ఞుడైన నాయకుడు వీరేంద్ర పాటిల్ ఆకస్మిక అనారోగ్య సమస్యతోదురదృష్టవశాత్తు వైదొలగడంతో, హైకమాండ్ ఒకదాని తర్వాత ఒకటిగా తప్పుడునిర్ణయాలు తీసుకుంది. ఎస్.ఎం. కృష్ణ, మల్లికార్జున్ ఖర్గే, ధరం సింగ్వంటి అనేక మంది సీనియర్ నాయకులను విస్మరించి, ఎస్. బంగారప్ప, వీరప్పమొయిలీలను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టింది. దీనికి కాంగ్రెస్ భారీమూల్యం చెల్లించుకుంది, ఆ తర్వాత దశాబ్దం పాటు అధికారానికి దూరమైంది. కానీ, ఈసారి సిద్ధరామయ్య నుండి శివకుమార్కు అధికార మార్పిడినివేగవంతంగా, నిర్ణయాత్మకంగా జరిపిన తీరును బట్టి చూస్తే, కాంగ్రెస్ అధిష్టానం గుణపాఠం నేర్చుకుని, అధికారాన్ని భిన్నమైన స్థాయిలో నడపడం ప్రారంభించిందని తెలుస్తోంది.
టెలివిజన్ ప్రసారాలు నిరంతరం సాగే ఈ కాలంలో, రాహుల్ గాంధీ సన్నిహితులు ఏఅవకాశాన్నీ వదులుకోలేదు. సిద్ధరామయ్య, శివకుమార్, ఇద్దరి వర్గాలకూకఠినమైన సందేశాలు పంపినట్లు తెలుస్తోంది. మొత్తం ఈ వ్యవహారమంతా ప్రణాళికాబద్ధంగా నిర్వహించడం ఒక విశేషం. అందుకే, సిద్ధరామయ్య తనతోకూడా శివకుమార్ను తీసుకుని గవర్నర్ లేకపోయినా, కార్యాలయంలో తనరాజీనామా లేఖను సమర్పించి వచ్చారు. కేరళ, తమిళనాడులలో సాధించిన విజయాల తర్వాత ముఖ్యంగా తమిళనాడు విషయంలో, చిరకాల మిత్రపక్షాన్ని వదులుకుని, దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత ఆ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కావాలనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న తర్వాత, కర్ణాటకఅధికార మార్పిడి 'నిర్వహణ' తీరు, అధిక రిస్కులు తీసుకోవడానికి వెనుకాడనిహైకమాండ్ మనస్తత్వాన్ని మరోసారి బయటపెడుతోంది.
శివకుమార్ ఒకటి రెండు రోజుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో, కొత్త మంత్రివర్గంలో ఎక్కువగా కొత్త, యువ ముఖాలను చేర్చడమే హైకమాండ్ ముందున్న తక్షణ కర్తవ్యం. దళితులు, ఓబీసీలు, మైనారిటీలకు,ముఖ్యంగా 60 ఏళ్ల లోపు యువ, కొత్త ముఖాలకు విస్తృత ప్రాతినిధ్యం కల్పించాలని రాహుల్ గాంధీ శివకుమార్ను ఆదేశించినట్లు తెలుస్తోంది.
కాంగ్రెస్ వైఖరిలో ఇది మరొక ప్రబలమైన మార్పుగా చెప్పుకోవాల్సిందే.
ఐదు హామీల' వల్ల తీవ్రంగా దెబ్బతిన్న కర్ణాటక ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉన్నది. ఈ క్రమంలో రాష్ట్ర శాసనసభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మంత్రులసంఖ్యను పరిమితం చేసే 91వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని శివకుమార్ అనుసరించడం సరైన మార్గం. కర్ణాటకలో ఈ సవరణ ప్రకారం గరిష్టంగా 34మంది మాత్రమే మంత్రులు కాగలరు. ముఖ్యంగా, పరిపాలనా రంగంలో శివకుమార్ పనితీరును నిశితంగా గమనిస్తారు. ఉప ముఖ్యమంత్రిగా ఆయన బెంగళూరులో ఎన్నో భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులనుప్రారంభించారు, కానీ అవన్నీ నిధుల కొరతతో సతమతమవుతున్నాయి. ఇందుకు కారణం, మే 2023లో తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనేసిద్ధరామయ్య అమలు చేసిన ఐదు హామీల వల్ల ఇప్పటివరకు రాష్ట్ర ఖజానాకు రూ.1.5 లక్షల కోట్ల భారం పడటమే. 202627 ఆర్థిక సంవత్సరానికి మరో రూ.51,286 కోట్లను కేటాయించారు. ఈ ఉచితాల కోసం ఇంత భారీగా ఖర్చు చేయడం వల్ల,కర్ణాటక రెవెన్యూ మిగులు రాష్ట్రం నుండి రెవెన్యూ లోటు రాష్ట్రంగా మారి,అనేక కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి.
శివకుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ఈ పథకాలపై సమగ్ర సమీక్షచేపట్టేందుకు, ఖర్చులను తగ్గించుకునే మార్గాలను కనుగొనేందుకు ఆర్థికనిపుణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తారని భావిస్తున్నారు. భారీ లీకేజీలను అరికట్టడం ఆయన తొలి ప్రాధాన్యతలలో ఒకటిగా ఉండాలి. ఒక విజయవంతమైన వ్యాపారవేత్తగా ఆయనకున్న నిర్వహణా నైపుణ్యాల దృష్ట్యా, శివకుమార్ ఈ సమస్యను తక్షణమే పరిష్కరిస్తారని భావిస్తున్నారు.
శివకుమార్ అధికార యంత్రాంగంలో సమగ్రమైన ప్రక్షాళనను కూడా ప్రారంభించాలి. ఇందులో భాగంగా సరైన వ్యక్తులను సరైన స్థానాల్లో నియమించడం, గడువులోగాపనులు పూర్తయ్యేలా పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించడం వంటివి ఉంటాయి. ఆయన ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా గమనిస్తూ కష్టపడి పనిచేస్తారనిపేరుంది.
అయితే, సిద్ధరామయ్య బెంగళూరులోనే ఉండి 'స్థానిక రాజకీయాల్లో చురుకుగాఉండాలని' తీసుకున్న నిర్ణయంతో, శివకుమార్ కార్యకలాపాలు నిశిత పరిశీలనకుగురవుతాయి. ఏమైనప్పటికీ, రాబోయే రెండేళ్ల పాటు తన ప్రయాణం సాఫీగాసాగిపోవాలంటే శివకుమార్ ఆచితూచి అడుగులు వేయడం త్వరగా నేర్చుకోవాల్సిఉంటుంది.



పాఠశాల బాలికలకు 3 రోజుల నెలసరి సెలవు

## కేరళ ప్రభుత్వ యోచన

**తిరువనంతపురం, మే 30,(ఎ.ఎం.ఎస్):**
పాఠశాల బాలికలకు ప్రతి నెలా మూడు రోజులవరకు నెలసరి సెలవును అందించే ప్రతిపాదనతో సహా, మహిళలు, పిల్లలపై దృష్టి సారించిన పలు కార్యక్రమాలను ప్రకటించడానికి కేరళ ప్రభుత్వం యోచిస్తోంది. ముఖ్యమంత్రి వి.డి. సతీసన్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వ విధాన ప్రసంగాన్నిగవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ శుక్రవారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రసంగిస్తూ ఈ చర్యలను వివరించారు. మెన్స్ట్రువల్ డిగ్నిటీ ప్రాజెక్టు ప్రతిపాదిత సెలవు విధానం ఈ ప్రాజెక్ట్లో ఒక భాగం. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం విద్యా సంస్థలను, బహిరంగ ప్రదేశాలను బాలికలు, మహిళలకు మరింతసమ్మిళితంగా మార్చడం.
విద్యార్థినుల పట్ల మా నిబద్ధత 'మెన్స్ట్రువల్ డిగ్నిటీ'ప్రాజెక్ట్లో ప్రతిబింబిస్తుంది. దీని కింద మేము విద్యా సంస్థలను, బహిరంగ ప్రదేశాలను బాలికలు, మహిళలకు స్నేహపూర్వకంగా మార్చాలనిఉద్దేశిస్తున్నాం అని ప్రభుత్వం పేర్కొంది. ఈ బాలికలు తమ చదువులో వెనుకబడకుండా ఉండేందుకు, పాఠశాల విద్యార్థినులకునెలసరి మూడు రోజుల వరకు సెలవుతో పాటు, వారాంతపు అదనపు తరగతులను కూడాప్రకటించాలని నా ప్రభుత్వం యోచిస్తోంది, అని గవర్నర్ తన విధాన ప్రసంగంలోతెలిపారు. పని ప్రదేశాలలో శిశు సంరక్షణ1961 ప్రసూతి ప్రయోజన చట్టానికి అనుగుణంగా శిశు సంరక్షణ నిబంధనలనుప్రవేశపెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదన ప్రకారం, ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక సంస్థలు, ఐటీ పార్కులు, 50 మందికి పైగా ఉద్యోగులున్న అన్ని పని ప్రదేశాలలో సురక్షితమైన, నాణ్యమైన డేకేర్ సెంటర్లు, క్రెచ్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.
మహిళలపై దృష్టివివిధ సంక్షేమ చర్యల ద్వారా కేరళను దేశంలోనే అత్యంత మహిళా స్నేహపూర్వక రాష్ట్రంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.
నా ప్రభుత్వం కేరళను దేశంలోనే అత్యంత మహిళా స్నేహపూర్వక రాష్ట్రంగా తీర్చిదిద్దుతుంది. కార్యాలయాల్లో మహిళలకు సమాన వేతనం అమలు చేసేందుకుచర్యలు తీసుకుంటాం. కేరళలోని అన్ని ప్రధాన పట్టణాల్లో పబ్లిక్ రెస్ట్రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం, అని గవర్నర్ అన్నారు.
అదనపు ప్రతిపాదనలలో అసంఘటిత రంగంలోని మహిళలకు ప్రయోజనాలను విస్తరించడం,అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆరు నెలల ప్రసూతి సెలవు మంజూరు చేయడం, శానిటరీ నాప్కిన్లు, పాదరక్షలు, ఇతర నిత్యావసరాల లభ్యతను మెరుగుపరచడంవంటివి ఉన్నాయి.
అనాథ రహిత కేరళ దార్శనికత
కేరళను భారతదేశంలోనే మొట్టమొదటి అనాథ రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంతో,దత్తత ప్రచారాలను బలోపేతం చేయడానికి, బాలల న్యాయ చట్టం కింద శిక్షణపొందిన పెంపుడు కుటుంబాల నెట్వర్క్ను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలను కూడా ప్రకటించింది.

## బెంగాల్లోని సోనార్పూర్లో అభిషేక్ బెనర్జీపై మూక దాడ

హింసాత్మక నిరసన సందర్భంగా రాళ్లు, గుడ్లు విసిరిన అల్లరి మూకలు

**వుదయం డెస్క్, మే 30:**
పశ్చిమ బెంగాల్లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలోనిసోనార్పూర్లో శనివారం జరిగిన ఉన్నత స్థాయి పర్యటన సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు అభిషేక్ బెనర్జీ భారీ, తీవ్ర నిరసనను ఎదుర్కొన్నారు. పశ్చిమ బెంగాల్లో ఇటీవల జరిగిన ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించడానికిబెనర్జీ వచ్చినప్పుడు, ఆగ్రహించిన గుంపు ఆయనపై రాళ్లు, గుడ్లు విసరడంతోపరిస్థితి వేగంగా హింసాత్మకంగా మారిందని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. అకస్మాత్తుగా చెలరేగిన ప్రజాగ్రహాన్ని అదుపు చేయడంలో స్థానిక పోలీసులువిఫలమయ్యారు. ఇది తీవ్రమైన భద్రతా ఘర్షణలకు దారితీసి, గాయాలను నివారించడానికి ఎంపీ భద్రతా సిబ్బంది ఆయన చుట్టూ రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయవలసి వచ్చింది.
ఈ ఘటన జరిగిన వెంటనే మీడియాతో మాట్లాడిన అభిషేక్ బెనర్జీ, ఈ ఆందోళననుపూర్తిగా పథకం ప్రకారం జరిగిన దాడిగా ఆగ్రహంతో అభివర్ణించారు. ఈ అశాంతిని అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ)నే సృష్టించిందని ఆయన నేరుగాఆరోపించారు. ఈ దాడి వారి ప్రజాస్వామ్య విధానానికి స్పష్టమైన ఉదాహరణ అనిపేర్కొన్నారు. బెంగాల్లో ఇప్పుడు ఏం జరుగుతోంది? రెండవ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన బెంగాల్ లోక్సభ నాయకుడు, ఎన్నికల అనంతర హింసాకాండలో బీజేపీ చేతిలో హత్యకు గురైన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లారు. అభిషేక్ ఎఐటిసిని కొందరు బీజేపీ మద్దతుదారులు కొట్టి, దాడి చేశారు. ప్రాణాలకు ప్రమాదం. పోలీసులు ఎక్కడున్నారు... అంటూ డెరెక్ ఓ'బ్రియన్ ట్వీట్ చేశారు. స్థానిక పరిపాలన స్పందనపై బెనర్జీ తీవ్ర నిరాశ వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసి నెల కూడా కాకపోయినప్పటికీ, గందరగోళం చెలరేగిన తొలి క్షణాల్లో పోలీసులు ఎక్కడా కనిపించలేదని ఆమె పేర్కొన్నారు. ప్రముఖ ఎంపీ రాళ్లు రువ్వే గుంపుకు గురయ్యేలా చేసిన నిఘా వైఫల్యంపై తక్షణ విచారణ జరపాలని టీఎంసీ నాయకత్వం డిమాండ్ చేసింది.
సోనార్పూర్లో జరిగిన హింస, ఎన్నికల అనంతర ఘర్షణలతో అట్టుడుకుతున్న పశ్చిమ బెంగాల్లోని అస్థిర రాజకీయ వాతావరణాన్ని స్పష్టం చేస్తోంది. ఈ ఆందోళనకు తామే నిధులు సమకూరుస్తున్నామన్న బెనర్జీ ఆరోపణలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష టీఎంసీ స్థానిక నాయకత్వంపై ప్రజాగ్రహం ఆకస్మికంగా వ్యక్తమవ్వడమే ఈ నిరసనలకు కారణమంటూ ఆ పార్టీ ఎదురుదాడి చేసింది. దీంతో, సోనార్పూర్లోని సున్నితమైన ప్రాంతాలలో ఫ్లాగ్మార్చ్లు నిర్వహించి, శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి స్థానికపోలీసులు అల్లర్ల నిరోధక దళాలతో సహా భారీ అదనపు బలగాలను మోహరించారు. తమ జాతీయ ప్రధాన కార్యదర్శిపై జరిగిన దాడికి నిరసనగా వీధుల్లోకిదిగుతామని తృణమూల్ శపథం చేస్తున్న నేపథ్యంలో, ఈ ఘర్షణ శాంతిభద్రతలయంత్రాంగంపై మరింత ఒత్తిడిని పెంచి, రాష్ట్రవ్యాప్తంగా పాతుకుపోయిన రాజకీయ విభేదాలను తీవ్రతరం చేయనుంది.

## ఆపరేషన్ సింధూర్ 2.0కు బలగాలు సిద్ధమవుతున్నాయన్న ఆర్మీ చీఫ్



**పూణె, మే 30 (వుదయం):**
ప్రస్తుతం ఘర్షణలు తాత్కాలికంగానిలిచిపోయినప్పటికీ, ఆపరేషన్ సింధూర్ కొనసాగుతోందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది శనివారం తెలిపారు. భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలకైనాస్పందించేందుకు సాయుధ దళాలు కార్యాచరణపరంగా అప్రమత్తంగా, సిద్ధంగా ఉన్నాయని ఆయన నొక్కి చెప్పారు. ఖడక్వాస్లాలోని జాతీయ రక్షణ అకాడమీ (ఎన్డిఎ)లో జరిగిన 150వ కోర్సుపాసింగ్అవుట్ పరేడ్లో ప్రసంగిస్తూ, అవసరమైతే భవిష్యత్ ఆకస్మికపరిస్థితుల కోసం సన్నాహాలు ఇప్పటికే జరుగుతున్నాయని ఆర్మీ చీఫ్ తెలిపారు. సింధూర్ 2.0 కోసం సన్నద్ధమవుతున్నదళాలుపరిస్థితులు డిమాండ్ చేస్తే ఆపరేషన్ సింధూర్ 2.0 చేపట్టే అవకాశం ఉందనిప్రస్తావిస్తూ, భారత సైన్యం, భారత వైమానిక దళం, భారత నావికా దళంతో కలిసిభవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు సన్నద్ధమవుతున్నాయని జనరల్ ద్వివేదిఅన్నారు. త్రి సేవల సమన్వయాన్ని బలోపేతం చేయడం, పోరాట సన్నద్ధతను పెంచడం, మారుతున్నయుద్ధ స్వరూపానికి అనుగుణంగా మారడంపై సైన్యం తక్షణమే దృష్టి సారిస్తోందనిఆయన అన్నారు. నిఘా, గూఢచార రంగాలలో వచ్చిన పురోగతులు సైనిక కార్యకలాపాలను ఎలామార్చివేశాయో, యుద్ధ క్షేత్రాలను మరింత పారదర్శకంగా ఎలా మార్చాయోసైన్యాధిపతి నొక్కి చెప్పారు. యుద్ధ క్షేత్రం 24 గంటలూ ఎంత పారదర్శకంగాఉందంటే, ప్రతి కదలిక అవతలి పక్షానికి తెలిసిపోతుంది, అని ఆయన అన్నారు. ఆయన ప్రకారం, దీనికి సైనిక మోహరింపు, కార్యాచరణ ప్రణాళిక, సున్నితమైనసరిహద్దు ప్రాంతాలలో నివసిస్తున్న పౌరులను రక్షించే ప్రయత్నాలలో మరింతజాగ్రత్త అవసరం. ఆధునిక సంఘర్షణలలో సమాచార యుద్ధం ప్రాముఖ్యతపెరుగుతోందని జనరల్ ద్వివేది నొక్కి చెప్పారు. దేశమంతా ఏకమై, సమాచారం ఇచ్చేవారిని విశ్వసించినప్పుడే సమాచార యుద్ధంవిజయవంతమవుతుంది, అని ఆయన అన్నారు. జాతీయ ఐక్యత, ప్రజల విశ్వాసం, విశ్వసనీయమైన సమాచార ప్రసారం అనేవి సైనిక సంసిద్ధతలో అంతకంతకూ ముఖ్యమైన అంశాలుగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

## డీకే శివకుమార్ను నాయకుడిగా ఎన్నుకున్న కర్ణాటక సీఎల్పీ

జూన్ 3న ప్రమాణ స్వీకారం జరిగే అవకాశంబెంగళూరు, మే 30,(ఎ.ఎం.ఎస్):శనివారం డీకే శివకుమార్ కర్ణాటక కాంగ్రెస్శాసనసభ పక్షం (సీఎల్పీ) నాయకుడిగా ఎన్నికయ్యారు. దీంతో జూన్ 3న రాష్ట్రతదుపరి ముఖ్యమంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారానికి లాంఛనంగా మార్గంసుగమమైంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య రాజీనామాను గవర్నర్ థావర్చంద్గెహ్లాట్ ఆమోదించి, కాంగ్రెస్హైకమాండ్ ఈ పరివర్తనకు మద్దతు ఇవ్వడంతో, శివకుమార్ ఎన్నిక ఒక ముఖ్యమైనరాజకీయ మైలురాయిగా నిలిచింది. . కొత్త మంత్రివర్గంలో కీలక సభ్యులుగా ఉంటారని భావిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకుల బృందంతో పాటు శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసే అవకాశంఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలోకి చేరనున్న వారిలో దినేష్గుండూ రావు, లక్ష్మీ హెబ్బాల్కర్, రామలింగారెడ్డి, రిజ్వాన్ అర్షద్, యూటీ ఖాదర్, శరత్ బచేగౌడ, ఏఎస్ పొన్నన్న, భైరతి సురేష్, ప్రియాంక్ ఖర్గేఉన్నారు. సీనియర్ నాయకులైన ఎం.బి. పాటిల్, జి. పరమేశ్వర, కృష్ణ బైరేగౌడ, ఈశ్వర్ఖండ్రే, కె.జె. జార్జ్, హెచ్.సి. మహాదేవప్ప, సంతోష్ లాడ్లకు కూడా కొత్తమంత్రివర్గంలో చోటు దక్కే అవకాశం ఉంది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకొత్త మంత్రివర్గ ఏర్పాటులో, కొనసాగింపుతో పాటు కొత్త ప్రాతినిధ్యాన్నిసమతుల్యం చేయడంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. పదవీ విరమణ చేస్తున్నప్రభుత్వంలోని పలువురు మంత్రులు కీలక బాధ్యతలను కొనసాగించే అవకాశం ఉండగా,ప్రాంతీయ, సామాజిక ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయడానికి కొత్తవారికి చోటుకల్పించవచ్చు. ఇదిలా ఉండగా, శివకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టడానికి మే 31, జూన్ 5, జూన్6 అనే మూడు తేదీలను తాను సూచించినట్లు జ్యోతిష్యుడు ద్వారకానాథ్ గురూజీతెలిపారు. శివకుమార్కు సుదీర్ఘ రాజకీయ జీవితం ఉంటుందని ఆయన జోస్యంచెప్పడంతో పాటు, కాంగ్రెస్ నాయకత్వం మద్దతు ఆయనకు కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## క్లెయిము చేయని నగదు కోసం కామన్ ల్యాండింగ్ పోర్టల్ ప్రారంభం

**వుదయం డెస్క్, మే 30:**
క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తుల కోసం కామన్ల్యాండింగ్ పోర్టల్ను ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) శుక్రవారం ప్రారంభించింది. పీఎస్బీ అలయన్స్ సహకారంతోఅభివృద్ధి చేసిన ఈ పోర్టల్ క్లెయిమ్ చేయని నగదుకు సంబంధించినసమాచారాన్ని సులభంగా పొందేందుకు ఉపయోగపడుతుంది. అన్క్లెయిమ్డ్ అసెట్స్ పోర్టల్ డాట్ ఇన్(www.unclaimedassetsportal.in) పేరుతో అందుబాటులో ఉన్న ఈ పోర్టల్ మొత్తం ఆర్థిక వ్యవస్థలో క్లెయిమ్ చేయని బ్యాంకు డిపాజిట్లు, బీమాక్లెయిమ్లు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లను సులభంగా వెతికిగుర్తించేందుకు సమగ్ర వేదికగా పనిచేస్తుంది. ఈ పోర్టల్ను 2026 మే 29నజరిగిన ప్రభుత్వ రంగ బ్యాంకుల సమీక్షా సమావేశంలో ఆర్థిక సేవల విభాగకార్యదర్శి ఎమ్. నాగరాజు ప్రారంభించారు. ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు, బ్యాంకులు, ఇతర భాగస్వామ్య సంస్థలసమన్వయంతో ఆర్థిక సేవల విభాగం చేపట్టిన దేశవ్యాప్త ప్రచారం "ఆప్కీ పూంజీ,ఆప్కా అధికార్ (మీ డబ్బు, మీ హక్కు)" ప్రచార కార్యక్రమానికి ఈ వేదికమరింత బలం చేకూరుస్తోంది. క్లెయిమ్ చేయని నగదుపై అవగాహన కల్పించడం,వాటిని గుర్తించడం, యజమానులకు తిరిగి అందించడం ఈ కార్యక్రమం ప్రధానలక్ష్యాలు. క్లెయిమ్ చేయని నగదు కోసం ఒకే వేదికపై వెతుక్కునే సౌలభ్యం కల్పించడంద్వారా ఈ పోర్టల్ పౌరుల సౌకర్యాన్ని మెరుగుపరుస్తుందని, వ్యక్తులను వారిఅర్హత కలిగిన ఆర్థిక ఆస్తులతో తిరిగి అనుసంధానించడానికి ప్రస్తుతంజరుగుతున్న ప్రయత్నాలను బలోపేతం చేస్తుందని ఆర్థిక సేవల విభాగంకార్యదర్శి ప్రముఖంగా పేర్కొన్నారు. ఈ సమగ్ర వేదిక (కామన్ ల్యాండింగ్ పోర్టల్) మరింత సులభమైన, పారదర్శకమైన,ప్రజా కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా ఒక ముఖ్యమైనఅడుగు. మెరుగైన ఆర్థిక సాధికారత, సమ్మిళితం, ఆర్థిక వ్యవస్థపై నమ్మకంద్వారా వికసిత్ భారత్ 2047దార్శనికతకు అనుగుణంగా ఈ కార్యక్రమం ప్రజలలోఅవగాహనను పెంచుతుందని, సమాచారాన్ని సులభంగా పొందే వీలు కల్పిస్తుందనిభావిస్తున్నారు.

## జూన్ 1న విచారణకు హాజరవ్వాలని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీకి సీఐడి సమన్లు

**కోల్కత, మే 30,(ఎ.ఎం.ఎస్):**
పశ్చిమ బెంగాల్ సీఐడీ అధికారులు శనివారంతృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకోల్కతా నివాసానికి వెళ్లి, విచారణకు హాజరు కావాలని నోటీసు జారీ చేశారు. జూన్ 1న పశ్చిమ బెంగాల్ పోలీస్ ప్రధాన కార్యాలయం అయిన భవానీ భవన్లో దర్యాప్తు అధికారుల ఎదుట హాజరు కావాలని బెనర్జీని కోరారు. టీఎంసీ ఎంపీకిసంబంధించిన ఆస్తులపై జారీ చేసిన నోటీసుల విషయంలో రాజకీయ వివాదం చెలరేగిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటు చేసుకుంది
. సీఐడీ చర్యసీఐడీ అధికారులు కోల్కతాలోని కాళీఘాట్ ప్రాంతంలో ఉన్న బెనర్జీనివాసానికి చేరుకుని నోటీసును అందజేశారు. అధికారులు ఇంకా సమన్ల వివరాలనువెల్లడించనప్పటికీ, సోమవారం ఏజెన్సీ ఎదుట హాజరు కావాలని బెనర్జీనిఆదేశించారు. టీఎంసీ నాయకుడికి సంబంధం ఉన్నట్లు చెబుతున్న పలు ఆస్తులలో అనధికారనిర్మాణాలు జరిగాయనే ఆరోపణలపై కోల్కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)నోటీసులు జారీ చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో తలెత్తిన వివాదం తర్వాతఈ తాజా పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ అభ్యంతరంటీఎంసీ నాయకుడికి సంబంధించిన ఆస్తుల వద్ద జరిగిన అనధికార నిర్మాణాలపైజారీ చేసిన నోటీసుల వివాదం నేపథ్యంలో, మే 26న కోల్కతా పోలీసులు అభిషేక్బెనర్జీ నివాసానికి వెళ్లారు. ఈ ఆరోపణలపై బెనర్జీ కోల్కతా మున్సిపల్కార్పొరేషన్ను వివరణ కోరారని, కానీ ఎటువంటి స్పందన రాలేదని పేర్కొంటూ,పార్టీ సీనియర్ నాయకుడు శోభన్దేబ్ చటోపాధ్యాయ్ పోలీసుల చర్యనుప్రశ్నించారు. ఈ విషయంలో పోలీసుల ప్రమేయం అన్యాయమని, ఈ పరిణామాలు ప్రజాస్వామ్య నియమాలకువిరుద్ధంగా ఉన్నాయని ఆయన వాదించారు. అధికారులు పక్షపాతంతో చర్యలు తీసుకుంటున్నారని, రాజకీయ కక్ష సాధింపుచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ కూడా బీజేపీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ఉల్లంఘనలుశ్చించారు
. ఈ విషయంలో పోలీసుల ప్రమేయం అన్యాయమని, ఈ పరిణామాలు ప్రజాస్వామ్య నియమాలకువిరుద్ధంగా ఉన్నాయని ఆయన వాదించారు. అధికారులు పక్షపాతంతో చర్యలు తీసుకుంటున్నారని, రాజకీయ కక్ష సాధింపుచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ కూడాబీజేపీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ఉల్లంఘనలుజరుగుతున్నా వాటిని విస్మరిస్తూ, యంత్రాంగం పక్షపాత
. టీఎంసీ నాయకుడికి సంబంధం ఉన్నట్లు చెబుతున్న పలు ఆస్తులలో అనధికారనిర్మాణాలు జరిగాయనే ఆరోపణలపై కోల్కతా మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ)నోటీసులు జారీ చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో తలెత్తిన వివాదం తర్వాతఈ తాజా పరిణామం చోటుచేసుకుంది. టీఎంసీ అభ్యంతరంవ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. జరుగుతున్నా వాటిని విస్మరిస్తూ, యంత్రాంగం పక్షపాత ధోరణితోవ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఇలా ఉండగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శికి అవకతవకలతో సంబంధం ఉందన్నవార్తలను టీఎంసీ తీవ్రంగా ఖండించింది. అభిషేక్ బెనర్జీ, ఇతర సీనియర్నాయకుల ప్రతిష్టను దెబ్బతీసే ప్రచారంలో భాగంగానే ఈ నోటీసులను మీడియాలోనికొన్ని వర్గాలకు అనధికారికంగా లీక్ చేసి, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగాప్రచారం చేశారని పార్టీ ఒక ప్రకటనలో ఆరోపించింది.
తమ నాయకత్వాన్ని రాజకీయంగా లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నాలుజరుగుతున్నాయని పేర్కొంటూ, ఆ ఆరోపణలు అసత్యమైనవి, కల్పితమైనవి,నిరాధారమైనవి అని పార్టీ అభివర్ణించింది. సీఐడీ సమన్లకు సంబంధించినమరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## నీట్ లీక్, సీబీఎస్ఈ వివాదం, ఇప్పుడు సీయూఈటీ ఆలస్యం

**పరీక్షా విధానంలోని లోపాలపై ప్రభుత్వంపై విమర్శలు**
**వుదయం డెస్క్, మే 30:**
దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో సాంకేతిక లోపం కారణంగా కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సియుఇటియూజీ) 2026 ఆలస్యంకావడంతో, జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణపై నరేంద్ర మోడీ నేతృత్వంలోనికేంద్ర ప్రభుత్వం శనివారం నాడు కొత్త విమర్శలను ఎదుర్కొంది. ప్రధానంగా పరీక్ష రెండవ షిఫ్ట్ను ప్రభావితం చేసిన ఈ అంతరాయం వల్ల,విద్యార్థులు తమ నిర్ణీత రిపోర్టింగ్ సమయం దాటిన తర్వాత కూడా వేచిఉండాల్సి వచ్చింది. తమ టెక్నాలజీ భాగస్వామి అయిన టాటా కన్సల్టెన్సీసర్వీసెస్ నివేదించిన సాంకేతిక సమస్య కారణంగానే ఈ ఆలస్యం జరిగిందనినేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తర్వాత పేర్కొంది. ఈ సంఘటన ప్రతిపక్ష నాయకుల నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. వారు ఈఆలస్యాన్ని, ఇటీవల నీట్యూజీ పరీక్ష చుట్టూ నెలకొన్న వివాదాలు, సీబీఎస్ఈమూల్యాంకన సమస్యలు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సి) పరీక్షలలోఅంతరాయాలతో ముడిపెట్టారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకురాలు, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి,సీయూఈటీ ఆలస్యాన్ని జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో మరో దుర్విధానంగాఅభివర్ణిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. లోక్సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఇలాంటి అభిప్రాయాలనేవ్యక్తం చేస్తూ, కేంద్రంపై తీవ్ర స్థాయిలో విమర్శల వర్షం కురిపించారు. నీట్. సీబీఎస్ఈ. ఎస్ఎస్సీ. ఇప్పుడు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. అని ఆయన ఎక్స్పైఆయన 'విశ్వగురువు' వాదనలను సవాలు చేస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీమొత్తం విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారు అని అన్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ విమర్శలో పాలుపంచుకుంటూ, అతిషిపోస్ట్ను షేర్ చేస్తూ, దేశానికి విద్యావంతుడైన ప్రధానమంత్రి అవసరమనివ్యాఖ్యానించారు. ఎన్టిఎ స్పందనఎన్టిఎ జారీ చేసిన సవరించిన షెడ్యూల్ ప్రకారం, మధ్యాహ్నం సెషన్అభ్యర్థులు మధ్యాహ్నం 2:30 గంటల నుండి రిపోర్ట్ చేయాల్సి ఉండగా, పరీక్షమొదటగా నిర్ణయించిన 3 గంటలకు బదులుగా సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైంది. మే 30న కొన్ని కేంద్రాలలో పరీక్ష ప్రారంభం ఆలస్యం కావడానికి కారణమైనసాంకేతిక లోపాన్ని టిసిఎస్ నివేదించిందని ఎన్టిఎ తన వివరణలో తెలిపింది. ఈ సమస్య పరిష్కారమైందని, ఎవరూ నష్టపోకుండా చూసేందుకు అభ్యర్థులకుపూర్తి పరిహార సమయం ఇస్తామని ఆ ఏజెన్సీ పేర్కొంది. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో నీట్యూజీ 2026 పరీక్షనురద్దు చేసిన కొన్ని వారాలకే సీయూఈటీలో ఈ అంతరాయం ఏర్పడింది. ఈ వివాదంసీబీఐ దర్యాప్తునకు దారితీయగా, జూన్ 21న పునఃపరీక్షను నిర్వహించాల్సివచ్చింది. ఇదిలా ఉండగా, సీబీఎస్ఈ డిజిటల్ మూల్యాంకన వ్యవస్థ, ఇటీవలిఎస్ఎస్సీ పరీక్షలు కూడా నిర్వహణాపరమైన సమస్యలపై విమర్శలను ఎదుర్కొన్నాయి. తాజా సాంకేతిక లోపం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో మరింత జవాబుదారీతనంకోసం ప్రతిపక్షాల డిమాండ్లను తీవ్రతరం చేయగా, భవిష్యత్ పరీక్షలు సజావుగాజరిగేలా దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది.



# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆకట్టుకున్న కిశోర బాలికల మాక్ పార్లమెంట్



* ప్రజాస్వామ్య విలువల పెంపుకు దోహదం
* జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, మే 30 (వుదయం ప్రతినిధి) :
ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా శక్తి వారోత్సవాల్లో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (SERP) వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శనివారం జీడబ్ల్యూఎంసీ కౌన్సిల్ హాల్‌లో స్నేహ సంఘ కిశోర బాలికలతో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కార్యక్రమం పిల్లలను ఆకట్టుకుంది. మాక్ పార్లమెంట్‌లో విద్య, ఆరోగ్యం, భద్రత, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, రవాణా, మౌలిక వసతులు, కిశోర బాలికల్లో రక్తహీనత, స్నేహ సంఘాల అవసరం, బాలికల సాధికారత వంటి అంశాలపై చర్చలు, ప్రశ్నోత్తరాలు ఆసక్తికరంగా సాగింది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకులు, పాలకపక్ష సభ్యులు, రిపోర్టర్లు, తీర్మానాల కమిటీ సభ్యుల పాత్రలను బాలికలు సమర్థంగా పోషిస్తూ పార్లమెంట్ విధానాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.
ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని బాలికలను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలు భాగంగా మహిళా వారోత్సవాలలో భాగంగా శనివారం స్నేహ మా పార్లమెంట్ నిర్వహించడమైనది ఈ స్నేహ గ్రూపుల ద్వారా పార్లమెంట్ నిర్వహించడం జరిగిందని అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "కిశోర బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, ప్రజాస్వామ్య విలువలపై అవగాహన పెంపొందించేందుకు మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి. విద్య, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతులు వంటి కీలక అంశాలపై బాలికలు నిర్భయంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం అభినందనీయమన్నారు.
సమస్యలను గుర్తించడంతో పాటు వాటి పరిష్కారాలపై సూచనలు చేయడం ద్వారా వారి ఆలోచనా సామర్థ్యం, నాయకత్వ నైపుణ్యాలు భవిష్యత్తులో సమాజ అభివృద్ధికి, దేశ నిర్మాణానికి ఇటువంటి చైతన్యవంతమైన యువత ఎంతో అవసరం అన్నారు. స్నేహ అనేది సేఫ్టీ,న్యూట్రిషన్ ,ఎడ్యుకేషన్, హెల్త్ అనే కాన్సెప్ట్ తో ఏర్పాటు చేయడం జరిగింది .యూనిసెఫ్ ఆధ్వర్యంలో ఈ స్నేహ కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా వరంగల్ జిల్లాలో ప్రారంభించడం జరిగింది దీన్ని 33 జిల్లాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ గ్రూప్ ద్వారా పిల్లలకు అవేర్నర్స్ కల్పించడం కూడా జరిగింది మన జిల్లాలో ఫ్లాట్షిట్ ప్రోగ్రాంగా చేయడంతో పాటు దేశవ్యాప్తంగా బాలికల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బాలికలు విద్యతో పాటు ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి." వారి ఈ సందర్భంగా పిల్లలనుద్దేశించి మాట్లాడారు.
ఈ మాక్ పార్లమెంట్ ద్వారా మంచి విషయాలను నేర్చుకున్నారన్నారు.
పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్భయంగా ప్రస్తావించడంతో పాటు వాటి పరిష్కారాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.
ఇలాంటి కార్యక్రమాలు ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు, ధైర్యంగా మాట్లాడే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మాక్ పార్లమెంట్‌లో ప్రతిపాదించిన తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించడాన్ని అందరినీ ఆనందాన్ని వెల్లివెరిసేల చేశారు. ఈ సందర్భంగా 'ఉల్లాస్–అమ్మకు అక్షరమాల' కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లు, లెర్నర్లను సన్మానించారు. అనంతరం వైద్య శాఖ సహకారంతో కిషోర బాలికలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. తదుపరి రాణి రుద్రమదేవి జిల్లా మహిళా సమాఖ్య ప్రత్యేక సాధారణ సమావేశం నిర్వహించి, మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాం రెడ్డి, డీఎంహెచ్ఓ సాంబ శివరావు, డీఈఓ రంగయ్యనాయుడు, డీడబ్ల్యూఓ రాజమణి, డీపీఎంలు, ఏపీఎంలు, SERP సిబ్బంది, వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.





## నీతి, నిజాయితీగా పని చేయాలి

* తెలంగాణ డిజిపి సి.వి. ఆనంద్

హనుమకొండ క్రైం, మే 30 వుదయం ప్రతినిధి) :
ప్రతి పోలీస్ అధికారి నీతి నిజాయితీ పనిచేయాలని తెలంగాణ డిజిపి తెలిపారు.
తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిజిపి రాష్ట్ర పోలీస్ అధికారులతో హైదరాబాద్ నుండి వీడియో సమావేశం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ శాంతి భద్రతల పరిరక్షణ కొరకు పోలీస్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులతో, ఉద్యోగ సమయం అధికారులు, సిబ్బంది పాటించాల్సిన తీరు పై డిజిపి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. సమావేశానికి వరంగల్ కమిషనరేట్ కు చెందిన డీసీపీ లు, అదనపు, ఏసీపీ, ఇన్స్ స్పెక్టర్లు,
ఎస్.ఐ వారి, వారి కార్యాలయం నుండి పాల్గొన్నారు.

### బీరాపల్లి సెక్టర్లో సూపర్వైజర్ భవాని ఆధ్వర్యంలో
## అమ్మ మాట అంగన్వాడి బాట



సత్తుపల్లి మే 30 (వుదయం ప్రతినిధి)
వేంసూర్ మండలం బీరాపల్లి సెక్టార్ అడసర్లపాడు 4 అంగన్వాడి కేంద్రాలలో సూపర్వైజర్ భవాని ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్ లు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా విద్యారంభం బాల్యారంభ సంరక్షణ మరియు విద్య ఈసీసీఈ ధ్రువపత్రాలు పిల్లల తల్లి దండ్రులకు అందజేశారు.హోమ్ విసిట్ చేసి పిల్లలకు అంగన్వాడి కేంద్రాలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు.
అదేవిధంగా పిల్లలకు ఆహారం తినిపించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు నాణ్యత పరిశుభ్రతపై డెమో చూపించడం గర్భిణీ స్త్రీలు మరియు రెండు సంవత్సరాల్లోపు పిల్లలు తల్లులతో సమావేశాలు నిర్వహించుట ఆ సమావేశానికి కుటుంబమునుంచే భర్తలు తల్లులతో అమ్మమ్మ తాతయ్యని ఆహ్వానించుట, పరిశుభ్రతపై అవగాహన సదస్సులు, అనుబంధ ఆహార అలవాట్లు ప్రారంభించడం మరియు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని అంగన్వాడీ టీచర్లు విజయ కుమారి పద్మ నిర్మల శాలిని వెంకటమ్మ తల్లులు పిల్లలు పాల్గొన్నారు .



సత్తుపల్లి ఎమ్మెల్యే మట్ట రాగమయి జిల్లా కలెక్టర్ ను సత్తుపల్లి నియోజకవర్గాల సమస్యల గురించి చర్చించినారు

## స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్

* సభాపతులుగా, మంత్రులుగా అదరగొట్టిన విద్యార్థినులు!
* బాలికల హక్కులు, భద్రత, విద్యపై సుదీర్ఘ చర్చ ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన కల్పించడమే లక్ష్యం



జనగామ, మే 30 (వుదయం ప్రతినిధి) :
విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తిని, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో 'స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ సభకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**బాలికల గొంతుకకు వేదిక:**
జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన విద్యార్థినులు సభాపతి (స్పీకర్), మంత్రులు, ప్రతిపక్ష సభ్యులుగా మారి పార్లమెంట్ పనితీరును ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, నాణ్యమైన విద్యా సౌకర్యాలు, పారిశుధ్యం, పోషకాహారం వంటి పలు సామాజికాంశాలపై విద్యార్థినులు ధైర్యంగా తమ గొంతుకను వినిపించి ఆకట్టుకున్నారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామ పంచాయతీలో యుక్త వయసు బాలికల కోసం 'స్నేహ సంఘాలు' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలికలు తమ హక్కులతో పాటు సమాజంలో అందుబాటులో ఉన్న రక్షణ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లుకు ఫోన్ చేయగలరు.బాల్య వివాహాల నిర్మూలనకు/ బాలల రక్షణకు: 1098 (చైల్డ్ లైన్ మహిళల రక్షణ/సఖి కేంద్రం 181 భరోసా కేంద్రం 100గుట్కా, గంజాయి విక్రయాల సమాచారం కోసం (ఈగల్ బృందం) 1908సైబర్ వేధింపులు/ మోసాల కోసం 1930పాఠశాలల్లో ఆహార భద్రత సమస్యలపై ఫిర్యాదుకు 18004256605సాధికారత అంటే కేవలం ఆర్థిక స్వావలంబన మాత్రమే కాదని, సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం మరియు ఆత్మగౌరవంతో జీవించడమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. జీవితంలో ఎంత ఎదిగినా నైతిక విలువలతో రాజీ పడవద్దని పిలుపునిచ్చారు. చట్టాలపై అవగాహన అవసరం అని డీసీపీ అన్నారు. అనంతరం డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. బాలికలు పోక్సో (POCSO) చట్టం, సైబర్ భద్రత, గుడ్ టచ్‌బ్యాడ్ టచ్ మరియు స్టాకింగ్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల దృష్ట్యా సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు.కార్యక్రమం ముగింపులో మాక్ పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, 'ఉల్లాస్' కింద శిక్షకులకు (ట్రైనర్స్),
అభ్యర్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో భాస్కర్, ఏపీడీ నూరుద్దీన్, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

### వరి కొయ్యలను కాల్చకండి
## పర్యావరణాన్ని పాడు చేయకండి

జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట మే: 30(వుదయం ప్రతినిధి)
వరి పంట కోత తర్వాత పొలంలో మిగిలిన వరి కొయ్యలను కాల్చడం వల్ల తీవ్ర దుష్పరిణామాలు సంభవిస్తాయని, రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ వరి కొయ్యలు తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విజ్ఞప్తి చేశారు.శనివారం సూర్యాపేట మండలం కాసారాబాద్ గ్రామంలో "వరి కొయ్యలు తగలబెట్టొద్దు" అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ★కె. నరసింహ★తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరి కొయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, దుక్కి దున్నినా భూమి గుల్లగా మారదని, దీంతో పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. భూమి సారాన్ని పెంచుకోవడానికి అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని, ఆ భారం కూడా రైతులపైనే పడుతుందని తెలిపారు.వరి కొయ్యలు కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడతాయని, పక్కనున్న చెట్లు, విలువైన పరికరాలు తగలబడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ చెప్పారు.జిల్లా ఎస్పీ కె. నరసింహ మాట్లాడుతూ, వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా భూములు సారవంతం కోల్పోతాయని హెచ్చరించారు. వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఏసీపీ ప్రసన్న కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ బాలకృష్ణ, ఏడీఏ జ్ఞానేశ్వరి, ఏఓ కృష్ణ సందీప్, సర్పంచ్ బూపాల్ రెడ్డి తదితర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీనే ప్రభుత్వ లక్ష్యం

– తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి



హనుమకొండ, మే 30 (వుదయం జిల్లా ప్రతినిధి) :
రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హన్మకొండ ఐడీఓసీ సమావేశ మందిరంలో హన్మకొండ, వరంగల్ జిల్లాల విత్తన డీలర్లు, సహకార సంఘాలు, ఏఆర్ఎస్కే (ARSK) కేంద్రాల ప్రతినిధులతో ఆయన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలకు చెక్, రైతులు కల్తీ విత్తనాల బారిన పడి నష్టపోకుండా, నాణ్యమైన విత్తనాలను వాడేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.పంటల మార్పిడి అవసరం: కేవలం వరిపైనే ఆధారపడకుండా రైతులు ఆదాయాన్ని పెంచుకునేందుకు పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి.నేరుగా రైతుల నుంచే ఉత్పత్తి: విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై విత్తన ఉత్పత్తి చేపడుతుందని, కఠినమైన నాణ్యత పరీక్షల తర్వాతే ధృవీకరించి రైతులకు అందిస్తున్నామని తెలిపారు. వానకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాల కొరత లేదని చైర్మన్ స్పష్టం చేశారు. సన్న రకాలు, బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638.
దొడ్డు రకాలు, కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010. పచ్చిరొట్ట విత్తనాలు: జీలుగ, జనుము విత్తనాలు కూడా సకాలంలో అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులకు, డీలర్లకు కీలక ఆదేశాలు ఇచ్చారు. లైసెన్స్ కలిగిన ప్రతి విత్తన డీలర్ ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తులను తప్పనిసరిగా విక్రయించాలి.
ఈ వానకాలంలో ఉమ్మడి జిల్లాల్లో 2.68 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా వేస్తుండగా.. అందుకు 66 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమవుతుంది. ఇందులో 30 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి.
రాబోయే నూతన విత్తన చట్టం ద్వారా రైతుల హక్కులతో పాటు, డీలర్ల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడుతుందని భరోసా ఇచ్చారు.
ఈ సమావేశంలో ఇరు జిల్లాల వ్యవసాయ అధికారులు (DAO), ఏడీఏలు, ఎంఏఓలు, సహకార శాఖ అధికారులు (DCO), విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, డీలర్లు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

## జిల్లా గ్రంథాలయంలో ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు



జయశంకర్ భూపాలపల్లి మే 30 (వుదయం జిల్లా ప్రతినిధి)
జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో శనివారం భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర ఐటీ భారీ పరిశ్రమలు
శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు 57వ జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు కేక్ కట్ చేసి తీపి పంపకాలు జరిపి మంత్రి శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు మాట్లాడుతూ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నిండు నూరేళ్లు జీవించి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఇంకా మంచి ఉన్నతమైన పదవులు పొంది తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో పాలుపంచుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న అని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అశోక్, కుమారస్వామి, గ్రంథాలయ సిబ్బంది, లైబ్రేరియన్ జీ రాణి, పాఠకులు తదితరులు పాల్గొన్నారు

## బాలికల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి

: జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 30 (వుదయం ప్రతినిధి)
ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కౌమారదశ బాలికలతో మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరై బాలికలు నిర్వహించిన మాక్ పార్లమెంట్‌ను పరిశీలించారు. బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, మహిళా హక్కులు, విద్య ప్రాధాన్యత వంటి అంశాలపై బాలికలు నిర్వహించిన చర్చలను అభినందించారు.
ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ ద్వారా బాలికలకు పార్లమెంటరీ వ్యవస్థ, చట్టసభల పనితీరు, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లుల ప్రవేశపెట్టడం, చట్టాల రూపకల్పన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళా సాధికారత, ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల పాత్ర, సామాజిక బాధ్యతలు, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అంశాలపై చర్చలు నిర్వహించారు. ఈ స్నేహ గ్రూపుల సభ్యులైన బాలికలతోనే మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.
పార్లమెంట్ ఎలా పనిచేస్తుంది, ప్రజలకు సంబంధించిన అంశాలు ఎలా చర్చకు వస్తాయి, బిల్లులు ఎలా ప్రవేశపెడతారు, చట్టాలు ఎలా రూపొందుతాయి వంటి అంశాలను బాలికలు తెలుసుకోవడం అవసరమని కలెక్టర్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చలు, వాదోపవాదాలు కీలకమైనవని, ప్రతి చట్టం ప్రజల అవసరాలు, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించబడుతుందని తెలిపారు.
చట్టాలను రూపొందించడం శాసన వ్యవస్థ బాధ్యత కాగా, వాటిని అమలు చేయడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత అని కలెక్టర్ వివరించారు. చట్టాల అమలు తీరును న్యాయవ్యవస్థ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం అనేది ప్రజల భాగస్వామ్యంతో నడిచే గొప్ప వ్యవస్థ అని, దాని గురించి ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.
బాల్య వివాహాల నిర్మూలన, మహిళల భద్రత, మహిళా హక్కులు, వరకట్న నిషేధం, లింగ సమానత్వం, బాలికల విద్య వంటి అంశాలపై కౌమారదశలోనే అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. విద్యతో పాటు సామాజిక, రాజ్యాంగ, రాజకీయ అంశాలపై అవగాహన కలిగి ఉంటే బాలికలు భవిష్యత్తులో సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించగలరని తెలిపారు.
అనంతరం బాలికలు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రోహిత్ రాజుతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాలు, సమాజంలో ఎదురవుతున్న వివిధ సమస్యలపై బాలికలు ప్రశ్నలు అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి సరఫరా వల్ల యువత, కుటుంబాలపై పడుతున్న ప్రతికూల ప్రభావాలు, బెల్ట్ షాపులు, గుడుంబా వంటి మద్యపాన వ్యసనాల కారణంగా చిన్న వయస్సులోనే యువత బానిసలుగా మారుతున్న పరిస్థితులు, వాట్సాప్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా అపరిచితులతో పరిచయాల వల్ల ఎదురయ్యే ప్రమాదాలు, గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న బాల్య వివాహాల సమస్యలపై చర్చ జరిగింది. ఈ అంశాలపై ఎస్పీ బాలికలకు చట్టపరమైన నిబంధనలు, భద్రతా చర్యలు, జాగ్రత్తలపై సమగ్ర అవగాహన కల్పించారు.
జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి బాల్య వివాహాల నిర్మూలన, బాలల హక్కులు, బాలలపై హింస మరియు గృహహింస నివారణ, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమాజంలో బాలికలు ధైర్యంగా ముందుకు సాగేందుకు, తమ హక్కులను తెలుసుకొని వినియోగించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు .
ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన, అడిషనల్ డి ఆర్ డి ఓ బి.నీలేష్,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సోయం సుజాత , జెడ్పీ సీఈఓ & డీఈఓ నాగలక్ష్మి, సీపీఓ సంజీవరావు, డీడబ్ల్యూఓ స్వర్ణలెనినా , డీపీఎంలు, ఏపీఎంలు, కిశోర బాలికల సంఘాల సభ్యులు, ఇతర సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

రాష్ట్ర మహాసభకు బయలుదేరిన హమాలీలు



నల్గొండ, 30 (వుదయం ప్రతినిధి)
సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహిస్తున్న హమాలీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ అల్ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లకపాక రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనగామ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ హమాలి వర్కర్స్ ఫెడరేషన్ నాల్గవ రాష్ట్ర మహాసభలకు నల్గొండ దొడ్డి కొమరయ్య భవన్ నుంచి బయలుదేరిన ప్రతినిధుల వాహనాలను శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఇళ్లులేని పేదలకు హమాలి కాలనీలు నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు.హక్కుల కోసం పోరాడుతున్న కార్మికులను నిర్బంధాలకు గురిచేయడం సరికాదన్నారు. ఎస్‌బీఐ, బేవరేజెస్, మార్కెట్ యార్డులు, విద్యుత్ శాఖ గోదాములు వంటి ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న హమాలీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగ హమాలీలకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించడంతో పాటు, 50 సంవత్సరాలు నిండిన హమాలీలకు నెలకు రూ.9,000 పెన్షన్ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర మహాసభల్లో గత మూడు సంవత్సరాల కార్యకలాపాలను సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, గంజి రాజేష్, హమాలి ఫెడరేషన్ నాయకులు కత్తుల యాదయ్య, నేలగొందరాశి లింగయ్య, సుంకరబోయిన వెంకన్న, వనపర్తి సోములు, వెంబడి వెంకన్న, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన తోటల్లో అగ్ని ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

– జిల్లా అధికారి జినుగు మరియన్న



మహబూబాబాద్, మే 30 (వుదయం ప్రతినిధి) :
మహబూబాబాద్ జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటలను, బిందు సేద్య (డ్రిప్) పరికరాలను అగ్ని ప్రమాదాల నుండి రక్షించుకోవడానికి రైతులు తగిన నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ప్రస్తుతం 59,504 ఎకరాలలో ఆయిల్ పామ్, మామిడి, మిర్చి, మల్బరీ, కూరగాయలు మరియు ఇతర పండ్ల తోటలు సాగులో ఉన్నాయని ఆయన తెలిపారు.ప్రతి ఏటా ఎండ తీవ్రతకు తోటల్లో అగ్ని ప్రమాదాలు జరిగి పంటలతో పాటు డ్రిప్ పరికరాలు కూడా కాలిపోతున్నాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాలతో తోటల్లో పెరిగిన కలుపు, ఎండిన పిచ్చి గడ్డి పొదలు.పంట వ్యర్థాలను తోటల్లోనే తగలబెట్టడం.తోటల చుట్టూ యాజమాన్య పద్ధతులు పాటించకుండా వదిలేయడం.చేపట్టాల్సిన నివారణ చర్యల ద్వారా ఫైర్ లైన్ ఏర్పాటు, తోట చుట్టూ ఆరు అడుగుల దూరంలో ఎలాంటి ఎండిన ఆకులు, చెత్త లేకుండా 'ఫైర్ లైన్' ఏర్పాటు చేసుకోవాలి.తేమ సంరక్షణ, తోటల పాదులలో ఎల్లప్పుడూ తేమ ఉండేలా చూసుకోవాలి. దీనికోసం మల్చింగ్ (ఆచ్ఛాదన) పద్ధతిని మరియు బిందు సేద్యాన్ని ఉపయోగించాలి.వ్యర్థాల నిర్వహణ, ఎండిన ఆకులు, ఇతర పంట వ్యర్థాలను కాల్చకుండా, డీకంపోజర్ ఉపయోగించి ఎరువుగా మార్చుకోవాలి. కత్తిరింపులు (ప్రూనింగ్) చెట్లకు ఉన్న పిచ్చి తీగలు, ఎండు కొమ్మలను వర్షాల తర్వాత తొలగించాలి. క్రమ పద్ధతిలో కొమ్మల కత్తిరింపులు చేపట్టడం వల్ల కాయ కోత కూడా సులువవుతుంది.అంతర పంటలు, తోటలలో ఖాళీ స్థలం ఉంచకుండా అంతర పంటలు, కూరగాయలు లేదా పశుగ్రాసాన్ని సాగు చేయాలి.రైతులందరూ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ తమ పంటలను అగ్ని ప్రమాదాల నుండి కాపాడుకోవాలని జిల్లా అధికారి కోరారు.

## అత్యుత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు.

జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి.



ములుగు, మే 30 (వుదయం ప్రతినిధి) :
మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించడం అదృష్టంగా భావించాలని, ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ కాదని ఆరోగ్యరీత్యా విరమణ అని జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మామిడాల ప్రకాష్ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి మాట్లాడుతూ 61 సంవత్సరాలు పూర్తి చేసుకున్న అనంతరం జిల్లా స్థాయి నుండి అటెండర్ స్థాయి వరకు ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పదవి విరమణ పొందాల్సి ఉంటుందని అత్యుత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని అన్నారు. పదవి విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి నిజమైన జీవితం ప్రారంభమవుతుందని, ఆరోగ్యం ఐశ్వర్యం జీవితంలో ముఖ్యమైన అని అన్నారు. క్రింది స్థాయి ఉద్యోగం నుండి ఉన్నత స్థాయి ఉద్యోగం పొందడానికి ఉద్యోగం చేసే సేవలే గుర్తింపునిస్తాయని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కష్టంతో ఇష్టంగా ఉద్యోగ బాధ్యత నిర్వహించాలని అన్నారు. పదవి విరమణ పొందుతున్న ఉద్యోగులు వారి జీవితాలు ఆరోగ్యకరంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## అభివృద్ధికి నోచుకోని జహీరాబాద్ మున్సిపాలిటీ

**వసూళ్లు మీద ఉన్న బాధ్యత అభివృద్ధిలో ఎందుకు లేదు..?**
**మొహమ్మద్ ఇమ్రాన్ బీసీ మైనార్టీ సంగారెడ్డి జిల్లాఅధ్యక్షులు**



జహీరాబాద్ మే 30 (వుదయం ప్రతినిధి)

అధ్వానంగా మారిన జహీరాబాద్ మున్సిపాలిటీ ఏరియా కనీసం చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కారం కు నోచుకోవడం లేదు నగరంలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు ప్రధాన రహదారులపై గుంతలను ము దుపడం లేదు చెత్తతో మోరీలు నిండి రోడ్లపై మురికి నీరు ప్రవేశిస్తుంది డ్రైనేజ్ నీటితో రోడ్లన్నీ పాడవుతున్నాయి. ప్రధానంగా నగరంలో చిన్న చిన్న హోటల్ వాళ్లు రోడ్డుపై నీళ్లు వదులుతున్నారు. మున్సిపాలిటీ అధికారులు మాత్రం టాక్స్ వసూలు పనిలో పడ్డారు ప్రధాన రహదారులపై నిర్మిస్తామన్న ఆలోచన లేదు ఎంతసేపు మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా ఆలోచనచేస్తున్నారు కానీ ప్రధానంగా దుమ్ము ధూళి కాలుష్యంపై దృష్టి పెట్టడం లేదు జహీరాబాద్ ప్రాంతంలో కొత్తవారు ఎవరన్నా రావాలంటే భయ పడుతున్నారు. ఈ నగరం దుమ్ము ధూళి కాలుష్యంతో ప్రజల కంటి చూపును కూడా కోల్పోయే పరిస్థితి ఉంది కాబట్టి ఈ ప్రాంతానికి పెట్టుబడులు పెట్టడానికి కూడా రావడం లేదుమున్సిపాలిటీ అభివృద్ధి చెందుతే అక్కడ పెట్టుబడులు వస్తాయి పెట్టుబడులు వస్తే ప్రాంతం అభివృద్ధి చెందుతుంది మున్సిపాలిటీ ఎలక్షన్స్ ముగిసి మూడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఏ కొత్త పనిని కూడా ప్రారంభం చేయలేదు ప్రధాన రహదారులపై కాలువల నిర్మాణం చేస్తేనే రోడ్డు బాగుంటుంది వర్షం నీరు రోడ్డుపై నిలవడంతో రోడంతా పాడవుతుంది రోడ్డు పక్కన రెండు వైపులా ప్రధాన కాలువల నిర్మాణం చేపట్టాలి అప్పుడే రోడ్స్ అన్ని బాగుంటాయి. ఈ దిశగా అడుగులు ఎందుకు వేయడం లేదని పలువురు మున్సిపాలిటీ అధికారులను అడుగుతున్నారు. మీరు నగరాన్నినిర్మించి కనీస ప్రజల సౌకర్యాలను అందించి అప్పుడు టాక్స్ వసూలు చేయండి జహీరాబాద్ స్మార్ట్ సిటీగా రూపొందాలంటే ముందు మున్సిపాలిటీ అధికారులు మారాలి జిల్లా కలెక్టర్ జహీరాబాద్ మున్సిపాలిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలిఫోజులు ఇవ్వడం కాదు మన చుట్టూ జరిగే జహీరాబాద్ ప్రాంత లీడర్ల గొంతు మూగబోయింది చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న బడా లీడర్లు జహీరాబాద్ ప్రాంత పెద్ద లీడర్లకు ఫోటోలకు సమస్యకు పరిష్కారం చూపడమే నిజమైన లీడర్ లక్షణం తెలుసుకోండి అంటూ నిలదీస్తున్న మొహమ్మద్ ఇమ్రాన్ బీసీ మైనార్టీ సంగారెడ్డి జిల్లాఅధ్యక్షులు

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గద్వాల ముందంజ

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

గద్వాల మే 30 (వుదయం ప్రతినిధి)



జోగులాంబ గద్వాల జిల్లాలో వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనతో పాటు అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికార యంత్రాంగం ఆయా కొనుగోలు కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేశామన్నారు. ఇప్పటివరకు జరిగిన వరి ధాన్యం కొనుగోలులో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలోనే మందంజలో నిలిచిందన్నారు. గత 15 రోజులుగా 6 లక్షల దాన్యం సంచులను మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మొత్తం 76 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. రబీ సీజన్లో జిల్లావ్యాప్తంగా దొడ్డు రకం వరి 731 హెక్టార్లలో సాగు చేయగా 5487 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. అలాగే సన్నరకం వరి 30,576 హెక్టార్లలో రైతులు సాగు చేయగా 2,29,323 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు చెప్పారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రెండు రకాల వరి కలిపి 49,244 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చిందని, ఇందులో 48,015 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామన్నారు. 6761 మంది రైతుల నుంచి రూ.114.71 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటివరకు రూ.105.15 కోట్ల డబ్బులను చెల్లించడం జరిగిందన్నారు. 150 వాహనాల ద్వారా కేటాయింపులు జరిగిన 38 మిల్లులకు 47,998 మెట్రిక్ టన్నుల ధాన్యంను తరలించామన్నారు. ప్రతి . కేంద్రాల ద్వారా 60,085 మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనడం జరిగిందని, వీటి విలువ సుమారు రూ.36 కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. పలు కేంద్రాల వద్ద రవాణా, గోదాములు వంటి కొన్ని సమస్యలు ఉత్పన్నమైనప్పటికీ సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ అధికారులను అప్రమత్తం చేసి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ప్రతి కేంద్రానికి నోడల్ అధికారులను నియమించి కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ గోదాములతో పాటు అవసరమైన చోట ప్రైవేటు గోదాములను కూడా అద్దెకు తీసుకొని మొక్కజొన్న నిలువ చేసామన్నారు. లారీల కొరత వంటి సమస్యలను కూడా పరిష్కరించి త్వరితగతిన తూకం చేసిన మొక్కజొన్నను గోదాములకు తరలిస్తున్నామన్నారు. ఈ నెలాఖరుకు జిల్లాలో ఆయా కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి కొనుగోలు చేసే ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే తరచు సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా కొనుగోలు ప్రక్రియపై సమీక్ష నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేస్తున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ఎమ్మెల్యే విజయుడు**

ఆలంపూర్ మే 30 (వుదయం ప్రతినిధి)

జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు శనివారం అలంపూర్, వడ్డేపల్లి, ఇటిక్యాల, ఎర్రవల్లి, ఉండవెల్లి, రాజోళి, మనోపాడు మండలాలకు చెందిన 428 మంది లబ్ధిదారులకు మొత్తం 4,28,49,648 (నాలుగు కోట్ల ఇరవై ఎనిమిది లక్షల నలభై తొమ్మిది వేల ఆరు వందల నలభై ఎనిమిది రూపాయలు) రూపాయల గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల సమస్యలపై డీఈఓకు వినతి

నారాయణపేట మే 30 (వుదయం ప్రతినిధి)




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా లోని డీఈఓ గోవిందరాజు ఎంఈఓ బాలరాజ్ కి ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యల గురించి వివరిస్తూ జూన్ 12వ తేదీన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా స్టేషనరీ, స్కూలు యూనిఫామ్, నోటుబుక్కులు ఇలాంటివి ఏ ఒక్క పాఠశాలలో కూడా విక్రయించకుండా చూడాలని పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను బోధించాలని అర్హులైన ఉపాధ్యాయులను మాత్రమే ఎన్నుకోవాలని వారు ఈ సందర్భంగా అధికారుల దృష్టికి తీసుకుపోయారు. ఫీజు ఇష్టానుసారంగా తీసుకోకుండా పేద మధ్యతరగతి తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకొని ఫీజును తీసుకోవాలని ఫీజు నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చేటట్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో అపరిశుభ్రంగా ఉన్నాయని,పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా మిడ్ డే మిల్స్ లో మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని వారు అధికారులను కోరారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అన్ని రంగాలలో ముందుకు వచ్చేటట్లు దృష్టి పెట్టాలని వారు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నరేష్, నగర కార్యదర్శి సతీష్, కళాశాల అధ్యక్షుడు తరుణ్ నామాజీ తదితరులు పాల్గొన్నారు.

## తాండాల అభివృద్ధికి కేసీఆర్ కృషి మరువలేనిది

**మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి..**

మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి



నిజాంపేట మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన సేవాలాల్ మహారాజ్, దుర్గా భవాని అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.వేడుకల్లో భాగంగా గిరిజన మహిళలు నిర్వహించిన సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యాల్లో పాల్గొని సందడి చేశారు. నృత్య ప్రదర్శనకు గ్రామస్థులు, యువత హర్షధ్వానాలు వ్యక్తం చేశారు.అనంతరం సేవాలాల్ మహారాజ్, దుర్గా భవాని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు ఆనందంగా ఉండాలని, వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. గిరిజనుల అభ్యున్నతికి సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తాండాలను గ్రామపంచాయతీలుగా మార్చి స్వయం పాలనకు అవకాశం కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారికే దక్కుతుందని అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం విశేష కృషి చేసిందని తెలిపారు. రానున్న రోజుల్లో మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పద్మా దేవేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ,సుధాకర్ రెడ్డి, నందిగామ,నిజాంపేట పిఎసిఎస్ చైర్మన్ బాపురెడ్డి, నిజాంపేట, రజక్ పల్లి నస్కల్ బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నాగరాజు,వెంకటేష్,దుర్గయ్య, మాజీ ఎంపీపీ సంపత్, మండల కో ఆప్షన్ మాజీ సభ్యులు అబ్దుల్ అజీజ్, బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు బజారు రంజిత్ గౌడ్, మాజీ సర్పంచ్ గోపరి నరసింహులు, మాజీ ఎంపిటిసి పున్న వెంకటస్వామి, బి ఆర్ ఎస్ నాయకులు శ్రీకాంత్ గౌడ్, లచ్చపేట రాములు, వెంకటేశం, నరేందర్ నాయక్, శివలింగం, నగేష్, మంగ్య నాయక్, లక్ష్మీ నరసింహులు కొమురయ్య బండారి తిరుమల్, రాజుగౌడ్ , తదితరులు పాల్గొన్నారు

## విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు




**ప్రజా సంక్షేమానికి సమర్థవంతంగా వినియోగించాలి: మంత్రి దామోదర రాజనర్సింహ**

సంగారెడ్డి, మే 30: వుదయం జిల్లా ప్రతి నిధి.

జిల్లాలో విద్య, వైద్యం, తాగునీరు, పారిశుధ్యం తదితర ప్రజా అవసరాల అభివృద్ధికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.శనివారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, వివిధ పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులతో సీఎస్ఆర్ నిధుల కేటాయింపు, వినియోగంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకు పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ కింద వచ్చిన నిధులు, వాటి ఖర్చు వివరాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన కార్యక్రమాలపై మంత్రి ఆరా తీశారు.జిల్లాలో విద్య, వైద్యం, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సంస్థల మౌలిక వసతుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను ప్రాధాన్యతతో కేటాయించాలని సూచించారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో వాష్‌రూములు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్లు, డైనింగ్ హాళ్లు, డార్మిటరీలు, బెడ్లు, అదనపు తరగతి గదులు, ఫర్నిచర్, తాగునీటి సౌకర్యాలు, పారిశుధ్య వసతుల కల్పనకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని మంత్రి పేర్కొన్నారు.సీఎస్ఆర్ ప్రతిపాదనల అమలు, పురోగతిపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములై ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ప్రతీక్ జైన్, అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమలు, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో బాలికలు నాయకత్వం వహించాలి

**కిషోర బాలికలకు సైకిళ్లు పంపిణీ చేస్తాం, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ మే 30 (వుదయం ప్రతినిధి)




జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా వారోత్సవాల ముగింపు, స్నేహ కిషోర బాలికలు నిర్వహించినమాక్ పార్లమెంట్ ఎంతగానో ఆకట్టుకుంది.రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మే 25 నుండి 30వ తేదీ వరకు నిర్వహించిన మహిళా వారోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్నేహ కిషోర బాలికల సంఘాల ప్రతినిధుల మాక్ పార్లమెంట్, అవగాహన సదస్సు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థినుల ప్రతిభను ప్రశంసిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డి ఆర్ డి ఏ అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రజావాణి సమావేశ మందిరం అంతా విద్యార్థినుల ఉత్సాహభరిత ప్రసంగాలు, చర్చలతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య వాతావరణాన్ని తలపించింది.ఈ మాక్ పార్లమెంట్ ప్రత్యేక ఆకర్షణగా బాలికలు వివిధ రాజ్యాంగ పదవులను స్వయంగా నిర్వహించడం విజయవంతంగా నిలిచింది. రాష్ట్రపతిగా జ్ఞానేశ్వరి బాధ్యతలు స్వీకరించగా, లోక్‌సభ స్పీకర్‌గా యమున సభను సమర్థవంతంగా నిర్వహించారు. ప్రధానమంత్రిగా నందిని ప్రభుత్వ పక్ష చర్చలను ముందుండి నడిపించగా, లోక్‌సభ ప్రతిపక్ష నాయకురాలిగా నిఖిత ప్రభుత్వ విధానాలపై సూటిగా ప్రశ్నలు సంధించారు. వ్యక్తం చేయడం విశేషంగా నిలిచింది. సభలో ప్రశ్నోత్తరాల సెషన్‌లో కూడా వారు చురుకుగా పాల్గొని సమస్యలకు పరిష్కార సూచనలు ప్రతిపాదించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ....., ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటిని ప్రతి ఒక్కరు తెలుసుకొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బాలికలు విద్యలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని ఆయన సూచించారు. కుటుంబం మరియు సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గుర్తు చేశారు.కొంతమంది బాలికలు దూరప్రాంతాలకు బస్సులు లేకపోవడం చదువుకు దూరం అవుతు లను అందజేయనున్నట్లు కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు, అదనపు పీడీ రాజేశ్వరి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉమాపతి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల నాయకులు, మహిళలు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి మే 30 (వుదయం ప్రతినిధి)



జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ లో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించే వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులకు, అధికారులకు, ఆహ్వానితులందరికీ ఆహ్వానాలు, అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేడుకలకు వేదిక ఏర్పాట్లు సహా హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు పకడ్బందీగా కల్పించాలన్నారు. పోలీసు గౌరవ వందనంతో పాటు, బందోబస్తు కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. వేడుకల ప్రాంగణంలో తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, జెడ్పి సీఈవో యాదయ్య, సిపిఓ హరికృష్ణ, ఆర్డీవో సుబ్రహ్మణ్యం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం విజయవంతం

వెల్దండ మే 30 (వు దయం)

మండల పరిధిలోని కొట్ర గ్రామంలో మహిత హాస్పిటల్ డాక్టర్ యశోద బాయి మరియు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శివరాం సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ శారద చెన్నయ్య కలిసి ప్రారంభించారు. ఇట్టి హెల్త్ క్యాంపులో పాల్గొన్న రోగులకు డాక్టర్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ నారుమల్ల అన్నమ్మ మరియు వార్డు మెంబర్స్ కొప్పు మల్లేష్. జెనిగల సాయి యాదవ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు జెనిగల మల్లయ్య కొట్ల శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ వేడుకలు




మహబూబ్ నగర్ మే 30 (వుదయం ప్రతినిధి)

ప్రపపంచ పొగాకు వ్యతిరేక దినమును పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. కృష్ణ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము రామయ్య బౌలి వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అవగాహన ర్యాలీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నుండి పుర వీధుల గుండా శిల్పరామం వరకు నిర్వహించి, మానవ హారముగా ఏర్పడి పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.ర్యాలీని ఉద్దేశించి జిల్లా వైద్యాధికారి డా. కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ పొగాకు వ్యతిరేక స్యలు, క్యాన్సర్ కారకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం దీని ముఖ్యఉద్దేశ్యం అన్నారు.కార్యక్రమములో ఎన్ సి డి ప్రోగ్రాం అధికారి డా. శశికాంత్ , చైల్డ్ హెల్త్ ఇమ్యూనైజేషన్ అధికారి డా. పులి విద్య ,డా. విజయ్ , డా. మమత,హెల్త్ ఎడ్యుకేటర్లు నాగరాజు శెట్టి, హన్మంతు,నాగరాజు, సి హెచ్ ఓ వరమ్మ,అశోక్ రాజు, డిపిఓ సీతారాము, హెల్త్ సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏ ఎన్ ఎం లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ కె. హేమావతి

**జూన్ 2న డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలు అధికారులకు శాఖల వారీగా బాధ్యతల అప్పగింత సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఆదేశం**

సిద్దిపేట, మే 30 (వుదయం బ్యూరో)



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాలను జిల్లాలో అత్యంత ఘనంగా, వైభవంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు. శనివారం సిద్దిపేటలోని సమగ్ర జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జూన్ 2వ తేదీన నిర్వహించబోయే రాష్ట్ర అవతరణ దినోత్సవ ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది రాష్ట్ర అవతరణ దినోత్సవ ప్రధాన కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి, శాఖల వారీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సిద్దిపేట ఆర్డీవో ఈ మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని కలెక్టర్ వెల్లడించారు. రాష్ట్ర అవతరణ ఉత్సవాల విశిష్టత ప్రతిబింబించేలా వేదిక అలంకరణ, గ్రౌండ్ ముస్తాబు ఉండాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజలకు వివరించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు.గ్రామీణ అభివృద్ధి శాఖ, గృహ నిర్మాణం, వ్యవసాయం,హార్టికల్చర్, పౌరసరఫరాలు, సోలార్ పవర్, జనగణన 2027, ప్రత్యేక ఓటర్ నమోదుతో పాటు ఇతర అన్ని ముఖ్య శాఖలు తమ ప్రగతి స్టాల్స్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. కార్యక్రమ ముఖ్య అతిథి ప్రసంగ ప్రతులను ముందస్తుగా సిద్ధం చేయాలని, నాణ్యమైన పబ్లిక్ అడ్రెస్సింగ్ (సౌండ్) సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సీటింగ్ ఏర్పాట్లు దున, మైదానంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులతో కూడిన వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. గ్రౌండ్‌ను పూర్తిగా శుభ్రం చేయించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్‌ను, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అలాగే, వేడుకలకు వచ్చే అతిథులకు ముందస్తుగానే ఆహ్వాన పత్రికలను అందించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్, జిల్లా రెవెన్యూ అధికారి నాగరాజమ్మ, సిద్దిపేట ఆర్డీవో సదానందం, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాజ్ కుమార్, మరియు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం: కలెక్టర్ దీపక్ తివారీ

వికారాబాద్, మే 30: (వుదయం జిల్లా ప్రతినిధి)




బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలి .జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ.

బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులకు సూచించారు.99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహిళా వారోత్సవాల సందర్భంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బాలల మాక్ పార్లమెంట్ స్నేహ కౌమార బాలికలతో బాలల హక్కుల సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉన్నత శిఖరాలను అధిగమించవచ్చని దానికి విద్యార్థులు తమ నైపుణ్యాన్ని మెరుగు పరుచుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ నుండే సమాజంపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంటరీ సమావేశాల్లో చర్చించే విషయాలపై కూడా అవగాహన కల్పించుకోవాలని ఆయన తెలిపారు. నూతనంగా వచ్చిన ఏఐ విధానంపై అవగాహన కల్పించుకుని సాంకేతికతను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అని మహాత్మా గాంధీ సూచించిన విషయాన్ని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో తమ లక్ష్యాన్ని ఎంచుకోవడంలో ఉన్నత అధికారుల సలహాలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామ పంచాయతీ స్థాయిలో స్నేహ సంఘాల్లో సభ్యులుగా చేరాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికి జిల్లాలో 4500 స్నేహ సభ్యులుగా నమోదు చేసుకున్నారని, స్నేహ సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని, జిల్లా యంత్రాంగం తరపునుంచి తమ సహకారం కచ్చితంగా ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మాక్ పార్లమెంటరీలో విద్య, ఆరోగ్యం, హోం శాఖలపై చర్చించారు. మాక్ పార్లమెంటరీ లో స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మంత్రులుగా స్నేహ సంఘాల సభ్యులు మంచి పాత్రను పోషించారని జిల్లా కలెక్టర్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా నూతన అక్షరాస్యులుగా చదువు నేర్చుకున్న అభ్యాసకులకు, చదువు నేర్పిన వాలంటీర్లకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ శ్రీనివాస్, అదనపు డీఆర్డీఏ నర్సింలు, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, వయోజన విద్య జిల్లా ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాస్ బాబు, డీపీఎం నర్సింలు, కొమరయ్య, శేఖర్, నర్సింలు, జిల్లా మహిళా సమైఖ్య అధ్యక్షురాలు జానకీ, కార్యదర్శి శ్వేత, కోశాధికారి భాగ్య లక్ష్మి లతో పాటు స్నేహ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం రైతులకు శాపం: ప్రభుత్వంపై ప్రశాంత్ రెడ్డి విమర్శలు



నాగిరెడ్డిపేట,వుదయం ఎల్లారెడ్డి మండల కేంద్రంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు విస్తృత స్థాయి సన్నాహక సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద, కన్నారెడ్డి గ్రామాల రైతులు అడ్డగించి తమ సమస్యలను వివరించారు. వరి ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం మాజీ ఎమ్మెల్యేలు హనుమత్ షిండే, జనార్ధన్ గౌడ్, జాజాల సురేందర్, మాజీ ఎమ్మెల్సీ విజి గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజుతో కలిసి ఆయా గ్రామాల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ, రెండు నెలల క్రితం ప్రారంభించిన కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటికీ రైతుల ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు కాకపోవడం బాధాకరమని అన్నారు. కొనుగోళ్లలో ఆలస్యం కారణంగా రైతులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఇటీవల కురిసిన అకాల వర్షాలతో ధాన్యం తడిసి నాణ్యత కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, కొన్ని చోట్ల మొలకలు కూడా వస్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి, కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు పలుమార్లు ఆందోళనలు నిర్వహించారని, అధికారుల హామీలు అమలులోకి రావడం లేదని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో గ్రౌండ్ స్థాయి పరిస్థితులకు భిన్నంగా నివేదికలు పంపుతున్నారని ఆరోపించిన ఆయన, ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉన్న గ్రామాలకు ప్రాధాన్యత ఇచ్చి వెంటనే లిఫ్టింగ్ చేపట్టాలని అధికారులకు సూచించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఉమన్నగారి మనోహర్ రెడ్డి, నాయకులు బిట్ల మురళి, పుప్పాల నారాయణ, ఫరీద్, కాంతారెడ్డి, దుర్గారెడ్డి, వెంకట్రెడ్డి, మంగలి యాదగిరి, హనుమంత్ రెడ్డి, గులపల్లి నారాయణ, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు, రవాణా,నిల్వ, నిబంధనల ప్రకారం చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల/మే 30, 2026(వుదయం ప్రతినిధి)రైతు సంక్షేమంలో ప్రభుత్వం చేపట్టిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎ సి సి ప్రాంతంలో గల హనుమాన్ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం దిగుమతి, నిల్వ ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దాన్యం నిల్వ, తరలింపులో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశిత సమయానికి అనుగుణంగా ధాన్యం ప్రక్రియను వేగవంతం చేయాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. అనంతరం నస్పూర్ మండలంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా 30 మే 2026 (వుదయం ప్రతినిధి)



కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. సిబ్బంది పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు రాజశ్రీ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల శ్రేయస్సు కొరకై పోరాటం ..

**ఏఐటియుసి సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ**




మంచిర్యాల/రామకృష్ణాపూర్మే 30(వుదయం ప్రతినిధి)మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సిహెచ్పి లో ఏఐటియుసి ఫిట్ కార్యదర్శి హరి రామకృష్ణ ఆధ్వర్యంలో యూనియన్ సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ ,వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ మాట్లాడుతూ..ఒరిస్సాలో జరిగిన ఇండియన్ మైన్స్ వర్కర్స్ ఫెడరేషన్ మహాసభలో పలు కీలక తీర్మానాలు ప్రవేశపెట్టినట్లు వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వపు నాలుగు లేబర్ కోడ్ల గెజిట్ అమలుకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలను కలుపుకొని పోరాడుతామని అన్నారు. 12వ వేజ్ బోర్డు విధివిధానాలు ప్రకటించాలని, పెన్షన్ పెంచాలని, కాంట్రాక్ట కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కొత్త భావులు రావాలని ,మెడికల్ బోర్డు ప్రారంభించాలని, సొంతింటి కల నెరవేర్చాలని, కార్మికుల టాక్స్ కంపెనీ చెల్లించాలని సింగరేణి సంస్థ ను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. మందమర్రి సి,ఈ,సర్ క్లబ్ లో నేడు జరిగే జనరల్ బాడీ మీటింగ్ కు ప్రతి ఒక్కరు హాజరుకావాలని కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు సీతారామయ్య, సెక్రటరీ రాజ్ కుమార్ లు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి వేణుగోపాల్, సభ్యులు సిరాజుద్దీన్, కృష్ణస్వామి, సీతారామరావు, క్రాంతి, భాస్కర్, శ్రీనివాస్, రామకృష్ణ, రజిత, పద్మ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి



లక్షెట్టిపేట్, మే 30 (వుదయం న్యూస్): మండలం గుల్లకోట వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ గా పని చేస్తున్న షేర్ల శైలజ (38) అనే మహిళ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిందని ఎస్సై సురేష్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... లక్షెట్టిపేట్ లో శుక్రవారం రాత్రి జరిగిన ఎంపీడీవో రిటైర్మెంట్ వేడుకలకు భర్త పిల్లలతో కలిసి హాజరయ్యారన్నారు. వేడుకలు అనంతరం రాత్రి 10 గంటలకు బైక్ పై మంచిర్యాలకు తిరిగి వెళ్తుండగా గుల్లకోట వద్ద అకస్మాత్తుగా అడవి పంది పిల్ల అడ్డురావడంతో కింద పడిపోయారు. కింద పడిపోవడంతో మృతురాలి తలకు గాయాలయి మృతి చెందగా, భర్తకు, పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. మృతురాలి తమ్ముడు షేర్ల శివకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# సుధీర్గ కాలం విశిష్ట సేవలు అందించిన అన్నారావు.

**జిల్లా ఎస్పీ నికిత పంత్.**



ఆసిఫాబాద్,( ఉదయం ప్రతినిధి ): జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సీనియర్ అసిస్టెంట్ అన్నారావు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారావును శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి ఆయన సేవలను కొనియాడారు. కాగజ్నగర్ ప్రాంతానికి చెందిన అన్నారావు 2003లో స్వీపర్గా పోలీసు శాఖలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అనంతరం రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్గా పనిచేసి, క్రమంగా పదోన్నతులు పొందుతూ సీనియర్ అసిస్టెంట్ హోదాకు చేరుకున్నారు.సుదీర్ఘకాలం శాఖకు విశిష్ట సేవలు అందించిన ఆయన పదవీ విరమణ సందర్భంగా సహోద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ నితికా పంత్ మాట్లాడుతూ అన్నారావు తన విధుల్లో అంకితభావంతో పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ఆయన చూపిన క్రమశిక్షణ, నిబద్ధత ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) చిత్తరంజన్, జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, ఏవో భక్త ప్రహ్లాద్, జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వరద సహాయక కార్యక్రమాల్లో విశేష సేవలందించిన యూఎస్టీ సంస్థకు జిల్లా కలెక్టర్ ప్రశంస



కామారెడ్డి, మే 30 (వుదయం ప్రతినిధి):2025 సంవత్సరంలో కామారెడ్డి జిల్లాలో సంభవించిన వరదల సమయంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమాల కింద విశేష సేవలు అందించిన హైదరాబాద్కు చెందిన యూఎన్టీ సాఫ్ట్వేర్ సంస్థ ప్రతినిధులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం తన ఛాంబర్లో అభినందించారు.వరదల ప్రభావానికి గురైన కుటుంబాలకు యూఎస్టీ సంస్థ 600 డిజాస్టర్ ఫ్లడ్ రిలీఫ్ కిట్లను పంపిణీ చేసి సకాలంలో మానవతా సహాయాన్ని అందించిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అనేక కుటుంబాలకు అత్యవసర సహాయం అందిందని, సమాజ సేవ పట్ల సంస్థకు ఉన్న నిబద్ధతకు ఇది నిదర్శనంగా నిలిచిందన్నారు.యూఎన్టీ సిఎస్ఆర్ అంబాసడర్ తిరుమల విజయ్ కుమార్తో పాటు వాలంటీర్ బృంద సభ్యులు రాధికా పెరుమాళ్, షాహుల్ సయ్యద్, సురేంద్రనాథ్ తిరునగరం, బిక్షపతి ఎండ్లా చేసిన సేవలను జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో సహాయక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచినందుకు వారికి ప్రశంసలు తెలిపారు.

జిల్లా ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపుగా యూఎస్టీ సంస్థ ప్రతినిధులకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా యూఎస్టీ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో విద్య, వైద్య రంగం, డిజిటల్ మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి తదితర రంగాల్లో భవిష్యత్తులో సీఎస్ఆర్ కార్యక్రమాలను విస్తరించే అవకాశాలపై చర్చించారు. జిల్లా అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాల్లో రాబోయే సంవత్సరాల్లో కూడా యూఎస్టీ సంస్థ తమ సహకారాన్ని కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కోరారు.సమాజాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి దోహదపడే సీఎస్ఆర్ కార్యక్రమాలలో జిల్లా పరిపాలన యూఎస్టీ సంస్థతో భవిష్యత్తులో కూడా కలిసి పని చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష



కామారెడ్డి, వే 30 (వుదయం ప్రతినిధి):జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ తో కలిసి కార్యక్రమాల నిర్వహణ, కార్యాచరణ ప్రణాళిక, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపు చర్యలపై చర్చించారు.జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా మొక్కల నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు, విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రకృతి సంరక్షణపై చర్చా వేదికలు, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, గ్రామస్థాయిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

# ఉద్యోగ విరమణ పోలీస్ అధికారులకు ఘన సన్మానం

**కుటుంబం కోసం సమయాన్ని కేటాయించాలి : సీపీ అంబర్ కిషోర్ ఝా**

పెద్దపల్లి, మే 30: (వుదయం కరస్పాండెంట్ న్యూస్)



తమ కుటుంబ క్షేమం కన్నా సమాజ శాంతి భద్రతల కోసం నిరంతరం విధులు నిర్వహించేది పోలీసులు మాత్రమేనని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులు ఇకపై కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతూ ఆనందకర జీవితం గడపాలని ఆకాంక్షించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను శనివారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సన్మానించారు. కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ కె. వేణుగోపాల్, ఏఎస్ఐ ఎం. సురేందర్ రెడ్డిలకు పూలమాలలు వేసి జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ, కొన్ని సందర్భాల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు సేవలు అందిస్తారని కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో విశేష సేవలందించిన ఈ అధికారులు రాబోయే తరం పోలీసులకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, యోగా, వ్యాయామం అలవాటు చేసుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులతో సమయం గడుపుతూ సుఖసంతోషాలతో జీవితం కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, రామగుండం పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం, పదవీవిరమణ పొందిన పోలీస్ అధికారుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీధర్ బాబు సేవలు వెలకట్టలేనివి

**ఐటీ రంగ అభివృద్ధిలో మంత్రి శ్రీధర్ బాబు దిట్ట**

**మంత్రి జన్మదిన వేడుకల్లో ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు**



పెద్దపల్లి వే 30: (వుదయం కరస్పాండెంట్)తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సేవలు వెలకట్టలేనివని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.శనివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణకు అనేక పారిశ్రామిక సంస్థలను తీసుకువచ్చారని కొనియాడారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేసి కొత్త పరిశ్రమలు తీసుకురావాలని ఆకాంక్షించారు. మంత్రి శ్రీధర్ బాబు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్ మాట్లాడుతూ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు వారసత్వాన్ని కొనసాగిస్తూ మంత్రి శ్రీధర్ బాబు జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు.మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్ రావు మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రాంత అభివృద్ధికి మరింత చేయూతనందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీష్, నాయకులు సాయిరి మహేందర్, దణ్ణాయక్ దామోదర్ రావు, పన్నాల రామన్న, అమీరిశెట్టి రాజలింగం, కల్లేపల్లి జానీ, శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# డేంజర్ జోన్ నిర్వాసితుల కోసం నిధుల మంజూరుపై హర్షం

**మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం**



మల్హర్ రావు, మే 30: (వుదయం ప్రతినిధి)తాడిచెర్ల గ్రామంలోని డేంజర్ జోన్లో నివసిస్తున్న భూనిర్వాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ తీసుకుని రూ. 261 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.మంత్రి శ్రీధర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం తాడిచెర్ల గ్రామంలో పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రచార కార్యదర్శి బూడిద రాజసమ్మయ్య మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేంజర్ జోన్లో నివసిస్తున్న కుటుంబాల సమస్యలను గుర్తించి, నిర్వాసితులకు న్యాయం జరిగేలా మంత్రి శ్రీధర్ బాబు కృషి చేయడం అభినందనీయమన్నారు. గ్రామ ప్రజల భద్రత దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నిధులు మంజూరు కావడం పట్ల గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితునికి ఇన్సూరెన్స్ చెక్కు అందజేత



?ధర్మపురి,మే 30 (వుదయం ప్రతినిధి):రోడ్డు ప్రమాదంలో మరణించిన గాయత్రి బ్యాంక్ ఖాతాదారుడి కుటుంబానికి ప్రమాద బీమా కింద రూ.1లక్ష ఆర్థిక సాయం అందింది. రాజారం గ్రామానికి చెందిన జెల్ల సత్తయ్య గతేడాది మార్చి 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆయనకు ధర్మపురి గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లో గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతా ఉండటం తో దానికి వర్తించే ప్రమాద బీమా రూ.1 లక్ష చెక్కును శనివారం మృతుడి భార్య మల్లవ్వకు అందజేశారు.?ధర్మపురి సీఐ రామ నరసింహ రెడ్డి,ఎస్ఐ మహేశ్, బ్యాంక్ మేనేజర్ వొఝుల మోహన్ చేతుల మీదుగా ఈ చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడు తూ తక్కువ డిపాజిట్ తోనే పేద, మధ్యతరగతి వినియోగదారులకు బీమా సౌకర్యం కల్పిస్తూ బ్యాంక్ అండగా నిలవడం అభినందనీయమన్నారు.?బ్యాంక్ మేనేజర్ మోహన్ మాట్లాడు తూ ధర్మపురి పరిసర ప్రాంతాల్లో 24 గంటల ఏటీఎం,మైక్రో ఏటీఎం,ఏఈపీ ఎస్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే తక్కువ వడ్డీకే బంగారంపై గ్రాముకు అత్యధికంగా రూ.8వేల600 వరకు రుణాలు, వ్యవసాయ, వ్యాపార రుణాలు ఇస్తున్నామన్నారు. ఖాతాదారుల సౌకర్యార్థం 15 మంది బ్యాంకింగ్ కరెస్పాండెంట్లను నియమించామని, మొబైల్ బ్యాంకింగ్,యూపీఐ సేవలతో పాటు ఉచితంగా ఫొటో,జిరాక్స్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## తాజ్ జీవీకే ఆదాయం రూ.161 కోట్లు

ఆతిథ్య రంగంలోని తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్, మార్చి త్రైమాసికంలో రూ.161.30 కోట్ల ఆదాయం, రూ.319.75 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గ్రీన్‌వుడ్స్ ప్యాలెసెస్ అండ్ రిసార్ట్స్‌లో సంస్థ అదనంగా 2.01% వాటా కొనుగోలు చేసి, తన మొత్తం వాటాను 51 శాతానికి పెంచుకోవడంతో, సంస్థకు అనుబంధంగా మారింది. ఈ కొనుగోలు ద్వారా రూ.282.64 కోట్ల అసాధారణ లాభం తాజ్ జీవీకే కు కలిసొచ్చింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఆదాయం రూ.517.02 కోట్లు, నికర లాభం రూ.410.27 కోట్లుగా ఉన్నాయి. హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్, చెన్నైలోని తాజ్ క్లబ్ హౌస్, తాజ్ చండీగఢ్‌లలో రూ.8.01 కోట్లతో పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్లు సంస్థ వెల్లడించింది.




# ఇండిగోకు రూ.2,537 కోట్లు నష్టం




దేశీయ అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో, జనవరి-మార్చి త్రైమాసికానికి రూ.2,537 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ క్షీణించడం, కార్మిక చట్టంలో మార్పులు, కార్యకలాపాల నిర్వహణలో సవాళ్లు ఇందుకు కారణమయ్యాయి.2024-25 ఇదే కాలంలో సంస్థ రూ.3,067.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించడం గమనార్హం. ఏడాది వ్యవధిలో మొత్తం ఆదాయం రూ.23,097.50 కోట్ల నుంచి 3% పెరిగి రూ.23,830.70 కోట్లకు చేరింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికీ ఇండిగో రూ.2,393.60 కోట్ల నష్టాన్ని చవి చూసింది. 2024-25లో రూ.7,502.50 కోట్ల నికర లాభాన్ని సంస్థ నమోదు చేసింది. అయితే గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం 6.4% పెరిగి రూ.89,513.40 కోట్లకు చేరింది.

నష్టం ఎందుకంటే..: 2025-26లో విదేశీ మారకపు ద్రవ్యం రూపంలో రూ.8,100 కోట్ల నష్టం వచ్చిందని కంపెనీ తెలిపింది. 2025 డిసెంబరులో విమాన సర్వీసుల్లో ఏర్పడిన భారీ అంతరాయాల వల్ల, రూ.580 కోట్ల ప్రతికూల ప్రభావం పడిందని వెల్లడించింది. కొత్త కార్మిక చట్టాల అమలుకు సంబంధించిన వ్యయాలు రూ.1,200 కోట్లుగా నమోదయ్యాయి. '2025-26లో చాలా సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొన్నాం. ఈ పరిణామాలే లాభదాయకతపై ప్రభావం చూపాయి. అయితే మా సీట్ల సామర్థ్యం 9.5% పెరిగింద'ని ఇండిగో ఎండీ రాహుల్ భాటియా తెలిపారు.

# పెరిగిన ఏషియన్ పెయింట్స్ లాభం




ఏషియన్ పెయింట్స్, మార్చి త్రైమాసికంలో రూ.1185.49 కోట్ల ఏకకృత నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాల లాభం రూ.700.83 కోట్ల కంటే ఇది 69.15% అధికం. ఇదే సమయంలో విక్రయ ఆదాయం రూ.8329.59 కోట్ల నుంచి రూ.9228.46 కోట్లకు పెరిగింది. రంగుల పరిమాణం, విలువ పరంగా కూడా సమీక్షా త్రైమాసికంలో రెండంకెల వృద్ధి సాధించడం, పారిశ్రామిక - వాహన రంగాల నుంచి గిరాకీ లభించడం ఇందుకు కారణమని సంస్థ పేర్కొంది. దేశీయ అలంకరణ విభాగంలోనూ గిరాకీ అధికంగా ఉన్నట్లు తెలిపింది. శ్రీలంక, ఈజిప్ట్, యూఏఈల్లో వృద్ధి వల్ల, అంతర్జాతీయ విక్రయాలు 11% పెరిగి రూ.888.1 కోట్లుగా నమోదయ్యాయి. వ్యయాలు కూడా 7.6% పెరిగి రూ.7829.17 కోట్లకు చేరాయి. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరంలో సంస్థ లాభం రూ.4394.69 కోట్లుగా, ఆదాయం రూ.36,307.34 కోట్లుగా నమోదయ్యాయి. తుది డివి

డెండుగా రూ.23 ఇవ్వాలని కంపెనీ బోర్డు ప్రతిపాదించింది. పశ్చిమాసియా సంక్షోభ పరిణామాలు, సమీప కాల అనిశ్చితులకు కారణమవుతున్నట్లు సంస్థ ఎండీ అమిత్ పేర్కొన్నారు.

# మిధాని లాభంలో 38% వృద్ధి




రక్షణ, అంతరిక్ష, విద్యుత్ రంగాలకు అవసరమైన టైటానియం మిశ్రమాలు, స్పెషల్ స్టీల్స్, సూపర్ అల్లాయ్స్ తయారీలో నిమగ్నమైన కేంద్ర ప్రభుత్వ సంస్థ మిశ్ర ధాతు నిగమ్ (మిధాని).. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలు ప్రకటించింది. ఏకీకృత ఆదాయం రూ.552.75 కోట్లుగా నమోదైంది. 2024-25 ఇదే కాల ఆదాయం రూ.410.56 కోట్లతో పోలిస్తే ఇది 34.63% అధికం. ఇదే సమయంలో నికర లాభం రూ.56.14 కోట్ల నుంచి 38.49% వృద్ధితో రూ.77.75 కోట్లకు పెరిగింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరంలో సంస్థ చరిత్రలోనే అత్యధికంగా రూ.1,208.63 కోట్ల ఆదాయం ఆర్జించింది. నికర లాభం రూ.130.79 కోట్లుగా నమోదైంది. రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.1.25 చొప్పున డివిడెండ్‌ను బోర్డు ప్రతిపాదించింది. 2026 ఏప్రిల్ 1 నాటికి సంస్థ చేతిలో ఉన్న మొత్తం ఆర్డర్ల విలువ రూ.2,290 కోట్లు. గత ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 700 టన్నుల టైటానియం అల్లాయ్ ఉత్పత్తిని సాధించింది. అయోధ్య శ్రీరాముడి ఆలయ నిర్మాణానికి 31 టైటానియం కిటికీలను సరఫరా చేసింది. భవన నిర్మాణ ప్రయోజనాల కోసం టైటానియం అందించిన తొలి సంస్థగా నిలిచింది. దిల్లీలో రాష్ట్రపతి సభా వేదిక కోసం 90 టన్నుల ఆర్మర్ గ్రేడ్ స్టీల్‌ను అత్యంత తక్కువ వ్యవధిలో సరఫరా చేసినట్లు సంస్థ వెల్లడించింది. ఏరో ఇంజిన్ల కోసం దేశంలోనే తొలిసారిగా 'క్యాస్ట్ సూపర్ అల్లాయ్ సింగిల్ క్రిస్టల్ బ్లేడ్' మెటీరియల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపింది.

# రూ.5.77 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




వరుసగా మూడో ట్రేడింగ్ రోజూ స్టాక్ మార్కెట్ నష్టాల్లో ముగిసింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలకు తోడు, ఈసారి వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే ఉండొచ్చన్న అంచనాలు ఆందోళన కలిగించగా.. ఎంఎస్‌సీఐ సూచీల్లో భారత కంపెనీల షేర్ల చేర్పులు, తొలగింపుల వల్ల మధ్యాహ్నం 3 తర్వాత 10 నిమిషాల్లోనే సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోయింది. ఆర్థిక, చమురు - గ్యాస్ రంగాల కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ కారణమైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 73 పైసలు పెరిగి 94.85 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 1.75% నష్టంతో 92.07 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.77 లక్షల కోట్లు తగ్గి రూ.464.97 లక్షల కోట్ల (4.88 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.
ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ 75,988.51 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ఆరంభమైంది.
మధ్యాహ్నం తర్వాత సూచీ నష్టాల్లోకి జారుకుంది. ఆఖరి అర గంటలో అమ్మకాల ఒత్తిడి తీవ్రం కావడంతో 1,092.06 పాయింట్ల నష్టంతో 74,775.74 వద్ద ముగిసింది.
ఎన్ఎస్ఈ నిఫ్టీ 359.40 పాయింట్లు కోల్పోయి 23,547.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. వారం మొత్తం మీద సెన్సెక్స్ 639.61 పాయింట్లు, నిఫ్టీ 171.55 పాయింట్లు నష్టపోయాయి. సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 4 మినహా మిగతావన్నీ నష్టాల్లో ముగిశాయి. ఎంఎస్‌సీఐ తన గ్లోబల్ స్టాండర్డ్ సూచీల్లో 4 భారత కంపెనీల షేర్లను చేర్చి, మరో నాలుగు కంపెనీలను షేర్లను తొలగించడంతో, 10 నిమిషాల్లోనే బీఎస్ఈ సెన్సెక్స్ 850 పాయింట్లు నష్టపోయింది. ఎంఎస్‌సీఐ గ్లోబల్ స్టాండర్డ్ సూచీలో భారత కంపెనీల వాటా ప్రస్తుతం 12.3 శాతంగా ఉంది.
ఎంఎస్‌సీఐ సూచీలో మార్పు చేర్పుల కారణంగా, భారత మార్కెట్ల నుంచి మొత్తంగా రూ.8,000 కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ జరిగినట్లు బ్రోకరేజీల వివరాల ఆధారంగా తెలుస్తోంది.






## ఆసియా గేమ్స్.. వైభవ్ ఎంట్రీ..

ఈ ఏడాది ఆసియా గేమ్స్‌కు సంబంధించిన బీసీసీఐ అందుబాటులో ఉండే ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేసింది. 30 మంది క్రికెటర్లతో కూడిన జాబితాను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్‌కు అందజేసింది. ఈ గేమ్స్ కు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఎంపిక చేసింది. ఇక, టీమ్‌ఇండియా టీ20 జట్టు కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పేర్లను చేర్చలేదు. ఈ ఏడాది సెప్టెంబరు 19 నుంచి అక్టోబరు 4 వరకు జపాన్ వేదికగా ఆసియా క్రీడలు జరగనున్నాయి. అయితే, అదే సమయంలో వెస్టిండీస్‌పై భారత్ స్వదేశంలో సిరీస్ ఖరారు చేసుకుంది. ఇందులో మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. దీంతో టీ20ల కోసం రెండు వేర్వేరు జట్లను సిద్ధం చేయాలని బీసీసీఐ (BCCI) ముందుగానే నిర్ణయించుకుంది.

# ఐపీఎల్ చరిత్రలో తొలిసారి.. రికార్డుల జాతర

ఐపీఎల్ 2026 సీజన్ ఎన్నో రికార్డులకు నెలవుగా మారింది. తాజాగా రెండో క్వాలిఫయర్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయంతో ఫైనల్‌కు చేరుకుంది. ఈ క్రమంలో పలు అరుదైన రికార్డులు నమోదయ్యాయి. మరి అవేంటో ఓ లుక్కేద్దాం.. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ముగ్గురు బ్యాటర్లు 700+ పరుగులు చేయడం ఇదే మొదటిసారి. ఈ ఎడిషన్‌లో వైభవ్ సూర్యవంశీ (776), శుభ్‌మన్ గిల్ (722), సాయి సుదర్శన్ (710) ఈ మైలురాయిని దాటారు. గిల్, సాయి ఇద్దరూ గుజరాత్ టైటాన్స్‌కు చెందిన బ్యాటర్లు. ఇలా ఒకే టీమ్‌కు చెందిన బ్యాటర్లు ఉండటం కూడా ఇదే తొలిసారి.
ఒక సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. ఈ ఎడిషన్‌లో వైభవ్ 72 సిక్స్‌లు కొట్టాడు. ఈ రికార్డుకు దరిదాపుల్లోనూ ఎవరూ లేకపోవడం గమనార్హం. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో సెంచరీ కొట్టిన ఏకైక కెప్టెన్ శుభ్‌మన్ గిల్. రాజస్థాన్‌పై రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో గిల్ 104 పరుగులు చేశాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక లక్ష్య ఛేదన చేసిన మ్యాచ్ ఇదే. రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 18.4 ఓవర్లలో ఛేదించింది. గత సీజన్‌లో ముంబయిపై పంజాబ్ కింగ్స్ ఛేదించిన 204 పరుగుల టార్గెట్ ఇప్పటివరకు అత్యధికం. వరుసగా రెండు మ్యాచుల్లోనూ హిట్ వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు సాయి సుదర్శన్. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో సాయి ఇప్పటి వరకు మూడుసార్లు హిట్ వికెట్ ఔటయ్యాడు. సింగిల్ ఎడిషన్‌లో.. ప్లేఆఫ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా వైభవ్ సూర్యవంశీ రికార్డు సృష్టించాడు. ఈ రెండు మ్యాచుల్లో 19 సిక్స్‌లు బాదాడు.




## అద్భుత బ్యాటింగ్ విన్యాసాలు..

వైభవ్ సూర్యవంశీ ఒక పది ఓవర్లు క్రీజులో ఉన్నాడంటే సెంచరీ అయిపోవాల్సిందే! గత మ్యాచ్‌లో 8వ ఓవర్లోనే అతను 97 పరుగుల మీదికి వచ్చేశాడు. కానీ శుక్రవారం 18వ ఓవర్ వరకు నిలిచినా.. సెంచరీ పూర్తి కాలేదు. బ్యాటింగ్‌కు పరిస్థితులు అంత అనుకూలంగా లేకపోవడం, బంతి బ్యాటు మీదికి రాకపోవడం, పైగా అవతలి ఎండ్‌లో క్రమం తప్పకుండా వికెట్లు పడుతుండడంతో.. వైభవ్ సహజ శైలిలో చెలరేగలేకపోయాడు. పరిస్థితులకు తగ్గట్లు కాస్త ఓపిగ్గా ఆడాల్సి వచ్చింది. అయినా సరే వీలు చిక్కినపుడల్లా ఫోర్లు, సిక్సర్లతో అలరించాడు. అదే పనిగా సిక్సర్లు బాదడమే కాదు.. పరిస్థితులకు తగ్గట్లు అన్వయించుకుని కూడా ఆడగలనని ఈ మ్యాచ్‌తో రుజువు చేశాడు. ఈ మ్యాచ్‌లో చూపించిన పరిణతితో వైభవ్ బ్యాటర్‌గా మరి కొన్ని మెట్లు ఎక్కేశాడు. కానీ వరుసగా రెండో మ్యాచ్‌లోనూ సెంచరీ ముంగిట ఔటవడం, తన జట్టు నిష్క్రమణ వైభవ్‌కు తీవ్ర ఆవేదన కలిగించేవే అయితేనేం.. ప్రపంచ మేటి క్రికెట్ లీగ్‌లో వైభవ్ అద్భుత బ్యాటింగ్ విన్యాసాలను అభిమానులను అలరించిన తీరు, టోర్నీకే ప్రధాన ఆకర్షణగా మారిన వైనం అసామాన్యం. అతను పంచిన వినోదానికి ఐపీఎల్ అభిమానులంతా థ్యాంక్స్ చెబుతూ ఉంటారనడంలో సందేహం లేదు.



## అతడు ఇంకా చిన్నపిల్లాడే..

ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్‌లో టాప్ స్కోరర్ వైభవ్ సూర్యవంశీ. అతడు 16 సీజన్లలో 776 పరుగులు చేసి శభాష్ అనిపించాడు. ఇందులో ఒక సెంచరీ, ఐదు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. నాకౌట్‌లో వరుసగా రెండు మ్యాచుల్లోనూ 97, 96 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. తాజాగా గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమితో రాజస్థాన్ ఇంటిముఖం పట్టింది. ఆ సమయంలో వైభవ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. సహచరులు అతడిని ఓదార్చిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. వాటిపై మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. వైభవ్‌ను అలా చూస్తుంటే బాధేసిందని తెలిపాడు. "మీరు ఒక్కసారి వైభవ్‌ను ముఖం చూడండి. తీవ్ర నిరుత్సాహం కనిపించింది. 15 ఏళ్ల చిన్న పిల్లాడు అతడు. కానీ, అతడి మైండ్‌సెట్ మాత్రం చాలా భిన్నంగా ఉంది. తమ జట్టు గెలవాలనే పట్టుదల ప్రదర్శించడం నిజంగా అభినందనీయం. గుజరాత్‌తో మ్యాచ్‌లో వైభవ్ చాలా బాగా ఆడాడు. అతడికి రవీంద్ర జడేజా, డొనావన్ ఫెర్రీరా నుంచి మాత్రం కాస్త సహకారం లభించింది. మిగతా బ్యాటర్లు చేతులెత్తేశారు. యశస్వి, ధ్రువ్, రియాన్, శనక.. ఇలా ప్రతి ఒక్కరూ త్వరగా పెవిలియన్‌కు చేరారు. అందుకే, ఈ మ్యాచ్ విజయం రేసులో ఆర్ఆర్ మొదట్నుంచీ లేదని చెప్పగలను. రాజస్థాన్ విజయానికి ఓటమికి మధ్య ఏకైక ప్లేయర్ వైభవ్ సూర్యవంశీనే. ఓ మూడు



ఓవర్లపాటు కనీసం అతడికి స్ట్రైక్ రాలేదు. సహచరుల నుంచి సహకారం లేకపోతే ఎంతటి బ్యాటర్‌కైనా కష్టమే" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. వైభవ్‌ను ఎలా ఆపాలో హేమాహేమీ బౌలర్లకు అర్థం కాలేదు. ఈ సీజన్‌లో అన్ని మ్యాచుల్లోనూ అతడు ఔటైనప్పటికీ.. అప్పటికే నష్టం జరిగిపోయేది. ఆర్ఆర్ ఆటగాడు జోఫ్రా ఆర్చర్ కూడా ఐపీఎల్ ముగిశాక.. వైభవ్‌కు ఎలాంటి బంతులు వేయాలో చెబుతానని ఊరించాడు. ఈ క్రమంలో భారత మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్టు పెట్టాడు. "15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని అడ్డుకొనేందుకు బాడీ లైన్ బౌలింగ్ వేయడం నచ్చలేదు. స్టార్ ప్లేయర్లతో ఆడుతున్నాడని నాకు తెలుసు. అయితే, నాలోని తండ్రి మాత్రం ఆ పద్ధతిలో బౌలింగ్‌ను అంగీకరించడం లేదు" అని పఠాన్ పోస్టు చేశాడు.

## కెప్టెన్సీకి పంత్ గుడ్ బై

వికెట్‌కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్.. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్సీ నుంచి వైదొలిగాడు. 2026 ఐపీఎల్‌లో ఎల్ఎస్‌జీ అత్యంత పేలవ ప్రదర్శన చేసిన నేపథ్యంలో




పంత్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. ఈ సీజన్‌లో లఖ్‌నవూ కేవలం నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచింది. పంత్ కెప్టెన్‌గానూ, బ్యాటర్‌గానూ ప్రభావం చూపలేకపోయాడు. అతను 14 ఇన్నింగ్స్‌ల్లో 28.36 సగటుతో 312 పరుగులుచేశాడు. స్ట్రైక్‌రేట్ 138.05 మాత్రమే. పంత్ సీజన్ మొత్తం లో ఒకే అర్ధ శతకం సాధించాడు. "కెప్టెన్సీ బాధ్యతల నుంచి తనను తప్పించాలని రిషబ్ పంత్ విజ్ఞప్తి చేశాడు. అతడి విన్నపానికి ఫ్రాంఛైజీ వెంటనే అంగీకారం తెలి పింది" అని లఖ్‌నవూ ఓ అధికారిక ప్రకటనలో తెలిపింది. "ఈ నిర్ణయం అంత తేలికైంది కాదు. కెప్టెన్‌గా పంత్ చేసిన సేవలకు మేం కృతజ్ఞులం. ఇప్పుడు మా దృష్టి సమష్టిగా జట్టును నిర్మించడంపైనే" అని లఖ్‌నవూ క్రికెట్ డైరెక్టర్ టామ్ మూడీ చెప్పాడు. 28 ఏళ్ల పంత్.. లఖ్‌నవూకు రెండో కెప్టెన్. 2022 నుంచి 2024 వరకు రాహుల్ ఆ జట్టుకు సారథిగా వ్యవహరించాడు. అతడి సారథ్యంలో తొలి రెండు సీజన్లు ప్లేఆఫ్స్ చేరిన ఎల్ఎస్‌జీ.. 2024లో ఏడో స్థానానికి పరిమితమైంది. తర్వాతి సీజన్‌కు అతను దిల్లీకి వెళ్లిపోయాడు. ఎల్ఎస్‌జీ 2025 మెగా వేలంలో పంత్‌ను రూ.27 కోట్లకు చేజిక్కించుకుంది. ఇప్ప టికీ లీగ్‌లో ఇదే అత్యధిక ధర. అయితే ఎల్ఎస్‌జీ తరఫున పంత్ ఇన్నింగ్స్ సవ్యంగా సాగలేదు. అతడి నాయకత్వంలో లఖ్‌నవూ 18 మ్యాచ్‌ల్లో ఓడి, 10 మ్యాచ్‌లు మాత్రమే గెలిచింది. 2025లో ఏడో స్థానంలో, 2026లో పదో స్థానంలో నిలిచింది.

# వుదయం సినిమా

MOVIE TIME!

## 'సేవ్ ది టైగర్స్3'.. ఈసారి నవ్వులు మూడింతలు

వుదయం సినిమా "ఎవడ్రా చెప్పింది 'పెళ్లంటే పండు వెన్నెల.. పెళ్లామంటే నిండు పున్నమి" అని ప్రశ్నిస్తున్నాడు అభినవ్ గోమఠం. ప్రియదర్శి, చైతన్యకృష్ణతో కలిసి ఆయన నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ వెబ్‌సిరీస్ 'సేవ్ ది టైగర్స్3' (Save The Tigers 3). ఇప్పటివరకూ రెండు భాగాలుగా వచ్చిన ఈ సిరీస్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి సిద్ధమైంది. నిత్య జీవితంలో భార్యభర్తల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలనే సరదాగా తెరపై ఆవిష్కరించిన తీరు కడుపుబ్బా నవ్వించింది.



## 'శ్రీనివాస మంగాపురం' తో హీరోగా పరిచయం కావడం అదృష్టం:

### శ్రీను&మంగా ఈవెంట్ లో హీరో జయకృష్ణ ఘట్టమనేని

వుదయం: తాతయ్య కృష్ణ గారు నాకు దేవుడితో సమానం. మహేష్ బాబాయ్‌కు డైహార్డ్ ఫ్యాన్‌ని. అశ్వినీ దత్ గారి నిర్మాణంలో 'శ్రీనివాస మంగాపురం' సినిమాతో హీరోగా పరిచయం కావడం అదృష్టంగా భావిస్తున్నాను: శ్రీను&మంగా ఈవెంట్ లో హీరో జయకృష్ణ ఘట్టమనేని 'ఆర్ఎక్స్ 100', 'మంగళవారం' వంటి విభిన్న చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న క్రియేటివ్ డైరెక్టర్ అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీనివాస మంగాపురం' హీరోగా పరిచయమౌతున్న జయకృష్ణ ఘట్టమనేని ఇప్పటికే తన స్టన్నింగ్ లుక్స్, ఆకట్టుకునే బేస్ వాయిస్‌తో మంచి ఇంప్రెషన్ క్రియేట్ చేశారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడిగా, మహేష్ బాబు అన్న కొడుకుగా భారీ అంచనాల మధ్య ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నారు. విజువల్‌గా అద్భుతమైన, వైలెంట్ రొమాంటిక్ డ్రామాగా రూపొందుతోంది. ఈ చిత్రంతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. లెజెండరీ నిర్మాత అశ్వినీ దత్ సమర్పణలో, జెమినీ కిరణ్ తన 'చందమామ కథలు' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. 'శ్రీనివాస మంగాపురం' ఒక గ్రాండ్ థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా శ్రీను&మంగా పాత్రలని పరిచయం చేస్తూ




గ్రాండ్ ఈవెంట్ నిర్వహించారు.శ్రీను & మంగా ఈవెంట్ లో హీరో జయకృష్ణ ఘట్టమనేని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. తాతయ్య కృష్ణ గారి పుట్టినరోజు సందర్భంగా మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది. తాతయ్య నాకు దేవుడితో సమానం. ఆయనపై నాకు ఉన్న అభిమానాన్ని మాటల్లో చెప్పలేను.

## లెజెండరీ దర్శకుడు, స్వర్గీయ దర్శకరత్న దాసరి నారాయణరావు

### ఘాట్‌ని పునరుద్ధరించిన 'రా కింగ్' మనోజ్ మంచు

వుదయం: దిగ్గజ దర్శకుడు, దర్శక రత్న దాసరి నారాయణ రావు ఘాట్ దుస్థితిపై సోషల్ మీడియాలో యాంకర్ గౌతమి ఓ వీడియో షేర్ చేశారు. ఆ వీడియో చూస్తే అక్కడి వాతావరణం, ఆ ఘాట్ స్థితి ఎలాఉందో స్పష్టంగాకనిపిస్తోంది. అయితే ఈ వీడియో వచ్చిన కొన్ని గంటల్లో 'రా కింగ్' మనోజ్ మంచు స్పందించి.. స్వయం గా ఆ ప్రదేశాన్ని సందర్శించి, శుభ్రపరిచే కార్యక్రమాలను ప్రారంభించారు. దాసరి పట్ల తనకున్న గౌరవాన్ని మనోజ్ ఇలా చాటుకున్నారు. ఈఘటనపై సోషల్ మీడియాలో మనోజ్ మంచు స్పందిస్తూ.. "దాసరి గారి ఘాట్ చుట్టూ ఉన్న ఈ పరిస్థితిని చూసి నిజంగా చాలా బాధ కలిగిం ది. దాసరి నారాయణరావు గారు తరతరాలకు స్ఫూర్తినిచ్చి, తెలుగు సినిమాకు ఎంతో దోహదపడ్డారు. ఈ విషయాన్ని అందరి దృష్టికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు. నా వంతు గా నేను చేయగలిగి సహాయం చేస్తానని హామీ ఇస్తున్నా ను' అని ట్వీట్ వేశారు.ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మనోజ్ తన సినిమా షూటింగ్‌కి వెళ్లే కంటే ముందు ఉదయం 7:00 గంటలకల్లా తన బృంద సభ్యులతో కలిసి దాసరి ఘాట్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మూడు, నాలుగేళ్ల క్రితం నేను ఇక్కడకు వచ్చాను. ప్రస్తుతం ఇక్కడ ఇలాంటి పరిస్థితుల్ని చూసి చాలా బాధపడ్డాను. చిత్రపురి కాలనీ దాటుతుండగా, ఆయన విగ్రహం కనిపించి ఘాట్ గుర్తొచ్చింది. ఆ వీడియా మా టీం నాకు చూపించడంతో అసలు విషయం తెలిసింది. ఆ దృశ్యాలు నన్ను తీవ్రంగా బాధించాయి. నేను తట్టుకోలేకపోయాను. అందుకే దీనికి ప్రాధాన్యతనిచ్చి, నా షూటింగ్‌కు వెళ్లే ముందు ఇక్కడికి వచ్చాను' అని అన్నారు.




## "చెన్నై లవ్ స్టోరీ" మూవీ సాంగ్స్, రిలీజ్

వుదయం: హీరో కిరణ్ అబ్బ వరం, శ్రీ గౌరి ప్రియ జంటగా "కలర్ ఫోటో", "బేబి" వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్



లో రూపొందుతున్న సినిమా "చెన్నై లవ్ స్టోరీ". ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ "చెన్నై లవ్ స్టోరీ" సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా నుంచి రిలీజ్ చేసిన సాంగ్స్ మ్యూజిక్ లవర్స్ ఆదరణతో ఛాట్ బస్టర్స్ గా మారుతున్నాయి. ఫస్ట్ సింగిల్ 'తొలి ప్రేమేం తోపు కాదే..' ఇప్పటికే హ్యూజ్ రెస్పాన్స్ తెచ్చుకోగా, రీసెంట్గా ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి చేతుల మీదుగా రిలీజ్ చేసిన సెకండ్ సింగిల్ 'వద లనే..' పాట కూడా ఇన్ స్టంట్ గా సక్సెస్ అయ్యింది.

## 'మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్




వుదయం: శరణ్య–సుదీక్ష సమర్పణలో స్కంద ఫిల్మ్స్ బ్యానర్ మీద 'మన డాక్టర్ బాబే' అనే సినిమాని కృతాక్షి నిర్మిస్తున్నారు. ఈ మూవీతో శ్రీ స్కంద హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమాకి చలపతి కుమార్ పువ్వల స్టోరీ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం నాడు టీజర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వీఎన్ ఆదిత్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో..వీఎన్ ఆదిత్య మాట్లాడుతూ .. "మన డాక్టర్ బాబే' టీజర్ ఆద్యంతం వినోదభరితంగా ఉంది. ఇలాంటి మంచి కామెడీ సినిమాలు రావాలి. టైటిల్‌లో డాక్టర్, మన అని పదాలు అంటే కచ్చితంగా హిట్ అవుతుంటాయి. ఇలాంటి ప్రాజెక్టులకు తోడుగా నిలబడిన అలీ గారు, రాజీవ్ కనకాల గారికి థాంక్స్. ఏవీఎస్ గారి కూతురు శాంతి గారు మళ్లీ కం బ్యాక్ ఇవ్వడం ఆనందంగా ఉంది. ఈ సినిమాని అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.శ్రీ స్కంద మాట్లాడుతూ .. "మన డాక్టర్ బాబే' టీజర్ లాంచ్ ఈవెంట్‌కు వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ మూవీలోని ప్రతీ ఒక్కరూ మన సినిమా అని అనుకుని ఎంతో సపోర్ట్ చేశారు. చలపతి గారు అన్నీ తానై చేశారు. అన్ని బాధ్యతల్ని భుజానికెత్తుకున్నారు. ఇది చాలా మంచి కథ. ఇలాంటి సెన్సిటివ్ పాయింట్‌ను జాగ్రత్తగా తెరకెక్కించాం. టీజర్ చూసి కేవలం యూత్ సినిమా అని అనుకోకండి. ఇది కంప్లీట్ ఫ్యామిలీ మూవీ. క్లైమాక్స్ వరకు నవ్వుతూనే ఉంటారు. ఈవీవీ గారు, జంధ్యాల గారి సినిమాల్ని చూసినట్టుగా ఉంటుంది. ఈ మూవీకి హీరో కథ. నేను ఓ ఆర్టిస్ట్‌ని మాత్రమే.

## "టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ – 2026" నిర్వహిస్తున్నాం :

### టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్

వుదయం: చిత్ర పరిశ్రమలో కొత్త ప్రతిభను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) ముందుకొచ్చింది. తెలంగాణ రాష్ట్ర 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని "టీఎఫ్‌సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ – 2026" ను టీఎఫ్‌సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు.ఈ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదు. 5 నుంచి 25 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిలింలను ఔత్సాహిక దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు పంపవచ్చు. ఎంట్రీలను జూన్ 13వ తేదీ వరకు స్వీకరిస్తారు. జ్యూరీ ఎంపిక చేసిన విజేతలకు జూన్ 21న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో అవార్డులు ప్రదానం చేయనున్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నామని, ఇకపై ప్రతి ఏడాది దీన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం సినీ పరిశ్రమలో గుర్తింపు పొందిన పలువురు హీరోలు, దర్శకులు షార్ట్ ఫిలింల నుంచే తమ ప్రయాణాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు.ఈ ఫెస్టివల్‌లో బెస్ట్ స్టోరీ, బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ హీరో, బెస్ట్ హీరోయిన్, బెస్ట్ యాక్టర్, బెస్ట్ కో–ఆర్టిస్ట్, బెస్ట్ స్క్రీన్‌ప్లే, బెస్ట్ సినిమాటోగ్రాఫర్, బెస్ట్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, బెస్ట్ సపోర్టింగ్ యాక్ట్రెస్, జ్యూరీ అవార్డు, బెస్ట్ ప్రొడ్యూసర్, బెస్ట్ జర్నలిస్ట్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్



మీడియా), బెస్ట్ ఫోటో జర్నలిస్ట్, బెస్ట్ కెమెరామెన్ తదితర దాదాపు 20 విభాగాల్లో అవార్డులు అందజేస్తామని తెలిపారు. కొత్త ప్రతిభావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. టీఎఫ్‌సీసీ వైస్ ఛైర్మన్ గురురాజ్ మాట్లాడుతూ, కొత్త టాలెంట్‌ను వెలుగులోకి తీసుకురావడంలో డా. రామకృష్ణ గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఫెస్టివల్ నిర్వహించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. టీఎఫ్‌సీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అక్సాఖాన్ మాట్లాడుతూ, షార్ట్ ఫిలిం ఫెస్టివల్ ద్వారా ఎంతోమందికి తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం లభిస్తోందని చెప్పారు.

## జీ5లో ట్రెండింగ్ టాప్–1గా 'డ్రింకర్ సాయి'

వుదయం: ధర్మ మహేష్ హీరోగా కిరణ్ తిరుమల శెట్టి దర్శకత్వంలో ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించిన చిత్రం 'డ్రింకర్ సాయి'. "బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్" అనే ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలై యూత్, మాస్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుని పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఓటీటీలోనూ తన విజయయాత్రను కొనసాగిస్తోంది. జీ5 వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రం ప్రస్తుతం ఫ్రీ ఆన్ జీ5 విభాగంలో ఓటీటీ టాప్–1 ట్రెండింగ్ మూవీగా దూసుకుపోతూ ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకుంటోంది. ముఖ్యంగా ఈ సినిమాలో హీరో ధర్మ మహేష్ కనబరిచిన అద్భుత నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ప్రశంసలు అందుకుంటోంది. భావోద్వాలు, ప్రేమ, ఆవేశం, బాధ, తిరుగుబాటు స్వభావం వంటి విభిన్న కోణాలను ఆయన ఎంతో సహజంగా పండించారని ఆడియెన్స్ అభిప్రాయపడుతున్నారు.



## ఖమ్మంలో ల్యాబ్‌గ్రోన్ డైమండ్ జ్యువెలరీ స్టోర్ 'లాడియా' ఏడో షోరూమ్

వుదయం: ల్యాబ్–గ్రోన్ డైమండ్ జ్యువెలరీ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతున్న లాడియా సంస్థ ఖమ్మంలో తన ఏడో స్టోర్‌ను ఘనంగా ప్రారంభించింది. "డైమండ్స్ అందరికీ" అనే లక్ష్యంతో, వినూత్నత, విశ్వసనీయత మరియు కస్టమర్–ఫస్ట్ విధానంతో ముందుకు సాగు తున్న లాడియా, ల్యాబ్–గ్రోన్ డైమండ్ జ్యువెలరీ ప్రపంచాన్ని కొత్త దిశగా తీసుకెళ్తోంది. ఖమ్మంలోని ఈ నూతన స్టోర్‌ను ప్రముఖ నటి నేహా శెట్టి అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లాడియా డైరెక్టర్ అఖిల్ వేములూరి మాట్లాడుతూ, "ల్యాబ్–గ్రోన్ డైమండ్ రంగంలో భారత్ విశేష పురోగతి సాధించింది. ఈ రంగంలో మరిన్ని వినూత్న ఆలోచనలను అందిస్తూ ఆ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడానికి లాడియా కట్టుబడి ఉంది. తెలంగాణలోని ప్రముఖ జ్యువెలరీ కేంద్రం ఖమ్మంలో మా ఏడో స్టోర్‌ను ప్రారంభించడం మాకు ఎంతో




ఆనందంగా ఉంది" అని తెలిపారు.ల్యాబ్–గ్రోన్ డైమండ్లు పేరుకు తగ్గట్టుగానే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నైపుణ్యం కలిగిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ప్రయోగశాలల్లో తయారు చేస్తారు. ఇవి సహజ వజ్రాల మాదిరిగానే రిఫ్రాక్టివ్ ఇండెక్స్, ఆప్టికల్ లక్షణాలను కలిగి ఉంటాయి. సహజ వజ్రాలకు ఉపయోగించే అదే కలర్, క్లారిటీ ప్రమాణాలతో వీటిని కూడా గ్రేడ్ చేస్తారు.

## 'సేవ్ ది టైగర్స్' సీజన్ 3 ట్రైలర్..

వుదయం: జియో హాట్‌స్టార్‌లో 'సేవ్ ది టైగర్స్'కి వచ్చిన స్పందన అందరికీ తెలిసిందే. ఇప్పటికే రెండు సీజన్లు బ్లాక్ బస్టర్ హిట్‌లుగా నిలిచాయి. ఇక ఇప్పుడు మూడో సీజన్ స్ట్రీమింగ్‌కి రెడీ అయింది. జూన్ 19 నుంచి ఈ మూడో సీజన్ జియో హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఈ క్రమంలో అందరినీ ఆకట్టుకునేలా, వినోద భరితమైన ట్రైలర్‌ను విడుదల చేశారు.'ఎవరన్నా.. చిన్నప్పటి నుంచి పెళ్లి గురించి మనకు ఇన్ని అబద్దా లు చెప్పింది.. పెళ్లి అంటే పండు వెన్నెల, పెళ్లాం అంటే నిండు పున్నమి' అని రాహుల్ పాత్రలో అభినవ్ గోమటం చెప్పే డైలాగ్‌తో ట్రైలర్ ఓపెన్ అవుతుంది. బార్‌లో రాహుల్ (అభినవ్ గోమటం), విక్రమ్ (కృష్ణ చైతన్య), ఘంటా రవి (ప్రియదర్శి)




ముగ్గురూ కలిసి పెళ్లి గురించి, జీవితం గురించి మాట్లాడుకుంటూ ఉంటారు. మ్యారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అని అన్నడో నాకు దొరికితేనా? అని విక్రమ్ (కృష్ణ చైతన్య) అనడంతో స్వర్గంలో ఇంద్రుడి పాత్రలో వెన్నెల కిషోర్ ప్రత్యక్షం అవుతారు.

## హౌస్‌ఫుల్ షోలతో దూసుకెళ్తున్న "నేనెవరు?"

వుదయం: నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ ప్రధాన పాత్రలో, సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్య పాత్రల్లో యువ దర్శకుడు చిరంజీవి తన్నీరు రూపొందించిన సందేశాత్మక వినోదాత్మక చిత్రం "నేనెవరు?" మే 29న ప్రపంచవ్యాప్తంగా విడుదలై విజయవంతంగా ప్రదర్శిత మవుతోందని చిత్ర నిర్మాతలు అండేకర్ జగదీష్ బాబు, సకినాన భూలక్ష్మి తెలిపారు.సినిమా విడుదలైన అన్ని ప్రాంతాల్లో ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని, అనేక కేంద్రాల్లో హౌస్‌ఫుల్ షోలతో ప్రదర్శితమవుతోందని వారు వెల్లడించారు. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్‌తో రోజురోజుకూ థియేటర్ల సంఖ్య పెరుగుతోందని, మరిన్ని కేంద్రాల్లో చిత్రాన్ని ప్రదర్శించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.ఈ సంద ర్భంగా నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్ చిత్ర యూనిట్‌ను అభినందించారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.